12 . 10. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

ఆదివారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 134 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రిలలో చికిత్స పొందినప్పుడు ఆ ఖర్చును ప్రభుత్వమే పూర్తిగా భరించే విధంగా చర్యలు తీసుకోవాలి ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
ఆదిలాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో

## హైకోర్టు స్టేతో సుప్రీంలో సవాల్

42శాతం బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం

పార్టీ నేతలు, మంత్రులతో చర్చించిన సిఎం రేవంత్

**హైదరాబాద్,అక్టోబర్11( వెలుతురు):**
బీసీ రిజర్వేషన్ల పై సుప్రీంకోర్టు కి వెళ్లాలని నిర్ణయం తీసుకుంది. సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించనుంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9 పై తెలంగాణ హైకోర్టు



## తెలంగాణ ఐకానిక్‌గా టీ స్క్వేర్ నిర్మాణం

నవంబర్ నెలాఖరుకల్లా పనులు చేపట్టాలి

అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్,అక్టోబర్11( వెలుతురు):**
టీ స్క్వేర్ నిర్మాణం తెలంగాణ ఐకానిక్‌గా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఏఐ హబ్, టీస్క్వేర్ ప్రాజెక్టులపై ఐసీసీసీలో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, టీజీఐఐసీ

## పదేళ్లలో కాలేశ్వరం కడితే..మూడేళ్లకే కూలింది

- అయినా రికార్డుసతాయిలో ధాన్యం ఉత్పత్తి
- కృష్ణాగోదావరి జలాల్లో రాజీపడేది లేదు
- హరీష్ రావు అబద్దాల ప్రచారంమానుకోవాలి
- ఆల్మట్టి ఎత్తును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్



**హనుమకొండ,అక్టోబర్11( వెలుతురు):**
తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు తాము పోరాడుతున్నామని

## ఐపిఎస్ అధికారి ఆత్మహత్యపై సిఎం దిగ్భ్రాంతి

- కుల దురహంకారానికి నిదర్శనమన్న రేవంత్




## 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- బీజేపీ, బీఆర్ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్ర
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు

**హైదరాబాద్,అక్టోబరు11( వెలుతురు):**



తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మరోసారి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.



## వాట్సాప్ లేకుంటే ఏమి...?

అర్టటై ఉపయోగించండి

పిటిషనర్‌కు సుప్రీం సలహా

**న్యూఢిల్లీ,అక్టోబరు11( వెలుతురు):**
వాట్సప్‌కు పోటీగా తీసుకొచ్చిన స్వదేశీ మెసేజింగ్ యాప్ 'అర్టటై పేరు ఇటీవల నెట్టింట మార్మోగుతోంది. తాజాగా దేశ

# వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్య భూమిక

ఇతర దేశాలపై ఆధారపడకుండా స్వయంసమృద్ధి సాధించాలి

జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, గ్రామీణ రంగానికి ప్రయోజనం

సాగు వ్యయం తగ్గించేందుకు ఐదేళ్లలో రూ.13లక్షల కోట్ల సబ్సిడీ

ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రారంభించిన మోడీ

**న్యూఢిల్లీ,అక్టోబరు11( వెలుతురు):**
దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా



లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి

## ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలి




చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్




## కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ

- మేడారం కాంట్రాక్టుల విషయంలో రచ్చ
- వరంగల్‌లో వేలు పెడుతున్న పొంగులేటి
- మండిపడ్డ కొండా సురేఖ దంపతులు

**వరంగల్,అక్టోబర్11( వెలుతురు):**
మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మధ్య వివాదం మరువక

## వరంగల్, నల్గొండలో ఇంక్యుబేషన్ కేంద్రాలు

'టీ-హబ్' తరహాలో ఏర్పాటు, కొత్త ఆలోచనలకు ప్రోత్సాహం

'ఫార్మసీ ఆఫ్ వర్ల్డ్' గా తెలంగాణను మార్చాలన్నదే మా సంకల్పం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
తెలంగాణను "ఇన్నోవేషన్ హబ్" గా మార్చాలన్నదే తమ సంకల్పమని, వరంగల్, నల్గొండలోనూ టీ-హబ్ తరహాలో ఇంక్యుబేషన్ కేంద్రాలను 1

## 48 గంటలు టైమిస్తున్నా...

- మధుకర్ ఆత్మహత్యకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేయాల్సిందే
- వేధించిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాల్సిందే
- లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవు
- మధుకర్ కుటుంబ పరిస్థితిని చూసి తీవ్రంగా చలించి పోయిన కేంద్ర మంత్రి






**బెల్లంపల్లి వెలుతురు అక్టోబర్ 11:**
"48 గంటలు టైమిస్తున్నా. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని వేమునపల్లి బీజేపీ అధ్యక్షులు మధుకర్ చావుకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపాలి. కారకులైన పోలీసులను సస్పెండ్ చేయాలి. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలుంటాయి. హైదరాబాద్ తోపాటు రామగుండం కమిషనరేట్ ను బీజేపీ కార్యకర్తలతో కలిసి ముట్టడిస్తాం. కార్యకర్తలే బాధ్యులకు తగిన గుణపాఠం చెబుతారు. అంతదాకా



# బాబాయ్ మాకొద్దు ఈ అధికారి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
మునిసిపల్ సెక్రెటరీ తీరుపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నేరుగా మాకొద్దు బాబోయ్ ఈ అధికారి అంటున్నట్లు సమాచారం. ఫైళ్ల క్లియరెన్స్ అంశంలో కింది స్థాయి సిబ్బంది చెప్పిన విషయాలను భూతద్దం పెట్టి చూసినట్లు వ్యవహరించడంతో తన వద్ద పనిచేయలేకపోతున్నట్లు వాపోతున్నారు. వందల ఫైళ్లను పెండింగ్ పెట్టడం సదరు అధికారి తీరు. ల్యాండ్ కన్వర్షన్ ఫైళ్లను అటుంచితే రొటీన్ ఫైళ్లను చూసే పరిస్థితి లేదు. టప్పాల్ చూసే తీరిక లేక కాలయాపన చేస్తున్నట్లు తన వద్ద పనిచేస్తున్న సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నట్లు తెలుస్తోంది. నేరుగా ముఖ్య మంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫైళ్లను తిప్పి పంపుతునట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

గతంలో పలువురు సీనియర్ అధికారులు ఎంఎయుడి లో ఉన్నప్పుడు గంటలో ఫైళ్లను చూసి ప్రభుత్వానికి పంపే పరిస్థితి ఉండేది.కానీ ఇలంబర్తి మునిసిపల్ శాఖకు వచ్చాక మరింత అధ్వాన్నంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి.గతంలో ఖమ్మం కలెక్టర్ ఉన్నప్పుడు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఐదు నెలలకే బదిలీ చేయించారు.తరువాత అదే జిల్లాకు కలెక్టర్ గా వచ్చిన లోకేష్ కుమార్ దాదాపు నాలుగేళ్లు అద్భుతంగా పనిచేశారన్న పేరుంది.జీహెచ్ఎంసీ కమిసనర్ గా కేవలం ఏడు నెలలు పనిచేసారు ఇలంబర్తి. ఖమ్మం నుండి రిలీవ్ అయ్యాక అక్కడి ఉద్యోగులు కొబ్బరికాయలు కొట్టి మరి వీడ్కోలు పలికి పసుపు నీళ్లతో పండుగ చేసుకున్నారట. ప్రస్తుతం ఎంఎయుడి లో ఇదే పరిస్థితి నెలకొంది. కనీసం ఎంప్లాయిస్ ఫైళ్లను కూడా పరిస్థితి లేదంటున్నారు.ఓ ఎస్టీ సామజిక వర్గానికి చెందిన సెక్రెటరీ స్థాయి ఉద్యోగి తన డిపార్టుమెంట్ కన్వర్షన్ కోసం దాదాపు ముప్పై సార్లు కలిసిన ప్రయోజనం లేదని వాపోయారు.ఉన్నత స్థాయిలో ఉన్న ఆఫీసర్ ఇలా కింది స్థాయి ఉద్యోగుల పట్ల వ్యవహరించడం తన సర్వీస్ లో ఇదే మొదటి సారి అని చెప్పడం గమనార్హం. తనకు తాను గా నిజాయితీ గల ఆఫీసర్ అని చెప్పుకొనే సదరు అధికారి కనీసం వంద గజాలు , రెండు వందల కన్వర్షన్ చేయడానికి ఇబ్బంది పెడుతునట్లు ప్రచారం సాగుతోంది. ప్రజలు ప్రభుత్వానికి టాక్స్ కడుతున్న పైనుండి అనుమతి లేదంటు తిప్పి పంపుతున్నారు.ఐఏఎస్ అధికారులు అంటే దేవుళ్లతో కొలిచే సామాన్య ప్రజలు ఇప్పుడు ఇలాంటి అధికారుల తీరు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కలెక్టర్ వస్తున్నారు అంటే వంగి దండాలు పెట్టేంత గౌరవం ఉండేది ప్రజల్లో.కానీ రాను రాను ఆఫీసర్ల వ్యవహార శైలిపై మరింత దిగజారుతుందన్న ఆరోపణలు ఎక్కువ అవుతున్నాయి.ఎంఎయుడి సెక్రెటరీకి చెప్పమని కొంతమంది బాధితులు ఒకరిద్దరు సీనియర్ ఐఏఎస్ లను కలిసి విన్నవించుకుంటే చెప్తే వినరని దాట వేసినట్లు సమాచారం. ఒకవైపు ముఖ్య మంత్రిగా రేవంత్ రెడ్డి సక్సెస్ గా దూసుకెళు ్తంటే ఇలాంటి ఆఫీసర్ల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు ఒస్తుందన్న విమర్శలు ఉన్నాయి.

## ప్రధాని మోడీతో రామ్ చరణ్ దంపతుల భేటీ



## నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్ బజార్

అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభం

మహిళా వ్యాపారులతో సీఎం చంద్రబాబు మాటామంతీ

**అమరావతి,అక్టోబర్ 11( వెలుతురు):**
మోడరన్ కంటైనర్స్‌తో స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను ఏర్పాటు చేశామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వినూత్న ఆలోచనతో తొలిసారిగా నెల్లూరులో వీటిని ఏర్పాటు చేశామని వివరించారు. ఇది



# హైకోర్టు స్టేతో సుప్రీంలో సవాల్

స్టే విధించడంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పు ను స్టడీ చేసిన ప్రభుత్వం.. సీనియర్ కౌన్సిల్ తో సుప్రీంకోర్టు లో వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అభిషేక్ మను సింగ్వి తో పాటు సిద్దార్థ దవే.. రిజర్వేషన్ల పై ప్రావీణ్యం కలిగిన అడ్వకేట్ లతో వాదనలు వినిపించాలని నిర్ణయించినట్లు సమాచారం. హైకోర్టు స్టే నేపథ్యంలో స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, సుప్రీంకోర్టు న్యాయవాది అభిషేక్ మను సింగ్వి తదితరులు జూమ్ మీటింగ్ లో మాట్లాడారు. హైకోర్టు స్థానిక సంస్థలు ఎన్నికల నోటిఫికేషన్, జీవో 9 మీద స్టే ఇవ్వడంపై తదుపరి చర్యల గురించి సుదీర్ఘంగా చర్చించారు. జీవో 9 ని అమలు చేసేందుకు సుప్రీం కోర్ట్ తలుపు తట్టాలని నిర్ణయానికి వచ్చారు.ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్ అన్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న లక్ష్యం గా మందుకెళ్తోంది. బీసీలకు రిజర్వేషన్లు విషయం తేల్చే వరకు స్థానిక ఎన్నికలకు వెళ్లబోమని ఇప్పటికే మంత్రులు చెప్పారు. మరో వైపు సుప్రీం తీర్పు ప్రకారం పాతపద్దతిలో అంటే.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా స్థానిక ఎన్నికలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు తెలిపింది. జీవో 9 పై మాత్రమే స్టే ఇచ్చిందని..రిజర్వేషన్ల విషయంలో క్లారిటీ ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రభుత్వానికి లేఖ రాసింది. మరోవైపు వచ్చే వారంలో క్యాబినెట్ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. కాగా హైకోర్టు జీవో 9పై స్టే విధిస్తూ, 2 వారాల్లో పిటిషనర్లు కౌంటర్ దాఖలు చేయాలని, అలాగే 4 వారాల్లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. తాజాగా బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టు ఆర్డర్ కాపీ వెలువడింది. జీఓ 9, 41, 42 ల పై హైకోర్టు స్టే విధించింది. ట్రిపుల్ టెస్టు పాటించకపోవడం పై హైకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు మించి ఉండడాన్ని తప్పుబట్టింది. తదుపరి విచారణ డిసెంబర్ 3 కు వాయిదా వేసింది. వికాస్ కృష్ణా రావు గవాలి, రాహుల్ రమేష్ వాగ్ కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులను హైకోర్టు పరిగణలోకి తీసుకున్నది.

# తెలంగాణ ఐకానిక్‌గా టీ స్క్వేర్ నిర్మాణం

సంయుక్తంగా ఈ రెండు ప్రాజెక్టులు చేపడుతున్నాయి. రాయదుర్గం సమీపంలో చేపట్టనున్న టీస్క్వేర్ నిర్మాణ పనులను నవంబర్ నెలాఖరుకు ప్రారంభించాలని సీఎం దిశా నిర్దేశం చేశారు. టీస్క్వేర్‌లో ఆపిల్ వంటి అంతర్జాతీయ సంస్థల ఔట్‌లెట్లు ఉండాలన్నారు. ఏఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ భవనాలను పరిశీలించాలని సూచించారు. ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రముఖ ఏఐ సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఐకానిక్ బిల్డింగ్‌గా వి-హబ్ ఉండేలా నిర్మాణం చేయాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో శనివారం మధ్యాహ్నం ఏఐ హబ్, టీస్క్వేర్ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, టీజీఐఐసీ ఎండీ శశాంక, టీ ÷బైర్ ఎండీ వేణుప్రసాద్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నవంబర్ నెల చివరి కల్లా వి హబ్ పనులు ప్రారంభం కావాలని అధికారుల ను రేవంత్ రెడ్డి ఆదేశించారు. వి హబ్ నిర్మాణం కోసం జైకా ఫండ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వి హబ్ నిర్మాణంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని చెప్పారు. వి హబ్‌లో ఆపిల్ లాంటి ఇంటర్నేషనల్ బ్రాండ్స్ తమ ఔ÷-లటెట్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. యుటిలిటీ జోన్ ఏర్పాటు చేయడంతోపాటుగా వి హబ్ 24 గంటలపాటు పని చేయాలన్నారు. ఏఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీల్లో భవనాలను పరిశీలించాలని ఆదేశించారు. ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఏఐ సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు.

## పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రిలలో చికిత్స పొందినప్పుడు ఆ ఖర్చును ప్రభుత్వమే పూర్తిగా భరించే విధంగా చర్యలు తీసుకోవాలి ఎమ్మెల్యే పాయల్ శంకర్

సిఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ. 20 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. అత్యవసర సమయాల్లో అండగా నిలవడానికి ప్రజలు సైతం ఆరోగ్య ఇన్సూరెన్స్‌లు చేయించుకోవాలని ఆయన సూచించారు. బిజెపి నాయకులు సంతోష్. దయాకర్. సత్యం . కరుణాకర్ రెడ్డి. రమేష్. దేవన్న. రవి రెడ్డి . మహేష్. వెంకన్న. తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్‌లో మరో ఇద్దరు మంత్రుల పంచాయితీ

ముందే.. కాంగ్రెస్ క్యాబినెట్ మంత్రుల మధ్య మరో లొల్లి మొదలైంది. మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఆ శాఖకు చెందిన మంత్రుల మధ్య విభేదాలు ముదిరి రచ్చకెక్కాయి. మంత్రి పొంగులేటిపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సీఎం రేవంత్ రెడ్డికి, పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. వరంగల్ రాజకీయాలతోపాటు దేవాదాయ శాఖలో మంత్రి పొంగులేటి జోక్యం చేసుకుంటున్నట్లు కొండా దంపతులు అందులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకి ఫోన్ చేసిన కొండా మురళి ఆయనకు ఫిర్యాదు చేశారు. పొంగులేటి తన సొంత కంపెనీకి పనులు ఇప్పించుకుంటున్నారని తెలిపారు. ఆయన వల్ల జిల్లాలో తాము ఇబ్బంది పడుతున్నామని వెల్లడించారు. అదేవిధంగా జిల్లా రాజకీయాలను ఖర్గేకి వివరించారు. పార్టీ పెద్దలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చిందని కొండా దంపతులు పేర్కొన్నారు. కాగా, ఇటీవల మేడారంలో పర్యటించిన సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి.. పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వరంగల్ జిల్లా రాజకీయాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోక్యం చేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ నేత కొండా మురళి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు ఫిర్యాదు చేశారు. మేడారం టెండర్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పొంగులేటి సొంత కంపెనీకి పనులు ఇప్పించుకున్నారని అందులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటు మీనాక్షి నటరాజన్‌కు సైతం కొండా మురళి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు.

# ఐపిఎస్ అధికారి ఆత్మహత్యపై సిఎం దిగ్భ్రాంతి

**హైదరాబాద్,అక్టోబరు11(ఆర్ఎన్ఎ):**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హర్యానా కేడర్ ఐపీఎస్ అధికారి, ఏడీజీపీ వై పూరన్ సింగ్ ఆత్మహత్య చేసుకోవడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కులం కారణంగా బలవంతంగా ఆత్మహత్య చేసుకున్న ఘటనకు ఈ ఐపీఎస్ అధికారి మృతి ఒక ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. అడిషనల్ డీజీపీ స్థాయి అధికారిని కులం పేరుతో వేధించడం చూస్తే.. సామాన్య ప్రజల దయనీయ జీవన పరిస్థితులను అర్థం చేసుకో వచ్చునన్నారు. ఇలాంటి అసహనకర సంఘటన చోటు చేసుకోవడం తీవ్ర ఆందోళనకరమని విచారం వ్యక్తం చేశారు. అణచివేతకు గురైన వర్గాల పట్ల చూపిస్తున్న ద్వేషం.. సమాజాన్ని విషపూరితం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహా అవమానకర సంఘటనల వల్ల రాజ్యాంగం, సమానత్వంతోపాటు న్యాయంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందన్నారు. అణగారిన వర్గాలపై ఈ తరహా దాడులను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలంటూ ఈ సందర్భంగా ప్రజలకు సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ఇది ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఘటనపై దేశంతోపాటు ప్రజలంతా ఆలోచించాలన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# 48 గంటలు టైమిస్తున్నా...

- -బీఆర్ఎస్ ను మించి కాంగ్రెస్ అరాచకాలు కొనసాగుతున్నాయి
- - నక్సలైట్ల తూటాలకే భయపడని తెగింపు బీజేపీ కార్యకర్తలది
- - కాంగ్రెస్ అరాచకాలను ఎదిరిస్తాం
- - రాబోయేది బీజేపీ ప్రభుత్వమే
- - వత్తాసు పలికే పోలీసులకు చుక్కలు చూపిస్తాం
- - గూండాగిరి చేసే నాయకులను యూపీ తరహాలో శిక్షిస్తాం
- - కాంగ్రెస్ సర్కార్ పై నిప్పులు చెరిగిన కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- - మంచిర్యాల జిల్లా వేమనపల్లి బీజేపీ అధ్యక్షుడు యాట మధుకర్ కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి
- - కుటుంబ దుస్థితి, కాంగ్రెస్ నేతల, పోలీసుల అరాచకాలను వివరిస్తూ రోదించిన మధుకర్ కుటుంబ సభ్యులు
- - మధుకర్ కుటుంబాన్ని అన్ని విధాలా బీజేపీ ఆదుకుంటుందని భరోసా

తెచ్చుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా" అంటూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి డెడ్ లైన్ విధించారు. యాట మధుకర్ ది ఆత్మహత్య కాదని, కాంగ్రెస్ ప్రేరేపిత హత్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల అరాచకాలు, దౌర్జన్యాలతోపాటు పోలీసుల వేధింపులు తాళలేకే మధుకర్ ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అరాచకాలపై పోరాడి ఓడిస్తే... అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అంతకు మించి అరాచకాలు, దౌర్జన్యాలు చేస్తోందన్నారు.

శనివారం రోజున సాయంత్రం బెల్లంపల్లి నియోజకవర్గంలోని వేమనపల్లి మండలం నీల్వాయికి విచ్చేసిన బండి సంజయ్ యాట మధుకర్ నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మధుకర్ ఆత్మహత్యకు కారణాలపై ఆరా తీశారు. కాంగ్రెస్ నేతల వేధింపులు, ఇంటి పై దాడి చేసి దౌర్జన్యం చేయడమే కాకుండా మధుకర్ పైనే అత్యాచార యత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి తీవ్రంగా వేధించారని కుటుంబ సభ్యులు వాపోయారు. పోలీసుల వేధింపులు, కాంగ్రెస్ గూండాలు దౌర్జన్యాలు భరించలేకే మధుకర్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు రోదిస్తూ చెప్పారు. మధుకర్ తీవ్ర పేదరికంలో కొట్టు మిట్టాడుతున్నారని, సొంత ఇల్లు కూడా లేదని చెబుతూ తలుపులు కూడా లేని ఇంటిని చూపించారు. మధుకర్ కుటుంబ పరిస్థితిని కళ్లారా చూసిన బండి సంజయ్ తీవ్రంగా చలించిపోయారు. వెంటనే ఆ కుటుంబానికి తక్షణ సాయంగా రూ.లక్ష అందజేశారు. మధుకర్ కుటుంబానికి బీజేపీ పూర్తి అండగా ఉంటుందని, ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపైన, పోలీసుల తీరుపైనా తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే.....

ప్రజల కోసం నిరంతరం పోరాడే మధుకర్ కాంగ్రెస్ దౌర్జనాలు, అరాచకాలకు, పోలీసుల వేధింపులతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారని తెలియగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రావాలనుకున్నారు. అర్జంట్ గా ఫోన్ రావడంతో ఢిల్లీ వెళ్లారు. ఆయన సూచన మేరకు నేను, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ ఇక్కడికి వచ్చాం. మధుకర్ కుటుంబానికి బీజేపీ పూర్తి అండగా ఉంటూ ఆదుకుంటుంది. ఇది మా బాధ్యత. మధుకర్ ది ఆత్మహత్య కాదు. దుర్గామాత ఉత్సవాల్లో కొంతమంది ఫాల్తుగాళ్లు తప్పతాగి ఇండ్లు కదిలిపోయేలా డీజే సౌండ్ పెట్టి ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తే ప్రశ్నించిన మధుకర్ ఇంటిపై దాడి చేసి కొట్టారు. అంతేగాకుండా ఎస్సీఎస్టీ కేసు పెట్టి వేధించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు వాళ్లకే వత్తాసు పలుకుతూ మధుకర్ ను వేధింపులకు గురిచేయడంవల్లే తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులతోపాటు చుట్టుపక్కల ప్రజలంతా చెబుతున్నాడు. మధుకర్ లాంటి మంచి వ్యక్తికి ఇలా జరగడంతో ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారు.

గతంలో బీఆర్ఎస్ ఇట్లనే చేస్తే వాళ్ల అరాచకాలపై పోరాడి జైలుకు పోయింది బీజేపీ కార్యకర్తలే. కాంగ్రెస్ ఏనాడూ ఒక్క పోరాటం కూడా చేయలే. కానీ ప్రజలు ఆ పార్టీకి ఓటేసి గెలిపిస్తే... బీఆర్ఎస్ ను మించి అరాచకాలు, దౌర్జన్యాలు చేస్తోంది. పోలీసులు అధికార పార్టీ నాయకుల అరాచకాలకు వత్తాసు పలుకుతూ మధుకర్ లాంటి వారిని వేధిస్తున్నరు.

ఏ ప్రభుత్వం శాశ్వతం కాదని పోలీసులు గుర్తుంచుకోవాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ ఉంటే కేంద్రంలో బీజేపీ అధికారంలోఉందనే విషయాన్ని మర్చిపోవద్దు. రాష్ట్రంలోనూ రాబోయేది బీజేపీ ప్రభుత్వమే. ఈసారి అట్లాంటి వాళ్లందరికీ చుక్కలు చూపిస్తాం. గూండాగిరీ చేసే వాళ్లను యూపీ తరహాలో శిక్షిస్తాం.

బీజేపీ కార్యకర్తలారా ఎవరూ ఆందోళన చెందవద్దు. నిరాశ పడొద్దు. ఆత్మహత్యలే పరిష్కారం కాదు. తెగించి పోరాడేవాడే నిజమైన బీజేపీ కార్యకర్త. ఆనాడు నక్సలైట్ల తూటాలకు, వార్నింగ్ లకే భయపడకుండా తెగించి కొట్లాడిన చరిత్ర బీజేపీది. కాంగ్రెస్ పార్టీ ఎంత?

ఈ సందర్భంగా ప్రభుత్వానికి 48 గంటల టైమిస్తున్నాం. ఆలోగా మధుకర్ ఆత్మహత్యకు కారకులైన వారిని అరెస్ట్ చేసి జైలుకు పంపాల్సిందే. బాధ్యులైన పోలీసులనూ సస్పెండ్ చేయాల్సిందే. లేనిపక్షంలో బీజేపీ చేసే ఉద్యమాలను తట్టుకోలేరు. హైదరాబాద్ తోపాటు రామగుండం సీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. చర్యలు తీసుకుంటే సరే సరి. లేకుంటే తగిన గుణపాఠం చెబుతాం. కేంద్ర మంత్రిగా ఉన్నా మళ్లీ ఇక్కడికి వచ్చే పరిస్థితి తీసుకురావొద్దని ప్రభుత్వానికి సూచిస్తున్నా. ఇంత మారుమూల ప్రాంతంలో బీజేపీ కార్యకర్తలు ప్రజల కోసం కాంగ్రెస్ అరాచకాలపై కొట్లాడుతున్నరు. భవిష్యత్తులో కాంగ్రెస్ మరింతగా అరాచకాలు చేస్తది. అరెస్టులు చేసి జైల్లో వేస్తది. అయినా బీజేపీ కార్యకర్తలు భయపడొద్దు. తెగించి కొట్లాడదాం. బీజేపీ అధికారంలోకి వచ్చాక గూండాగిరి చేసే వాళ్లను, వారికి వత్తాసు పలికే పోలీసులకు చుక్కలు చూపిస్తాం.

## పదేళ్లలో కాలేశ్వరం కడితే..మూడేళ్లకే కూలింది

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్రానికి ఇప్పటికే లిఖిత పూర్వక ఫిర్యాదు చేశామని చెప్పారు. అలాగే ఆలమట్టి ఎత్తు పెంపునకు వ్యతిరేకంగా కూడా తాము ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో కట్టకుండా చూస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. అయితే నీటి పంపకాల పంచాయతీలో మంత్రి హోదాలో హాజరైన ఏకైక వ్యక్తిని తానేనని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. మీరు నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పనికి రాకుండా పోయిందంటూ హరీశ్ రావుకు చురకలంటించారు. ఈ 22 నెలల్లో కాళేశ్వరం ప్రాజెక్ట్ నయాపైసా కూడా పనికి రాలేదన్నారు. మంత్రి సీతక్కతో కలిసి హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి చుక్కనీరు లిఫ్ట్ చేయకుండా మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడో పంటలో కూడా భారతదేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 108.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పడుతోంది. దాంట్లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయబోతోంది. భారత దేశంలో ఇంత ధాన్యం ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయలేదని మంత్రి వివరించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో గోదావరి జలాలను ఆంధ్రకు అప్ప జెప్పారని గుర్తు చేశారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా నీటిని తాము కాపాడుకుంటామని తెలిపారు. తప్పుడు మాటల ద్వారా అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారంటూ హరీశ్ రావుపై మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను కాపాడడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీఆర్ఎస్ కట్టిన ఏకైక కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ కూలిపోయిందని వ్యంగ్యంగా అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ తుమ్మడిహెట్టి వద్ద తట్టెడు మట్టి ఎత్త లేదని విమర్శించారు. గోదావరి జలాల విషయంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణకు మేలు జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. హరీశ్ రావు మాట్లాడిన మాటలలో వాస్తవాలు ఏమి లేవని.. ఈ తరహా ప్రచారాన్ని మానుకోవా లంటూ ఆయనకు ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డుల కెక్కిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. త్వరలో ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభమవుతాయన్నారు.గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందంటే అది భారత రాష్ట్ర సమితి పాలనలోనే. కృష్ణా జలాల్లో 511 టీఎంసీలు ఏపీ ప్రభుత్వం తీసుకోవచ్చని, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు చాలని సంతకాలు చేసింది కేసీఆర్ ప్రభుత్వమే. మన నీటి హక్కులు కాపాడే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్తున్నాం. నీటి వాటాల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలే. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఇదే విషయాన్ని గతంలో అనేక సార్లు చెప్పాం. కర్ణాటకలో అల్మట్టి డ్యాం ఎత్తు పెంపును కూడా వ్యతిరేకిస్తున్నాం. కృష్ణా జలాల్లో 70 శాతం తెలంగాణకే కేటాయించాలని మేం వాదనలు వినిపిస్తున్నాం. పదేళ్లలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే నిర్మించింది. అది కూడా మూడేళ్లకే కూలిందని మంత్రి ఉత్తమ్ అన్నారు. అవాస్తవాలు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వాన్ని బద్నాం చేయడం మానుకోవాలని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావుకు తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. అబద్దాలను ప్రచారం చేస్తూ ఆరోపణలు చేయడం సరికాదంటూ హరీశ్ రావుకు ఆయన హితవు పలికారు. బనకచర్లపై హరీష్ రావు చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అంతేకాదు.. బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణానికి పార్టీ వ్యతిరేకమని తాము మొదటి నుంచి చెబుతున్నామని గుర్తు చేశారు.

# వికసిత్ భారత్‌లో రైతులది ముఖ్య భూమిక

హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం నాడు జరిగిన ప్రత్యేక కృషి ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, దేశం లోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు. గత ప్రభుత్వాలకు వ్యవసాయం పై ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ అన్నారు. యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. రైతులకు కేంద్రంలోని గత కాంగ్రెస్ ప్రభుత్వం చేసేందేమీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 2004 నుంచి 2014 వరకూ యూపీఏ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అయితే బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన వివిధ శాఖలు ఇష్టారీతిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీనమవుతూ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజనాలు చేకూరే లెక్కలేనని సంస్కరణలు తెచ్చామని చెప్పారు. దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు రెట్టింపయ్యాయని, ఆహారధాన్యాలు, పళ్లు, కాయగూరల ఉత్పత్తి సుమారు 90 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఇది 64 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండేదని చెప్పారు. 2014 నుంచి తేనె ఉత్పత్తి రెట్టింపు అయిందని అన్నారు. అభివృద్ధి భారతాన్ని కోరుకుంటే ప్రతి రంగంలోనూ ఇండియా బలపడాల్సి ఉంటుందన్నారు. ఏవో కొన్ని సాధించినంత మాత్రాన తృప్తి పడిపోరాదని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పుడే గణనీయమైన ఫలితాలు ఉంటాయన్నారు. ఇవాళ యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రసూతి మరణాలు తగ్గాయని, చైల్డ్ హెల్త్ మెరుగైందని, విద్యాప్రమాణాలు పెరిగాయని చెప్పారు. దీంతో ఈ జిల్లాలు ఇతర జిల్లాల కంటే మెరుగైన రీతిలో దూసుకెళ్తున్నాయని, ఈ మోడల్ ఆధారంగా వ్యవసాయంలో వెనుకబడిన 100 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని, ఇందువల్ల అవి మరింత మెరుగైన జిల్లాలుగా మారనున్నాయని చెప్పారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించి.. ఆపై వాటిని పూర్తిగా మరిచిపోయాయని ప్రధాని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వెనకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని ఆశావహ జిల్లాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలుచేస్తోందన్నారు. వీటన్నింటినీ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వెనకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు కూడా వేయించలేదని.. అటువంటి వాటిని తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోం దన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, నివాసం, విద్యుత్, రోడ్డు వంటి అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని.. పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయన్నారు.

## వరంగల్, నల్గొండలో ఇంక్యుబేషన్ కేంద్రాలు

ఏర్పాటు చేయబోతున్నట్లుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు సంబంధించి త్వరలోనే కాకతీయ, మహాత్మాగాంధీ విశ్వ విద్యాలయాలతో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లుగా వివరించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న 'కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అలుమ్ని' గోల్డెన్ జూబ్లీ వేడుకలను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైన్స్ కు మానవత్వాన్ని జోడిస్తే ప్రతి ఆవిష్కరణ సమాజహితానికి బాటలు వేస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణను గ్లోబల్ ఫార్మా, లైఫ్ సైన్సెస్ హబ్ గా మాత్రమే కాకుండా 'ఫార్మసీ ఆఫ్ పర్పస్'గానూ మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. రీసెర్చ్ ను మార్కెట్‌కు, పాలసీని రోగికి అనుసంధానించే సమగ్రమైన 360 డిగ్రీల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 18 నెలల్లోనే లైఫ్ సైన్సెస్ రంగంలో కొత్తగా రూ.54వేల కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చామన్నారు. ఎలీ లిల్లీ లాంటి అంతర్జాతీయ ఫార్మా దిగ్గజ కంపెనీలను తెలంగాణకు తీసుకొచ్చి, ఇక్కడి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు.డాక్టర్ల కంటే వేగంగా రోగాలను నిర్ధారించినా, అనుభూతి చెందే మనసును మాత్రం ఏ యంత్రం భర్తీ చేయలేదన్నారు.



దేశంలో తమ అనుభవాన్ని 'నాలెడ్జ్ ఇన్వెస్ట్ మెంట్'గా పెట్టేందుకు ముందుకు రావాలని ప్రవాసీ భారతీయ నిపుణులకు విజ్ఞప్తి చేశారు. పేటెంట్లను కాకుండా మీ ఆవిష్కరణ వల్ల ఎంత మందికి మేలు జరిగిందన్నదే చరిత్ర గుర్తుంచుకుంటుందని యువ ఇన్నోవేటర్స్ కు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్ రెడ్డి, డా.బి.ప్రభా శంకర్, రాంప్రసాద్ రెడ్డి, ప్రద్యుమ్న, డా.తామర విజయ్ కుమార్, ప్రొఫెసర్ భాస్కర్ ఆర్.జాస్తి, రాజేశ్వర్ తోట, ప్రొఫెసర్ జె. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షపాతి మోదీ



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 11:**
ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతుల పక్షపాతి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. అంతర్జాతీయ మార్కెట్లో యూరియా ధరలు ఆకాశన్ని అంటుతున్నా ధరలు పెంచకుండా ఆ మొత్తాన్ని కేంద్రమే భరిస్తూ సబ్సిడీ ధరకే యూరియాను అందిస్తున్నారని తెలిపారు. దేశంలోని 1.7 కోట్ల మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఏటా రూ.24 వేల కోట్ల నిధులతో ధన్ ధాన్య క్రుషి యోజన పథకాన్ని నేటి నుండి అమలు చేస్తుండటం శుభ పరిణామమన్నారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం రోజున ఢిల్లీలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి రూ.42 వేల కోట్ల విలువైన అనేక ప్రాజెక్టులను ప్రారంభించారు. దీంతోపాటు ప్రధానమంత్రి ధన ధాన్య క్రుషి యోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ లోని తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలోని కరీంనగర్ మిల్క్ డెయిరీ ప్లాంట్ వద్ద వీక్షించారు.అనంతరం కేంద్రం, జపాన్ ఇంటర్నేషనల్ సంస్థ జికా ఆర్థిక సహకారంతో రూ.90 కోట్ల 70 లక్షలకుపైగా నిధులతో నిర్మించిన ఆటోమెటిక్ కర్డ్ ప్లాంట్ ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ ఏమన్నారంటే....

ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో శనివారం రోజున రూ.42 వేల కోట్ల విలువైన అనేక పథకాలను ప్రారంభించుకోవడం గొప్ప విషయం. ప్రధానమంత్రి ధన్ ధాన్య క్రుషి యోజన పథకాన్ని కూడా ఈరోజు ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉంది. దేశంలోని 100 జిల్లాలను ఎంపిక చేసి 1 కోటి 70 లక్షల మంది రైతులను అన్ని విధాలా ఆదుకుని లాభాలు కలిగించేందుకే ఈ స్కీంను అమలు చేయడం ఆనందంగా ఉంది. అదే విధంగా తెలంగాణలో 4 జిల్లాల్లో(గద్వాల్, నారాయణపేట, నాగర్ కర్నూలు, జనగాం) నేటి నుండి అమలు.. ఏటా 24 వేల కోట్ల చొప్పున 6 ఏండ్ల పాటు నిధుల కేటాయింపు...

రాజేశ్వరరావు అంటే ఎవరూ గుర్తుపట్టరు. కానీ కరీంనగర్ డెయిరీ రాజేశ్వర్ రావు అంటే అందరికీ సుపరిచితులే. కరీంనగర్ డెయిరీని కష్టపడి ఈ స్థాయికి తీసుకురావడంవల్లే ఆయనకు ఆ పేరు వచ్చింది. కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (కరీంనగర్ డెయిరీ) 27 ఏళ్ల చరిత్ర ఉంది. పాల వ్యాపారంలోకి వచ్చి కోఆపరేటివ్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికై కరీంనగర్ మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (2012లో) ను ఏర్పాటు చేసి ఈరోజు ప్రతిరోజు 2 లక్షల లీటర్ల పాలను సేకరించడంతోపాటు 40 లక్షల లీటర్ల పెరుగును విక్రయించడం మామూలు విషయం కాదు. 600 మందికి ప్రత్యక్షంగా 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించడంతోపాటు లక్ష మంది పాడి రైతులనుండి పాలను కొనుగోలు చేసి వారి



జీవితాలకు భరోసా ఇస్తున్న సంస్థ యాజమాన్యానికి నా హ్రుదయ పూర్వక అభినందనలు.

ఇవన్నీ గమనించిన మోదీ ప్రభుత్వం ఇలాంటి సంస్థలకు అండగా ఉంటుంది. కరీంనగర్ డెయిరీ పనితీరును చూసి మోదీ ప్రభుత్వం 2021లోనే 3 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సాయం అందించింది. ఇయాళ ప్రధాన మంత్రి ధన-ధాన్య కృషి యోజనలో భాగంగా NPDD-A&B(జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి కార్యక్రమం), JICA (జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేటివ్ ఏజెన్సీ) ఆర్థిక సహకారంతో 90 కోట్ల 70 లక్షల 94 లక్షల రూపాయల వ్యయంతో 1 లక్షా 50 వేల లీటర్ల పెరుగు కేంద్రం (ఆటోమెటిక్ కర్డ్ ప్లాంట్) ఏర్పాటు చేయడం గొప్ప విషయం. ఈ సంస్థపట్ల




కేంద్రానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనం.

రాజేశ్వరరావు అంటే నాకు ప్రత్యేక అభిమానం. ఈ డెయిరీ ఆస్తులను గతంలో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే... నేను కార్పొరేటర్ గా ఉంటూ డెయిరీ పక్షాన అనేక ఉద్యమాలు చేశాను. మాపై ఆనాడు ఎన్నో కేసులు నమోదైనా లెక్క చేయలేదు. మా కార్యకర్తలు ఉద్యమాలు చేసి డెయిరీకి అండగా నిలిచారు. ఇయాళ డెయిరీ చుట్టూ కాంపౌండ్ వాల్ కట్టి డెయిరీ ఆస్తులను కాపాడారు. సిరిసిల్లలో డెయిరీని సీజ్ చేస్తే కలెక్టర్ తో మాట్లాడి మళ్లీ తెరిపించాను. మీరు గెలిపించిన ఎంపీగా మీకు సేవ చేయడమే లక్ష్యం. నాకు అహంకారం, గర్వం రాదు. ఏ స్థాయికి వెళ్లినా అణిగిమణిగి ఉంటా. అందరికీ అందుబాటులో ఉంటా.

మోదీకి రైతుల పక్షపాతి. రైతును రారాజును చేయాలన్నది ఆయన సంకల్పం. అంతర్జాతీయ మార్కెట్



లో యూరియా ధరలు విపరీతంగా పెరిగినా ఆ ఖర్చును భరించి అతి తక్కువ ధరకే యూరియాను సరఫరా చేస్తోంది. కనీస మద్దతు ధరను 2014లో 1310 రూపాయలుంటే... నేడు 2360 రూపాయలు చేశారు. ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని మాట ఇచ్చి అమలు చేస్తున్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి సాధ్యమని భావించి అన్ని రాష్ట్రాలను అభివృద్ధి చేస్తున్నారు. పన్నుల పేరుతో అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ పదేపదే ఇబ్బంది పెడుతుంటే... చైనాకు వెళ్లి చైనా, రష్యా అధ్యక్షులతో భేటీ అయ్యి అమెరికాకు గట్టి సంకేతాలను పంపారు. దేశ ప్రయోజనాలే మోదీకి ముఖ్యమనే విషయాన్ని ఎవరూ మరువొద్దు.

కరీంనగర్ డెయిరీ ప్రొడక్ట్స్ ను ఆపేందుకు ప్రభుత్వంలోని కొందరు ప్రయత్నిస్తున్నట్లు నా ద్రుష్టికి వచ్చింది. నేను రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతాను. కరీంనగర్ డెయిరీ ప్రొడక్ట్స్ ను ఆపొద్దని, మరింతగా విస్తరిస్తూ ప్రజలకు సేవలందించేలా చూడాలని కోరుతున్నా.

## మంత్రి వాకిటి శ్రీహరి ని మర్యాద పూర్వకంగా కలిసిన నవదుర్గ నవరాత్రి ఉత్సవ సమితి సభ్యులు



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
72 అడుగుల దుర్గమాత అమ్మవారి విగ్రహాన్ని కోఠి సమీపంలోని విక్టోరియా గ్రౌండ్లో ప్రతిష్టించిన సమితి సభ్యులు నవరాత్రులు ముగిసిన తరువాత ఈనెల 04వ తేదిన విక్టోరియా గ్రౌండ్లో దుర్గామాతను నిమర్జనం చేశారు అమ్మవారి ప్రతిరూపమైన మట్టిని,అమ్మవారి అలంకరణ వస్రాలను మంత్రి వాకిటి శ్రీహరి ప్రధానం చేసిన నవదుర్గ సమితి సభ్యులు దుర్గమాత ప్రత్యేకతలు సముద్ర బంకమట్టి, వరి వంగడాలతో ఉపయోగించారు,ఎత్తు 72 అడుగులు,విగ్రహ తయారీకి వాటర్ పెయింట్స్ ఉపయోగించారు...పూర్తిగా ఏకో ఫ్రెండ్లీ విగ్రహం ఈ సందర్భంగా దేశంలోనే అతిపెద్ద ఈకో ఫ్రెండ్లీ విగ్రహం అని బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ స్థానం సాధించిందని ఇచ్చిన సర్టిఫికెట్ని మంత్రిగారికి చూపించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్,నవదుర్గా నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది

## 7 సంవత్సరాల వయసులోనే జిమ్నాస్టిక్స్ లో 3 అంతర్జాతీయ రికార్డ్స్ సాధించిన రోహన్ ను అభినందించిన క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**



బంజారాహిల్స్ లోని మంత్రి అధికారిక నివాసంలో రోహన్ తల్లితండ్రులు సురేష్,సృజనలతో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి ని కలవడం జరిగింది 3వ తరగతిలోనే బ్యాక్ హ్యాండ్ స్ప్రింగ్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్ స్టాండ్ వాక్ అంతర్జాతీయ స్థాయి రికార్డ్ రోహన్ తల్లితండ్రులు మంత్రి కి తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి రోహన్ ను శాలువాతో సత్కరించడం జరిగింది. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు త్వరలోనే క్రీడాకారుల కోసం ప్రత్యేక యాప్ రూపొందిస్తున్నాం క్రీడాకారులు అంతా అందులో రిజిష్టర్ చేసుకోవాలి అని సూచించారు ప్రతిభ ఉన్న ప్రతిఒక్క క్రీడాకారులను గుర్తించి వారిని అన్ని రకాలుగా ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయిలో రాణించే తీర్చిదిద్దటమే ప్రభుత్వం లక్ష్యం అన్నారు

## 42 శాతం రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలుపై హైకోర్టు స్టే ఇచ్చినందున సుప్రీంకోర్టుకు వెళ్లి అప్పీలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అక్కడ వెసులు బాటు దొరుకుతదని ఆశిస్తున్నట్లు తెలిపారు. రిజర్వేషన్లు ఆపటంలో అసలైన ముద్దాయి బీజేపీ అని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. గవర్నర్ దగ్గర బిల్లుని పెండింగ్ లో ఉంచారని.. గవర్నర్‌ను నియమించేది ఎవరని ప్రశ్నించారు. మూడు చట్టాలు ఒక ఆర్డినెన్సు గవర్నర్ వద్ద పెండింగ్ లో ఉన్నాయని చెప్పారు. బీసీలకు నోటి దాకా వచ్చిన ఫలాలను అడ్డుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉందన్న ఆయన.. మోదీ బీసీ ప్రధాని అని చెప్పుకునే బీజేపీ నేతలు, బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఎందుకు ఒత్తిడి తీసుకురావటం లేదు? అని ప్రశ్నించారు. ఏపీ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో చేయాల్సింది అంత చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ఉదాసీనత వల్ల జీవో ఇచ్చారని దుయ్యబట్టారు.

## Price సపోర్ట్ స్కీం లో 25% కొనుగోలు పరిమితిని తొలగించాలి

- మొక్కజొన్న, జొన్న పంటలను PSSలో చేర్చాలి
- కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్య ఆర్థిక విధానం అవసరం
- ఆయిల్ పామ్ తో పాటు పత్తి రైతులపై ప్రభావం చూపుతున్న కేంద్ర ప్రభుత్వ వాణిజ్య విధానాలు
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారికి లేఖ రాసిన మంత్రి తుమ్మల

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
శనివారం రోజున "పీఎం ధన్ ధాన్య కృషి యోజన" మరియు "నేషనల్ మిషన్ ఆన్ పల్సెస్" పథకాలను ప్రారంభించిన సందర్భంగా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ గారికి అభినందనలు తెలియజేస్తూ.. దేశంలో ఆహార భద్రతను బలోపేతం చేయడానికి, రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం చూపుతున్న దృఢ సంకల్పాన్ని మంత్రిగారు అభినందిస్తూనే, రాష్ట్రంలో అమలవుతున్న PSS పథకంలో ఉన్న పరిమితులు, ప్రధాన పంటల కొనుగోలుపై కేంద్రం చూపెడుతున్న నిర్లక్ష్యం మరియు రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతున్న కేంద్ర వాణిజ్య విధానాల గురించి లేఖ ద్వారా తెలియజేశారు.

**Price Support Scheme లో 25% కొనుగోలు పరిమితి తొలగించాలి :**

ప్రస్తుతం PSS పథకం కింద కొనుగోలు చేస్తున్న నువ్వులు, శనగలు, వేరుశెనగ, సోయాబీన్, పెసళ్ళు వంటి పంటలపై కేంద్రం 25% సీలింగ్ విధించడం వలన, రైతులు తాము పండించిన పంటలో కేవలం 25% మాత్రమే మద్ధతు ధరకు అమ్ముకొనే వెసులుబాటు కలుగుతుందని, తెలంగాణలాంటి రాష్ట్రాలలోని భూముల్లో నువ్వులు, శనగలు, వేరుశెనగ, సోయాబీన్, పెసళ్ళు వంటి పంటలు విస్తారంగా సాగవుతాయని, ఈ పరిమితిని విధించడంతో రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

మార్కెట్లో ధరలు పడిపోయిన సమయంలో రైతుల ప్రయోజనార్థం రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ మరియు సహకార సంస్థల ద్వారా కేంద్రం విధించిన 25% సీలింగ్ కంటే ఎక్కువ కొనుగోళ్లు చేయవలసి వస్తోందని, దీని వల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. అందువల్ల,



PSS కింద ఉన్న 25% కొనుగోలు పరిమితిని రద్దు చేయాలని లేదా సడలించాలని కేంద్రాన్ని మంత్రి తుమ్మల కోరారు.

**మొక్కజొన్న, జొన్న పంటలను PSSలో చేర్చాలి :**

తెలంగాణలోని వర్షాధార పంటలలో మొక్కజొన్న, జొన్న పంటలు ప్రధానమైనవని మంత్రి తుమ్మల గారు పేర్కొన్నారు. ఈ పంటలకు కనీస మద్దతు ధర (MSP) ప్రకటించినప్పటికీ, కేంద్రం ద్వారా కొనుగోలు జరగకపోవడం వల్ల, రాష్ట్రం తన స్వంత నిధులతో రైతులనుండి కొనుగోలు చేసి, రైతులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాల్సివస్తోందని చెప్పారు. రైతులకు నిర్దేశిత మద్దతు ధర భరోసా కల్పించేందుకు ఈ రెండు పంటలను PSS పథకం పరిధిలోకి తీసుకురావాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

**కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్య ఆర్థిక విధానం అవసరం :**

కనిష్ట మద్ధతు ధర (MSP) అనేది కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికి, దాని భారం రాష్ట్ర ప్రభుత్వాలపై పడుతోందని మంత్రి తుమ్మల గారు పేర్కొన్నారు. రైతు కష్టకాలంలో ఉన్నప్పుడు, రైతులకు గిట్టుబాటు ధర అందని సమయాలలో రాష్ట్రం జోక్యం చేసుకొని, కేంద్రం ప్రకటించిన కనిష్ట మద్ధతు ధర చెల్లించి రైతులను కాపాడుకోవాల్సి వస్తుందని, కానీ కేంద్ర ఆర్థిక మద్దతు లేకుండా ఇది దీర్ఘకాలంగా కొనసాగడం అసాధ్యం అని చెప్పారు. కాబట్టి, MSP అమలు మరియు మార్కెట్ జోక్యాల్లో కేంద్ర-రాష్ట్రాల మధ్య వ్యయభారం పంచుకునే ఆర్థిక విధానం రూపుదిద్దాలని మంత్రి సూచించారు.

**ఆయిల్ పామ్ తో పాటు పత్తి రైతులపై ప్రభావం చూపుతున్న వాణిజ్య విధానాలు :**

నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ - ఆయిల్ పామ్ (NMEO-OP) పథకం అమలులో తెలంగాణ దేశంలో ముందంజలో ఉందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే 1.08 లక్ష హెక్టార్లలో 73,744 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని, 2025-26 లో మరో 50,000 హెక్టార్ల విస్తరణ లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు.

అయితే, కేంద్ర ప్రభుత్వం మే 31, 2025న క్రూడ్ పామ్ ఆయిల్‌పై కస్టమ్స్ సుంకాన్ని 27.5% నుండి 16.5%కి తగ్గించడం వలన దేశీయ ధరలు తీవ్రంగా పడిపోయి, ఆయిల్ పామ్ రైతులు పొందే తాజా ఫ్రూట్ బంచ్ (FFB) ధర టన్నుకి ?20,000 కంటే తక్కువకు చేరిందని తెలిపారు. అదే విధంగా, పత్తి విషయంలో సీసీఐ కొనుగోళ్లు 50%-60% వరకు మాత్రమే పరిమితం అవుతున్నాయని, నాణ్యత పరమైన కారణాలు మరియు కొనుగోళ్లలో ఆలస్యం కారణంగా రైతులకు MSP లభించడం లేదని మంత్రి అన్నారు. అంతేకాకుండా కాటన్ దిగుమతులపై దిగుమతి సుంకం మినహాయింపు చేయడం వలన కూడా దేశీయ ధరలు మరింతగా పడిపోయాయని తెలిపారు.

ఈ వాణిజ్య విధానాలు రైతుల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, కాబట్టి ఆయిల్ పామ్ మరియు పత్తిపై దిగుమతి సుంక విధానాలు దేశీయ మార్కెట్ సీజన్‌లకు అనుగుణంగా ఉండేలా ఆర్థిక మంత్రిత్వ శాఖతో సమన్వయం చేయాలని ఆయన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖను అభ్యర్థించారు.

**కేంద్రం మరియు రాష్ట్రాల సమన్వయంతోనే రైతు రక్షణ సాధ్యం :**

PSS లో పంటల కొనుగోళ్లపై విధించిన పరిమితులు, రాష్ట్ర ప్రధాన పంటలను PSS పథకం నుండి మినహాయించడం మరియు కేంద్ర అనాలోచిత వాణిజ్య విధానాల వల్ల తెలంగాణ రైతులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తుమ్మల గారు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, కేంద్ర-రాష్ట్ర సమన్వయం ద్వారా మాత్రమే రైతులు కోరుకునే కనీస మద్దతు ధరపై రైతులకు భరోసా కల్పించడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

## వాట్సాప్ లేకుంటే ఏమి...?

అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులోనూ దీని ప్రస్తావన వచ్చింది. వాట్సప్ ఖాతా పునరుద్ధరణకు సంబంధించి దాఖలైన ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. వాట్సప్ లేకపోతే ఏం.. అర్టటై వాడొచ్చు కదా అని సూచించింది. తన ఖాతాను వాట్సప్ బ్లాక్ చేసిందని, దాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. సామాజిక మాధ్యమాలు ఇలా ఖాతాలను ఉన్నట్టుండి నిషేధించకుండా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తంచేసింది. ఆర్టికల్ 32 కింద ఈ పిటిషన్ ఎందుకు వేశారని అడిగింది. వాట్సప్ యాక్సెస్ ఉండటం ప్రాథమిక హక్కు ఎలా అవుతుందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది బదులిస్తూ.. పిటిషనర్ ఓ పాలీ డయాగ్నిక్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. గత 10-12 ఏళ్లుగా వాట్సప్‌లోనే తన క్లయింట్‌లతో టచ్‌లో ఉన్నారు. ఉన్నట్టుండి ఆ ఖాతాను బ్లాక్ చేశారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. అయితే ఏంటీ? కమ్యూనికేషన్ కోసం ఇతర యాప్‌లు కూడా ఉన్నాయి. వాటిని ఉపయోగించొచ్చు కదా..! ఈ మధ్యే స్వదేశీ యాప్ 'అర్టటై' కూడా వచ్చింది. దాన్ని వాడుకోండి. మేక్ ఇన్ ఇండియా! అని సూచించింది. ఈ పిటిషన్ హైకోర్టులో కూడా విచారణకు అర్హమైంది కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీనిపై ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్‌ను తిరస్కరించింది. కోర్టు అనుమతితో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.దేశీయ సంస్థ జోహో అభివృద్ధి చేసిన అర్టటైకి విపరీతమైన ప్రజాదరణ లభిస్తోంది. ఇప్పటికే కోటి మందికి పైగా దీన్ని డౌన్‌లోడ్ చేసుకున్నారు. అర్టటై అంటే తమిళంలో పిచ్చాపాటీ సంభాషణ అని అర్థం. ఈ యాప్ ద్వారా మెసేజ్‌లు, వాయిస్, వీడియో కాల్స్ చేసుకోవటానికి, మీటింగుల్లో పాల్గొనటానికి, స్టోరీలు, ఫొటోలు, డాక్యుమెంట్స్ షేర్ చేసుకోవచ్చు.

## ప్రధాని మోడీతో రామ్ చరణ్ దంపతుల భేటీ

**హైదరాబాద్,అక్టోబరు11( వెలుతురు):**
భారత ప్రధాని నరేంద్రమోదీని సినీ నటుడు రామ్‌చరణ్ దంపతులు కలిశారు. అనిల్ కామినేని సారథ్యంలో వరల్డ్ ఆర్చరీ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రధానితో సమావేశమైన చరణ్, ఉపాసన, అనిల్ కామినేనిలు లీగ్‌కు సంబంధించిన వివరాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామి జ్ఞాపికతో పాటు, ప్రత్యేకంగా తయారు చేయించిన విల్లును మోదీకి అందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను రామ్‌చరణ్ పంచుకుంటూ, 'పీఎం మోదీజీ మార్గ నిర్దేశకత్వర, క్రీడలపై ఆయనకున్న ఆసక్తి విలువిద్యను ప్రపంచవ్యాప్తం చేయడానికి ఉపకరిస్తుంది. అథ్లెట్స్ అందరికీ శుభాకాంక్షలు. ఈ క్రీడలో మరింత మంది వచ్చి చేరతారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు.

# సంపాదకీయం.. చేపలను మింగుతున్న కాలుష్యం !



పరిశ్రమల కాలుష్యం నదులను, చెరువులను, చివరకు సముద్రాన్ని కూడా కలుషితం చేస్తోంది. మన జీవితాలు ఏమయితేనేమి అన్న ధోరణిలో పరిశ్రమల యజమానులు కాలుష్యాన్ని విచ్చలవిడిగా వెదజల్లుతున్నారు. ఒకప్పుడు పటాన్ చెరువు కాలుష్యంపే ఏళ్లుగా పోరాటాలు జరిగాయి. తరవాత ఎల్‌బినగర్ సిరిస్ కంపెనీ కాలుష్యంపైనా పోరాటాలు సాగాయి. హుస్సేన్ సాగర్ కాలుష్యం అలాగే ఉండిపోయింది. కొబ్బరినీళ్లలా హుస్సేన్ సాగర్ నీళ్లను చేస్తానన్న కెసిఆర్ కూడా పట్టించుకోలేదు. ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు గట్టిగానే హెచ్చరించినా అడుగులు పడడం లేదు. ఇప్పుడు ఉప్పాడ కాలుష్యం పై మత్స్యకారులు పోరాటం చేస్తున్నారు. దీనిపై డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ గట్టిగానే స్పందించారు. అయితే ఆయన పట్టుదల ఎంతవరకు అన్నది తేలాల్సి ఉంది. పట్టుదలతో కాలుష్యాన్ని అరికట్టగలిగితే చిరస్థాయిగా నిలిచిపోతారు. సముద్రాన్ని కాపాడుకున్నవారం అవుతాం. అలాగే విశాఖలో సముద్రజలాల కాలుష్యం కూడా ఇంతకుమించి ఉంది. వీటిపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై కాలుష్య నియతం÷-రణ అధికారులతో పవన్ కళ్యాణ్ చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట..మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కళ్యాణ్ తెలుసు కున్నారు. దీనిపై ఎలాంటి అడుగులు వేస్తారన్నది ఇప్పుడు అందరి దృష్టి ఉంది. నిజానికి ఉప్పాడ తీరంలో ఉంటున్న వారంతా సముద్రాన్నే నమ్ముకుని చేపల వేట ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న మత్స్యకారులు. ఏళ్ల తరబడి వేటే ఆధారంగా జీవిస్తున్నారు. వీరి ఉపాధికి ఫార్మా కంపెనీలు గండి కొడుతున్నాయి. ఈ పరిశ్రమల వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెడుతుండడంతో చేపల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది. కాకినాడ జిల్లా కెఎస్ఇజడ్ పరిధిలో లైఫిజ్, అరబిందో ఫార్మా కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టేందుకు యు.కొత్తపల్లి మండలంలో కోనపాపపేట, తొండంగి మండలం పెరుమల్లపురం మధ్యలో మూడు కిలోమీటర్ల పొడవున భారీ పైపు లైన్‌ను రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. దీనిద్వారా ఫార్మా వ్యర్థాలు, విషపూరిత జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి నేరుగా విడుదల చేస్తున్నారు. అరబిందో పరిశ్రమ నుంచి కూడా భారీ పైపులైను ద్వారా వ్యర్థాలను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం చేపల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. నిర్వహణ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఫార్మా కంపెనీలు, తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న హేచరీల ద్వారా రసాయనిక జలాలు, ఇతర వ్యర్థాలు సముద్రంలోకి వదిలేస్తున్నారు. దీనివల్ల చేపలు దూరంగా వెళ్లిపోయాయి. కొన్ని చేపలు చనిపోతున్నాయి. పరిశ్రమల కాలుష్యంపై వైసిపి హయాం నుంచీ పోరాటం చేస్తున్నారు.. ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని ఆశించారు. వ్యర్థాలను శు ద్ధి చేసిన తర్వాతే వ్యర్థాలను సముద్రంలోకి వదలాలని కోరుతున్నారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి తొండంగి మండలం అద్దారిపేట వరకు సుమారు 32 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. ఈ రెండు మండలాల్లో 18 గ్రామాలకు చెందిన దాదాపు 50 వేల మంది మత్స్యకారులు చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఫార్మా కంపెనీల వ్యర్థాల వల్ల చేపలు చనిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల నుంచి చేపల ఉత్పత్తి తగ్గిపోయిం దని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో చిన్నబోటుపై వేటకు వెళ్తే రోజుకు రూ.5 వేల నుంచి రూ.8 వేల విలువైన మత్స్య సంపద దొరికేదని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు. ఒక్కసారి వేటకు వెళ్తే చిన్నబోటుకు రూ.2 వేలు, పెద్ద బోటుకు రూ.25 వేల నుంచి రూ.30వేల వరకూ ఆయిల్‌కు ఖర్చవుతుందని తెలిపారు. పెద్ద బోట్లలో 12 మంది వరకూ వేటకు వెళ్తారని, 15 రోజుల వరకూ సముద్రం లోనే ఉండాల్సి ఉంటుందన్నారు. ఆయిల్, ఐస్, ఇతర నిర్వహణకు మొత్తంగా రూ.1.50 లక్షల వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు. ఖర్చులుపోనూ గతంలో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ ఆదాయం సమకూరేదని, ప్రస్తుతం చేపలు దొరక్కపోవడంతో ఖర్చులు కూడా రావట్లేదని ఉప్పాడ మత్స్యకారులు తెలిపారు.గత జగన్ ప్రభుత్వ హయాం నుంచి ఈ సమస్యల పరిష్కారం కోసం మత్స్యకారులు ఆందోళనలు సాగిస్తున్నారు. మత్స్యకారులు గతేడాది ఏప్రిల్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. బీచ్ రోడ్డుని పూర్తిగా నిర్బంధించి పది రోజులపాటు నిరసన గళాన్ని వినిపించారు. ఎన్నికల కోడ్‌తో ఆందోళన విరమించారు. ఎన్నికల సమయంలో ఉప్పాడలో నిర్వహించిన బహిరంగ సభలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడారు. కాలుష్య పరిశ్రమలను నిలిపేస్తామని హామీ ఇచ్చారు. ఆయన డిప్యూటీ సిఎం అయినప్పటికీ హామీ అమలు కాలేదు. దీంతో, మత్స్యకారులు మళ్లీ ఆందోళనబాట పట్టారు. వేల సంఖ్యలో ఉప్పాడ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ స్పందించి ఇటీవలే వారితో చర్చించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారానికి వంద రోజుల సమయం కావాలని కోరారు. న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ ఎంతవరకు అమలవుతుందో చూడాలి. అయితే వెంటనే అధికారులతో సమస్యపై చర్చించడంతో కొంత ఆశ చిగురిస్తోంది.

## పూరన్ ఆత్మహత్యలో దర్యాప్తు ముమ్మరం

**- రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాను తప్పించిన ప్రభుత్వం**



**చండీఘడ్,అక్టోబర్11( వెలుతురు):**

హరియాణాలోని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య కేసుకు సంబంధించి అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఐపిఎస్ అధికారి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాపై అధికారులు వేటు వేశారు. పూరన్ ఆత్మహత్యకు సంబంధించిన ఎఫ్‌ఐఆర్‌లో హరియాణా పోలీస్ డైరెక్టర్ శత్రుజీత్ సింగ్ కపూర్‌తో పాటు రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాల పేర్లను చేర్చాలంటూ ఆయన భార్య సీనియర్ ఐఏఎస్ అధికారి అమ్నీత్ కుమార్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఎస్పీని పదవి నుంచి తొలగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా.. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ అమ్నీత్ కుమార్‌కు లేఖ రాశారు. ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకోవడం తనను షాక్‌కు గురిచేసిందని.. ఎంతో బాధ కలిగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటానికి కోట్లాది మంది భారతీయులు అండగా ఉన్నారంటూ ఆమె రాసుకొచ్చారు. 52 ఏళ్ల పూరన్ కుమార్ స్వరాష్ట్రం ఆంధ్రప్రదేశ్. మంగళవారం చండీగఢ్‌లోని తన నివాసంలో ఆయన రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, ఇతర అధికారులు ఈ కేసులో నిందితులుగా ఉండటంతో తాను ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అమ్నీత్ కుమార్ ఆరోపించారు. దీనిపై పోలీసులు ఎఫ్‌ఐఆర్ ÷ల్ చేయగా.. అది అసంతృప్తిగా ఉందని, నిందితులందరి పేర్లు చేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.

## మరింత పెరిగిన బంగారం ధరలు

**హైదరాబాద్,అక్టోబర్11( వెలుతురు):**

బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1, 24, 260కు చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 13, 900కి చేరింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 24, 410కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 14, 050కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా పరుగులు తీస్తోంది. నిన్నటితో పోల్చుకుంటే ఈ రోజు కిలో వెండి ఏకంగా 3000 రూపాయలు పెరిగింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర 1, 87, 000కు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో వెండి ధర రూ. 1, 77, 000గా ఉంది. ఈ ఏడాది చివరి నాటికి కిలో వెండి ధర రెండు లక్షల రూపాయలకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేశారు. అయితే ప్రస్తుతం సిల్వర్ వేగం చూస్తుంటే అంత సమయం పట్టేలా కనిపించడం లేదు



## అరకత్తర లో పోక చెక్క లాగా బీసీల పరిస్థితి.....!



**మన్నారం నాగరాజు**

**సామాజిక రాజకీయ విశ్లేషకులు.**

**భారతదేశం అనే ప్రజాస్వామ్య గృహంలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు, సమాన గౌరవం ఉండాలని రాజ్యాంగం చెబుతుంది. కానీ వాస్తవం మాత్రం దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. శతాబ్దాల చరిత్రలో శ్రమతో, చెమటతో దేశానికి జీవం పోసిన బీసీలు ఈ రోజుకి కూడా "అరకత్త రలో పోక చెక్క"లానే ఉన్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్నా, ప్రభుత్వ విధానాల్లో, రాజకీయాల్లో, ఆర్థిక వ్యవస్థలో, విద్యలో, ఉద్యోగాల్లో వారి ప్రాతినిధ్యం మాత్రం అంచునే నిలిచిపోయింది.**

**" అర కత్తరపోక చెక్క" అన్న సామెత మన పెద్దలు వృథా అవుతున్న, పనికిరాకుండా ఉన్న వస్తువుకు వాడేవారు. కానీ ఈ మాట ఇప్పుడు బీసీల పరిస్థితికి అచ్చంగా సరిపోతుంది. శ్రమతో, వృత్తితో దేశం నిలబడినా, గుర్తింపు మాత్రం వేరేవారికి దక్కుతుంది. బీసీలు సమాజానికి వెన్నెముక, కానీ అధికారానికి ఆవాసం కాదు. ప్రతి పార్టీ ఎన్నికల సమయంలో బీసీలను జెండాగా ఎగరేస్తుంది, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారిని మరచిపోతుంది. ఇదే బీసీ జీవితం - ప్రతీ యుగంలో వినిపించే దురదృష్ట గాథ.**

వర్ణవ్యవస్థ భారత సమాజంలో గాఢంగా వేరూళ్నూని ఉంది. అందులో బీసీలు శ్రమజీవులు, వృత్తికారులు, మధ్యతరగతి ప్రజలుగా మిగిలిపోయారు. చేతిపనులు, కళలు, సాంకేతిక నైపుణ్యాలు వీరికి వారసత్వంగా ఉన్నా, విద్య, భూమి, ఆస్తి, రాజకీయ శక్తి మాత్రం దూరమయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అంబేద్కర్, పూలే, పెరియార్, నారాయణగురు వంటి మహనీయులు సామాజిక న్యాయం కోసం చేసిన ఉద్యమాలు కొంత అవగాహన తెచ్చినా, బీసీల హక్కులు మాత్రం సంపూర్ణంగా రాలేదు. రాజకీయంగా బీసీలు విస్తృతంగా ఉన్నా, ఒకే దిశగా కదలలేకపోవడం వారిని బలహీనులుగా మార్చింది.

1980లలో మండల్ కమిషన్ బీసీల చరిత్రలో మలుపు తిప్పింది. 27 శాతం రిజర్వేషన్ నిర్ణయం బీసీలలో నూతన ఆశ నింపింది. కానీ ఆ ఆశ దశాబ్దాలు గడుస్తున్నా వాస్తవం కాలేదు. కేంద్రంలో, రాష్ట్రాల్లో చాలా ఉద్యోగాలు ప్రైవేటైజేషన్‌లో కరిగిపోయాయి. ప్రభుత్వంలో ఉన్న కొద్ది పదవులు కూడా రాజకీయ అనుకూలతల ఆధారంగా కేటాయింపులు అయ్యాయి. బీసీ విద్యార్థులకు రిజర్వేషన్ ఉన్నా, గ్రామీణ పాఠశాలల్లో సదుపాయాలు లేకపోవడం, ఆర్థిక బలహీనత వల్ల విద్యను మధ్యలోనే వదిలేస్తున్నారు. ఉన్నత విద్యలో బీసీల శాతం ఇప్పటికీ తక్కువగానే ఉంది. బీసీ అభ్యర్థి ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, ఇంజనీర్ కావాలంటే ఇంకా కష్టమే. కారణం, సమాన పోటీకి అవసరమైన వనరులు లేకపోవడం.రాజకీయంగా బీసీల పరిస్థితి కూడా అంతే దురదృష్టకరం. కాంగ్రెస్ పాలనలో బీసీలు పెద్దగా ప్రాధాన్యం పొందలేదు. బీజేపీ బీసీల పేరుతో పెద్ద ప్రచారం చేస్తోంది, కానీ కేంద్రంలో ఉన్నత మంత్రిత్వాలు, కీలక నిర్ణయాధికార పదవులు మాత్రం ఎక్కువగా ఇతర వర్గాల చేతుల్లోనే ఉన్నాయి. ప్రాంతీయ పార్టీల్లో కూడా బీసీలు ఓట్లకే పరిమితమయ్యారు. తెలంగాణలో, ఆంధ్రప్రదేశ్‌లో, కర్ణాటకలో, మహారాష్ట్రలో, ఉత్తర భారత రాష్ట్రాల్లోనూ ఇదే దృశ్యం. బీసీ నాయకులు ఉంటారు కానీ నాయకత్వం మాత్రం ఇతర వర్గాల చేతిలో ఉంటుంది. పార్టీలు వారిని సౌందర్యకారుల్లా వేదికపై ఉంచి, అసలు నిర్ణయాలు మాత్రం తాము తీసుకుంటాయి.తెలంగాణ రాష్ట్రం ఏర్పడే సమయంలో బీసీలు పెద్ద ఎత్తున ఉద్యమంలో పాల్గొన్నారు. యాదవ, గౌడ్, మున్నూరు కాపు, వడ్డెర, రజక, నాయి బ్రాహ్మణ, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, పద్మశాలి, అనేక కుల - ప్రతి వర్గం తెలంగాణ కోసం కడుపునిండా పోరాడింది. కానీ రాష్ట్రం వచ్చిన తర్వాత బీఆర్ఎస్ పాలనలో బీసీలు పక్కనబడ్డారు. బీసీ కమిషన్ ఏర్పాటు, బీసీ వర్గీకరణ వంటి వాగ్దానాలు మాటలకే పరిమితమయ్యాయి. పెద్దస్థాయి పదవుల్లో బీసీల ప్రాతినిధ్యం సున్నితంగా తగ్గిపోయింది. బీసీ నేతలు ఉన్నా, వారిని వేదికలకే పరిమితం చేశారు.

తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా బీసీలు తమ ఆశలు నెరవేరలేదని బాధపడుతున్నారు.

ఆర్థికంగా బీసీలు ఇంకా వెనుకబడి ఉన్నారు. చేతిపనుల ఆధారంగా జీవనం సాగించిన వృత్తులు యంత్రాల దెబ్బతో నశించిపోయాయి. అనేక వృత్తి కులాలు బీడీకార్మికులు, - అందరూ కొత్త ప్రపంచంలో తమ వృత్తికి విలువ తగ్గిపోవడాన్ని చూస్తున్నారు. గౌడలు కల్లు పరిశ్రమలో ప్రభుత్వ పరిమితులు, కల్తీ కల్లు సమస్యలతో నష్టపోతున్నారు. చిన్న వ్యాపారాలు, కూలీ వృత్తులు, హస్తకళా పరిశ్రమలు అన్నీ క్షీణించడంతో బీసీల జీవనోపాధి ప్రమాదంలో పడింది. గ్లోబలైజేషన్ తర్వాత పెద్ద కంపెనీలు, కాంట్రాక్టు వ్యవస్థలు, దళారీ విధానం బీసీల చేతి పనులను కదలించేశాయి.

ప్రభుత్వ పథకాలు బీసీలకు చేరడం లేదు. రైతు బీసీ అయితే రుణం కష్టం, సబ్సిడీ కష్టం, మార్కెట్ ధరలు పడిపోవడం సాధారణం. ఫలితంగా అప్పులు, ఆత్మహత్యలు, నిరాశ అనే చక్రంలో బీసీ రైతు చిక్కుకుంటున్నాడు. నగరాల్లో ఉన్న బీసీ యువకులు చిన్న ఉద్యోగాలు లేదా కూలీలుగా మారుతున్నారు. పెద్ద కంపెనీల్లో ఉద్యోగం పొందటానికి అవసరమైన సాంకేతిక నైపుణ్యం లేకపోవడం మరో అడ్డంకి. ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలు బీసీల ఆర్థిక భద్రతను పూర్తిగా దెబ్బతీశాయి.

సామాజికంగా బీసీలు ఇప్పటికీ కుల ప్రాతిపదికన విభజించబడ్డారు. గౌడ్ , నాయిని, రజక ,వడ్డెర, కమ్మర్లు, బీడీకార్మికులు, సంచార జాతులు - ప్రతి కులం తన ప్రత్యేక సమస్యలతో ఉంది. కానీ వీరంతా కలిసివచ్చే సామాజిక వేదిక లేదు. బీసీ ఐక్యత లేకపోవడం వల్ల ప్రభుత్వాలు వారిని సీరియస్‌గా తీసుకోవడంలేదు. ఒక్కొక్క వర్గం తనకంటూ వేరు నాయకుడు, వేరు దిశ. ఇది బీసీలను బలహీనులను చేస్తోంది. ఒకే దిశగా కదలలేకపోవడం వల్ల బీసీల ఓటు శక్తి కూడా విడిపోయింది.దరాజకీయంగా బీసీలు అత్యంత పెద్ద ఓటు బ్యాంక్. కానీ ఆ శక్తిని తమ అభివృద్ధికి మలచలేకపోయారు. ప్రతి పార్టీ బీసీల ఓట్ల కోసం హామీలు ఇస్తుంది, కానీ ఆ హామీలు ఎప్పటికీ నెరవేరవు. బీసీలు ఎన్నికల ముందు అవసరం, ఎన్నికల తర్వాత మరచిపోయే జన సమూహం. "ఓట్ల కోసం మనం, అధికారం కోసం వారు" అనే వాస్తవం ప్రతి సారి మళ్లీ రుజువవుతోంది.ఇది కేవలం తెలంగాణ లేదా ఆంధ్రప్రదేశ్ సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఇదే దృశ్యం. ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, మధ్యప్రదేశ్‌లో కూడా బీసీలు కీలక పాత్రలో ఉన్నా, అధికార కేంద్రమ్లో మాత్రం అంచునే ఉన్నారు. కులపరమైన విభజన, పార్టీ రాజకీయ ప్రయోజనాలు, నాయకుల వ్యక్తిగత ఆశలు - ఇవన్నీ కలిసి బీసీల సామూహిక శక్తిని కూలదోశాయి.

ఇప్పుడు బీసీలకు అవసరం కొత్త చైతన్యం. విద్య, ఆర్థిక స్వావలంబన, రాజకీయ అవగాహన, సామాజిక ఏకమత్యం - ఈ నాలుగు మార్గాల్లో ముందుకు వెళ్ళాలి. ప్రతి బీసీ కుటుంబం తన పిల్లలను చదివించాలి, నైపుణ్యం నేర్పించాలి, వ్యాపారాల్లోకి ప్రవేశించాలి. ప్రభుత్వ పథకాలు అందకపోతే సంఘటితంగా పోరాడాలి. ఐక్యంగా ముందుకు వెళ్ళినప్పుడు మాత్రమే బీసీల గళం వినిపిస్తుంది.బీసీ యువత సోషల్ మీడియా, అవగాహనా వేదికలు, విద్యాసంస్థలు, ఉద్యోగ రంగాలలో ఐక్యత చూపాలి. "కులం కాదు %-% కృషి కావాలి, ఐక్యత కావాలి" అనే నినాదంతో ముందుకు రావాలి. తమ వృత్తి గౌరవాన్ని పునరుద్ధరించాలి. ప్రభుత్వం మనకోసం ఏం చేస్తుందనే దానికంటే మనం మనకోసం ఏం చేస్తామన్న ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి.బీసీల భవిష్యత్తు వారే రాయాలి. రాజకీయ నాయకులు, పార్టీలు ఇచ్చే వాగ్దానాలు శాశ్వతం కావు. శాశ్వతం కావలసింది బీసీల ఐక్యత, చైతన్యం. స్వతంత్ర భారతదేశం నిజమైన ప్రజాస్వామ్యం అవ్వాలంటే బీసీల భాగస్వామ్యం పెరగాలి. ఒక సమాన సమాజం బీసీల గౌరవం లేకుండా సాధ్యమేనా? కాదు.ఈ దేశం శ్రమజీవుల చేతనే నిలుస్తోంది. బీసీలు ఆ శ్రమజీవుల పెద్ద వర్గం. వారి చెమటతోనే ఆర్థిక వ్యవస్థ నడుస్తోంది. కాబట్టి బీసీలను అరకొత్తలో పో క చెక్కలుగా వదిలేస్తే అది దేశానికి కూడా ప్రమాదం. ప్రభుత్వాలు బీసీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పథకాలు, రుణ సదుపాయాలు, విద్యా అవకాశాలు కల్పించాలి. బీసీ వృత్తుల పునరుద్ధరణకు ప్రోత్సాహక పథకాలు అవసరం.ప్రతీ బీసీ తల్లిదండ్రి తన పిల్లల్లో చైతన్యం నింపాలి. పుస్తకం పట్టి, విద్యా దిశగా నడిస్తేనే సమానత్వం వస్తుంది. విద్యే బీసీలకు నిజమైన ఆయుధం. రాజకీయాలు, అధికారాలు తర్వాతి దశ. చైతన్యం లేకుండా హక్కులు లభించవు.సమాజం బీసీలను పోక చెక్కలుగా కాకుండా మూలస్తంభాలుగా చూడాలి. బీసీల కృషి, సేవ, వృత్తి గౌరవం గుర్తించబడితేనే భారత ప్రజాస్వామ్యం సంపూర్ణమవుతుంది. బీసీ ఐక్యతే దేశ ఐక్యత. బీసీ గౌరవమే ప్రజాస్వామ్య గౌరవం.అంతిమంగా చెప్పాల్సిందే -బీసీలు అరకొత్తలో పోక చెక్కలు కాదు. వారు ఈ దేశానికి బలమైన వెన్నెముక. వారిని గౌరవించని దేశం సమానత్వం అనే మాట పలకలేరు. బీసీలు తమ శక్తిని గుర్తించి, ఐక్యంగా ముందుకు వచ్చి, స్వీయాభివృద్ధికి కట్టుబడితేనే వారి స్థానం చరిత్రలోఅర కత్తరలో కాదు - అస్తంభంలో ఉంటుంది. బీసీలు చరిత్రలో నలిగిన వర్గం కాదు, నిలిచిన వర్గం. కష్టపడి, పోరాడి, నిలబడిన వర్గం. ఇప్పుడు వారి సమయం వచ్చింది.అరకొత్తలో పోక చెక్కలా ఉండటం ఆపి, సమాజం మధ్యలో నిలబడి, గర్వంగా తలెత్తే సమయం ఇది.

బీసీ గళం ఒక్కటైతే - సమానత్వపు సూర్యుడు ఉదయిస్తాడు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ (డి) ఎమ్మెల్యే అభ్యర్థిగా కంచర్ల మంజూష



**బషీర్బాగ్,వెలుతురు 11 అక్టోబర్:**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ ( టిఆర్ఎస్ డి) అభ్యర్థిగా కంచర్ల మంజూష ను ఆ పార్టీ అధ్యక్షుడు నరాల సత్యనారాయణ ప్రకటించారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ జెండాను,వెబ్ సైట్ ను ప్రారంభించి మాట్లాడారు.తమ పార్టీ యువతకు మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని , అందుకోసమే ఓ మహిళను ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టామన్నారు. ఈ ఉప ఎన్నికతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ జాగృతి తో కలిసి పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై త్వరలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తో కలిసి ఉమ్మడి ప్రకటన చేస్తామని సత్యనారాయణ స్పష్టం చేశారు.

## బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్ రావు



**బషీర్ బాగ్ వెలుతురు 11 అక్టోబర్:**
వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎన్. గౌతమ్ రావు అన్నారు. అనంతరం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నూతనంగా నియమితులైన సందర్భంగా అంబర్ పేట లోని మహంకాళి దేవాలయంలో గౌతమ్ రావు ప్రత్యేక పూజలు చేసి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి భారీ ర్యాలీతో చేరుకున్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాష్ట్ర కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నా వంతు కృషి చేస్తానని గౌతమ్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కాచిగూడ బిజెపి సీనియర్ నాయకులు కన్నె రమేష్ యాదవ్, అజయ్ కుమార్ కృష్ణ గౌడ్ కృష్ణ యశ్వంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## బిసి బందుకు ఓయూ ఐక్య విద్యార్థి సంఘల సంపూర్ణ మద్దతు



**వెలుతురు, హైదరాబాద్ అక్టోబర్ 11 :**
ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఈ నెల14న రాష్ట్రవ్యాప్తంగా జరిగే బిసి బందు కు పిలుపు నిచ్చిన రాజ్యసభ స భ్యులు ఆర్ కృష్ణయ్యకు మద్దతుగా ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల సం పూర్ణ మద్దతు ప్రకటించారు. ఓయూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ 42 శాతం బిసి రిజర్వేషన్లను అమలు పరచకే స్థానిక సంస్థల ఎన్నికలు ని ర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. 42 శాతం బిసి రిజర్వేషన్ల అంశాన్ని రా జకీయ జాప్యం చేయకుండ త్వరగా అన్ని రాజకీయ పార్టీలు కలిసి రాజ కీయ పరిష్కారాన్ని చూపాలని డి మాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బొల్లేపల్లి స్వామిగౌడ్, ఎస్ నాగేశ్వరవు, డాక్టర్ లక్ష్మిగారి ఆంజనే యులు ముదిరాజ్, ఓయూ శంకర్, నిఖిల్, నరేష్, జూలూరి మహేష్, శ్రీకాంత్, సాయిలు,రజనీకాంత్, రాకేష్, శివ, శ్రవణ్,శ్రీధర్, నగేష్, రా జేష్, సైదులు తదితరులు పాల్గొ న్నారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఒక డ్రామా

**- దశబ్దాలు అధికారంలో ఉండి ఏనాడైనా బిసి రిజర్వేషన్ల గురుంచి ఆలోచన చేయని కాంగ్రెస్**
**- జిఎంపిఎస్ చైర్మన్ చిందం జంగయ్య**



**మంచాల వెలుతురు అక్టోబర్ 11:**
మంచాల మండలం కేంద్రంలో జి ఎం పి ఎస్ చైర్మన్ చింధం జంగయ్య మాట్లాడుతూ మాయ మాటలు చెప్పి గత ఎన్నికల్లో బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ లబ్దిపొదాలని చేసిన కుట్రలు పటా పంచలయ్యాయని 22 నెలలుగా బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడాల్సిన రేవంత్ రెడ్డి గల్లీలో కొట్లాడుతున్నట్లు డ్రామా క్రియేట్ చేశారే తప్ప, బీసీలకు 42శాతం రిజర్వేషన్లను సాధించడం పట్ల ఏనాడూ చిత్తశుద్ధి ప్రదర్శించలేదని ఆరోపించారు డిక్లరేషన్ ప్రకారం బీసీ లకు 42శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు చట్టబద్ధత కోసం కేంద్రాన్ని పట్టు బట్టాల్సిన రేవంత్ రెడ్డి తెలివిగా దాన్ని పక్కదోవ పట్టించారన్నారు బీసీల పట్ల తమకు నిజంగానే ప్రేమ ఉన్నట్లు చాటుకునేందుకు తూతూ మంత్రంగా జీవో ఇచ్చి కొత్తనాటకానికి, తెరతీశారన్నారు స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేసారని రేవంత్ రెడ్డి ఇప్పటికైనా డ్రామాలు ఆపి మీకుమీ పార్టీకి బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపు విషయంలో ఢిల్లీలో కొట్లాడిపార్లమెంట్ లో చట్టం చేయించి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్పించాలని అన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలను మాయమాటలతో మభ్యపెట్టి మోసం చేయడం మానుకోవాలి అన్నారు

## ఏ.ఎస్. రావు నగర్ మలబార్ గోల్డ్ షోరూంలో వైభవంగా 'బ్రైడల్ జ్యువెలరీ షో' ప్రారంభం

**ఉప్పల్, అక్టోబర్ 11(వెలుతురు):**
దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న, అతిపెద్ద బంగారు ఆభరణాల రిటైల్ సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ మరియు డైమండ్స్, తమ ఏ.ఎస్. రావు నగర్ షోరూంలో "బ్రైడల్ జ్యువెలరీ షో" ను ప్రారంభించింది. ఈ అద్భుతమైన ప్రదర్శన అక్టోబర్ 10 నుండి 19, 2025 వరకు కొనసాగుతుంది. ఈ ప్రచారానికి 'షో ఆఫ్ ది వే' అనే ఇతివృత్తం ప్రధానం. దీని ద్వారా విభిన్న ప్రాంతాలు, సంస్కృతుల సంప్రదాయాలను ప్రతిబింబించేలా నవ వధువుల కోసం కళాత్మకంగా రూపొందించిన ఆభరణాలు ఇక్కడ ప్రదర్శించబడుతున్నాయి. పెళ్లి వేడుకలు సుదీర్ఘంగా, జనసందోహంతో కూడిన పెద్ద ఉత్సవాలుగా జరిగే భారతదేశంలో, ప్రస్తుతం ఉన్న సామాజిక పరిమితులను సానుకూలంగా స్వీకరిస్తూ మలబార్ గోల్డ్ సరికొత్త ధోరణిని నెలకొల్పింది. ప్రతి వధువుకు తన వివాహం సుమధురమేనని భావించేలా 'షో ఆఫ్ ది వే' సందేశంతో ముందుకు వచ్చింది. కొత్త పెళ్లికూతురి అందచందాల నుండి స్ఫూర్తి పొంది సృష్టించిన విస్మయపరిచే ఆభరణాల సేకరణలను ఈ ప్రచారంలో భాగంగా ప్రదర్శిస్తోంది. మలబార్ గోల్డ్ మరియు డైమండ్స్ యొక్క ఇతర ప్రత్యేక బ్రాండ్లు అయిన భారతీయ వారసత్వ ఆభరణాల బ్రాండ్ 'డివైన్', వజ్రాభరణాల బ్రాండ్ 'మైన్', మరియు అన్‌కట్ వజ్రాభరణాల బ్రాండ్ 'ఎరా' కూడా ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా అన్ని బంగారు, అన్‌కట్, రత్నాభరణాల తరుగు ఛార్జీల పై




30శాతం వరకు తగ్గింపు పొందవచ్చు. వజ్రాభరణాల వజ్రాల విలువపై 30శాతం వరకు తగ్గింపు లభిస్తుంది. ఒకే ధర విధానం: దేశవ్యాప్తంగా తమ షోరూములలో వినియోగదారులకు ఒకే, ఉత్తమమైన ధర అందించే 'వన్ ఇండియా వన్ గోల్డ్ రేట్' ప్రచారాన్ని కూడా మలబార్ గోల్డ్ కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వినియోగదారులకు 11 న్యాయమైన వాగ్దానాలు అందించడం మలబార్ గోల్డ్ నిబద్ధత. ఇందులో పారదర్శక ధరల పట్టి, ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ, పాత బంగారు ఆభరణాలకు 100 శాతం విలువ అందించడం, బంగారం మార్పిడిపై శూన్య తగ్గింపు వంటివి ప్రధానమైనవి. సంస్థ నాణ్యతా పరీక్షలు నిర్వహించిన ఐజీఐ, జిఐఎ ధృవీకరించిన వజ్రాభరణాలు మాత్రమే విక్రయిస్తుంది. మలబార్ గోల్డ్ మరియు డైమండ్స్ 1993లో కేరళలో స్థాపించబడిన ఈ సంస్థ, నేడు భారతదేశం, యూకే, యూఎస్ఏ, మిడిల్ ఈస్ట్ సహా 14 దేశాల్లో 400కి పైగా షోరూములతో బలమైన రిటైల్ నెట్‌వర్క్ కలిగి ఉంది. ఇది ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద జ్యువెలరీ రిటైలర్లలో 6వ స్థానంలో నిలిచింది.

## కపిల్ కుటీర్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ బాలిక దినోత్సవం

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 11:**
కరీంనగర్ సంక్షేమ ట్రస్ట్ కపిల్ కుటీర్ శిశు సంరక్షణ కేంద్రంలో శనివారం రోజున అంతర్జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శిశు సంరక్షణ కేంద్రాల్లో గల బాలికలతో ఆటలు ఆడించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య తిథులుగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారి మార్త సరస్వతి , సి డబ్ల్యు సి చైర్ పర్సన్ శ్రీరామోజు ధనలక్ష్మి ,డిసిపిఓ పర్వీన్ , సంరక్షణ కేంద్రం ఉపాధ్యక్షుడు వకులా- రాజారెడ్డి లు





మాట్లాడుతూ బాలికలు భవిష్యత్తు శక్తి రూపాలన్నారు. బాలికలు లేకుంటే భవిష్యత్తు లేదని, బాలికల సంరక్షణతో భారతదేశం వెలుగుందుతుందని తెలిపారు. బాలికలకు విద్యా ప్రాముఖ్యత ఎంతో ముఖ్యమని, ఆ దిశగా విద్యలో బాలికలు రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి సి పి యు , చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బందిపూదరి , శాంత చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ , సాదినేని రమేష్, నాయిని స్వప్న సుందరగిరి సాయి కిరణ్ గౌడ్, కడే మహేష్, ఎడ్ల ప్రియాంక సంరక్షణ సిబ్బంది శ్రీనివాస్ , కృష్ణవేణి, బాల సదన్ సూపరిండెంట్ సంతోషిని , కీర్తి సరస్వతి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ నగర్ బస్తీ అభివృద్ధికి శేరి రాజీవ్ రెడ్డి ఫౌండేషన్ అండ...

**మూసాపేట డివిజన్ లో శేరి పర్యటన, పలు అభివృద్ధి పనులకు హామీ..**



**కూకట్ పల్లి అక్టోబర్ 11 వెలుతురు:**
మూసాపేట డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ బస్తీలోకూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి శనివారం పర్యటించారు. బస్తీ వాసుల ఆహ్వానం మేరకు ఆయన పర్యటించిన స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి బస్తీలో శిథిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను, నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. కమ్యూనిటీ హాల్ మరమ్మత్తు పనులు చేయించి, పెయింటింగ్ వేయించాలని, అలాగే బస్తీ యువత కోసం జిమ్ సామాగ్రిని ఏర్పాటు చేయించాలని అక్కడికక్కడే తన సిబ్బందికి ఆదేశించారు. ఈ అభివృద్ధి పనులన్నింటినీ తన తాత పేరిట శేరి రాజీవ్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్టు ఆయన ప్రకటించారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన బస్తీ ప్రజలకు భరోసా ఇచ్చారు. సతీష్ రెడ్డి ఈ నిర్ణయంతో అంబేద్కర్ నగర్ బస్తీ నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బస్తీ నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు మేకల మైకల్, మూసాపేట్ సీనియర్ నాయకుడు మహమ్మద్ జున్ను పాషా, లాయర్ రఘుపతి రెడ్డి, అశోక్ ముదిరాజ్, కిట్టు, జెర్రిపాటి రాజు, అల్లాపూర్ మొయిజ్, గుడ్ సెట్ రోడ్ సతీష్, నర్సింగ్ రావు, నిఖిల్, శివ పెరుమాండ్ల టీంకు, సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల పట్ల చిత్తశుద్ధి ఉంటే అన్ని పార్టీలో ఉన్న బీసీ ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయండి

**- బీసీ రిజర్వేషన్లకు పెంపునకు అనుకూలం ఎవరో వ్యతిరేకం ఎవరో తెలుస్తుంది .**
**- బీసీ నేత లింగంగౌడ్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
బీసీ రిజర్వేషన్ల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు డ్రామాలాడుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు.ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు గురించి ఒక పార్టీపై ఇంకొక పార్టీ నెపం వేసుకుంటూ బీసీ సమాజాన్ని గందరగోళానికి గురి చేస్తున్నాయని రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతు ఇచ్చి అసెంబ్లీలో తీర్మానం చేసిన తర్వాత కూడా అసలు నిజంగా ఈ అగ్రకుల రాజకీయ పార్టీలకు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదని నిరూపితమైతుందని అన్నారు.బీజేపీ,కాంగ్రెస్,బిఆర్ఎస్ పార్టీలో ఉన్న బీసీ ప్రజా ప్రతినిధులందరూ ఐక్యంగా ఉండి ఎమ్మెల్యే,ఎంపి పదవులకు రాజీనామా చేయాలని అప్పుడే రిజర్వేషన్ల అనుకూలం ఎవరో వ్యతిరేకులెవరో తెలుస్తుందన్నారు.జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు అభివృద్ధి చెందకుండా భారత్ కానీ తెలంగాణ కానీ అభివృద్ధి చెందడం సాధ్యం కాదని అన్నారు.

# ఉప-జాతీయ రోగనిరోధక దినోత్సవం (SNID) - 12 అక్టోబర్ 2025

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
భారత ప్రభుత్వం మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, హైదరాబాద్ జిల్లాలో పల్స్ పోలియో రోగనిరోధక కార్యక్రమం 2025 అక్టోబర్ 12వ తేదీన నిర్వహించబడుతుంది. ఇది 28వ సంవత్సరంగా నిర్వహించబడుతున్న పల్స్ పోలియో తీవ్ర రోగనిరోధక కార్యక్రమం. భారతదేశంలో చివరిసారిగా పోలియో కేసు 2011 జనవరి 13న పశ్చిమ బెంగాల్‌లో శ్రీమతి రుఖ్సార్ (WPD) అనే బాలికలో గుర్తించబడింది. 2008లో ఒక వైల్డ్ పోలియో వైరస్ కేసు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఈస్ట్ గోదావరి జిల్లా కాకినాడలోని ఎల్లిమొగ్గ గ్రామంలో గుర్తించబడింది. తెలంగాణ రాష్ట్రంలో, చివరి పోలియో కేసు 2007లో నల్గొండ జిల్లాలో, మరియు హైదరాబాద్ నగరంలో 1998లో నమోదైంది. 2012లో, భారతదేశం పోలియో ఎండెమిక్ దేశాల జాబితా నుండి తొలగించబడింది, అలాగే 2014 మార్చి 27న, భారతదేశం ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) ద్వారా పోలియో రహిత దేశంగా ప్రకటించబడింది. 2016లో, హైదరాబాద్ జిల్లా tOPV (Trivalent Oral Polio Vaccine) నుండి bOPV (Bivalent Oral Polio Vaccine) కు మార్పు చేసుకుంది, అలాగే IPV (Inactivated Polio Vaccine ) ను కూడా ప్రవేశపెట్టింది. ఉప-జాతీయ రోగనిరోధక దినోత్సవం (SNID) కార్యక్రమం 2025 అక్టోబర్ 12: బూత్ స్థాయి రోగనిరోధక దినోత్సవం. 2025 అక్టోబర్ 13, 14, మరియు 15: బూత్ దినాన పోలియో డ్రాప్స్ తీసుకోని పిల్లలకు ఇంటి నుండి ఇంటికి ప్రచారం ద్వారా టీకాలు వేయడం. హైదరాబాద్ జిల్లాలో అంచనా జనాభా 45,83,890, ఇందులో 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల పిల్లలు 5,17,238 మంది ఉన్నారు. ఈ పిల్లలకు, కొత్తగా పుట్టిన శిశువులను కూడా కలుపుకుని, మౌఖిక పోలియో టీకా (OPV) ఇవ్వబడుతుంది. ఈ కార్యక్రమంలో మొత్తం 9,36,016 ఇళ్లు కవర్ చేయబడతాయి. జిల్లాలో మొత్తం 2,586 బూత్‌లు మరియు 50 ట్రాన్సిట్ పాయింట్లు (సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లు, అమీర్‌పేట్ మెట్రో, ఎంజీబీఎస్ & జేబీఎస్ బస్టాండ్లు మొదలైన ప్రదేశాల్లో) ఏర్పాటు చేయబడతాయి. ఈ బూత్‌లు రౌండ్ ది క్లాక్ (24 గంటలు) పనిచేస్తాయి. 91 మొబైల్ టీములు కూడా నగరమంతా పనిచేస్తాయి.

**సమయాలు**
బూత్‌లు ఉదయం 7:00 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6:00 గంటలకు ముగుస్తాయి. నిర్ణయించిన సమయాల ప్రకారం టీకాలు ఇవ్వడం తప్పనిసరి.

**సిబ్బంది ఏర్పాట్లు**
ఆదివారం (బూత్ డే) రోజున మొత్తం 164 హై రిస్క్ ప్రాంతాలు కవర్ చేయబడతాయి. 91 మొబైల్ టీములు నిర్మాణ ప్రదేశాలు, వలసవాసుల ప్రాంతాలు, భిక్షుకుల సమాజాలు, తాత్కాలిక నివాసాలు, మార్కెట్లు, దేవాలయాలు, చర్చిలు, గురుద్వారాలు, మసీదులు, వివాహ భవనాలు, మరియు లుంబిని పార్క్, ఎన్టీఆర్ గార్డెన్స్, జూవ్ పార్క్ వంటి ప్రజా ప్రదేశాలలో పిల్లలకు పోలియో డ్రాప్స్ వేస్తాయి. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మెట్రో స్టేషన్లలోని ట్రాన్సిట్ పాయింట్లు 2025 అక్టోబర్ 11 అర్ధరాత్రి నుండి అక్టోబర్ 14 అర్ధరాత్రి వరకు నిరంతరంగా పనిచేస్తాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విభాగాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, కాలేజ్ విద్యార్థులు, NCC, నర్సింగ్ మరియు మెడికల్ విద్యార్థులు, కాంటోన్మెంట్ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళా మండళ్లు మరియు ఇతర వాలంటీర్లు పాల్గొంటారు. ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్, చిన్నారుల క్లినిక్స్, మరియు కార్పొరేట్ ఆసుపత్రులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతాయి.



# ఆయనో మెరుపుతీగ

**(కవిత)**

ఆయన ఓ తోటమాలి
అక్షరాలకు కాపలా దారి
ఆయనో నిత్య శ్రామికుడు
పుస్తకాల ప్రేమికుడు
కలల సౌదాల స్వాప్నికుడు
సాదాసీదాగా కనిపించే
నిత్య యవనుడు
రోజూ నవ్వు మోముతో
పలకరించే కలవలరేడు
డ్యూటీ అంటే పడిసస్తడు
మొక్కలన్నా పువ్వులన్నా ప్రేమిస్తడు
పుస్తకాల గుడిలో వెలుగులు పూయించి
జ్ఞానమనే జ్యోతులు వెలిగించినాడు
కవుల రచయితల మీటింగులు పెట్టి
సాహితీపరుల లోగిళ్ళలో నిలిచినోడు
నాగయ్య అంటే అందరి నోలల్లో
నాలుకల్లా మారినోడు
ఆయన ఓ సౌమ్యుడు
నిరాడంబరుడు
లైబ్రరీలో ఆయన పెట్టిన ప్రతి మొక్క
పూసిన ప్రతి పువ్వు
పేర్చిన ప్రతి పుస్తకం
నాగయ్య సారు కోసం
ఎదురుచూస్తున్నవి
ఎంతైనా నాగయ్యది
మంచి మనసు కదా
మంచి వాళ్ళకే మరణం
ముందుస్తది అంటారు
పై లోకాన నిఖార్సయైన
మంచి లైబ్రేరియన్ లేదని
భగవంతుడే నాగయ్యను
పిలిచినట్లు ఉంది
ఆయన సేవలు ఇక్కడే కాదు
అక్కడ కూడా అవసరమే అనుకుంట...

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
సెల్: 9441561655

# గ్రంథాలయాల అభివృద్ధిలో నాగయ్య పాత్ర గొప్పది

*ఆయన ఓ తోటమాలి. అక్షరాలకు కాపలా దారు. నిత్య శ్రామికుడు, పుస్తకాల ప్రేమికుడు. కలల సౌధాల స్వప్నికుడు. సాదా సీదగా కనిపించే నిత్య యవనుడు. రోజూ నవ్వు ముఖముతో పలకరించే మంచిమనిషి. ఆయన ఎవరో కాదు, నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సుదీర్ఘ కాలం పాటు అసిస్టెంట్ లైబ్రరీగా పనిచేసిన కట్ట నాగయ్య. పాఠకులలో విజ్ఞానం వికసింపజేయడానికి సమాజానికి జ్ఞానాన్ని అందించడానికి గ్రంథాలయాలు వారదులుగా, జ్ఞాన భాండాగారాలుగా విరాజిల్లుతాయనేది వాస్తవం. అటువంటి భావాన్ని బలంగా నమ్మిన వ్యక్తులలో అసిస్టెంట్ లైబ్రేరియన్ కట్టా నాగయ్య ఒకరు. అందుబాటులో ఆదాయ వనరులు లేనప్పటికీ ప్రజలు, సాహితీ పరులు, మేధావుల సూచనలు, సహకారంతో విశిష్టమైన సేవలు అందించడం కోసం నిరంతరం ప్రయత్నించిన వ్యక్తి నాగయ్య. నల్లగొండ గ్రంథాలయానికి రాకముందు నాతో అతడికి పరోక్ష సంబంధం ఉన్నప్పటికీ, నల్లగొండ కేంద్ర గ్రంథాలయానికి వచ్చిన తర్వాత మా ఇద్దరి మధ్య సంబంధం అనుబంధంగా మారింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం లో ఎప్పటికప్పుడు సూచనలు గైకొంటూ గ్రంథాలయాలను దేవాలయాలుగా భావించి విశిష్ట సంస్థలుగా రూపొందించేందుకు నిరంతరం కృషి చేసిన నిబద్ధ గ్రంథ పాలకుడు కట్ట నాగయ్య. ఎప్పుడూ నవ్వుతూ కనిపించే నాగయ్య.. ఆయన లేని లోటుతనం కేంద్ర గ్రంథాలయం వైపు ముఖం చూస్తే బోసిపోతుంది. గుండె తరుముకుపోతుంది. అక్కడ పూసిన ప్రతి పువ్వు, నాగయ్య నాటిన ప్రతి మొక్క , అల్మారాలలో ఉన్న ప్రతి పుస్తకం నాగయ్య సార్ ఎక్కడ? అని ఘోషిస్తున్నవి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన మనసున్న ఒక మంచి మనిషి. నిరాడంబరుడు. డ్యూటీ పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి.*

యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండ దగ్గర ఉన్న నాగారం నాగయ్య సొంతూరు. ఆయన తోడ ఇద్దరు తమ్ముళ్లు, ఒక అక్క, కట్ట నాగయ్యకు భార్య ఇద్దరూ ఆడపిల్లలు ఉన్నారు. ప్రాథమిక విద్య, డిగ్రీ విద్య నల్గొండ జిల్లాలోనే పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం ఉస్మానియా విద్యాలయం చేరుకున్నారు. గ్రంథాలయ శాస్త్రం లో, పీజీ జర్నలిజం లో, పీజీ ఎం ఫిల్ చేస్తూనే కొన్ని పత్రికలలో దశాబ్ద కాలం పనిచేస్తూ నిబద్ధతగల విలేకరిగా పేరు తెచ్చుకున్నారు.

తదుపరి గ్రంథాలయ శాస్త్రం లో ఉన్న అనుభవం అదృష్టం పౌర గ్రంథాలయ శాఖ లో అసిస్టెంట్ గ్రంథ పాలకునిగా చేరారు. వారు చిలుకూరు, వలిగొండ, నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయాలలో విధులు నిర్వహించి అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేసిన అతికొద్ది మంది గ్రంథపాలకులలో కట్టా నాగయ్య ఒకరు. ఆయన అందరి మన్ననలు పొందాడు.

కట్టా నాగయ్య అసిస్టెంట్ లైబ్రేరియన్ గా చిలుకూరు గ్రంథాలయంలో చేరిన సమయానికి (1999) ఆ సంస్థ రజతోత్సవాలు జరుగుతున్న రోజులవి.. ఆ కాలంలో పాఠకుల అభిరుచులు ప్రధానంగా దినపత్రికలు, పోటీ పరీక్షల పుస్తకాల వైపు మారిన పరిస్థితి ఎదురైంది. ఈ సమస్యను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అనేక వినూత్న చర్యలను దాతల సహకారంతో చేపట్టడం జరిగింది. కొత్త పుస్తకాలు, పత్రికలను గ్రంథాలయానికి తెప్పించడానికి దాతలను ప్రోత్సహించడం ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం, దాతల నుండి పుస్తకాలు, పత్రికలను సంవత్సరం పాటు తెప్పించే స్ఫూర్తి నివ్వడానికి ఒక వినూత్నమైన "కరపత్రం"ను రూపొందించి ఈ కరపత్రంలో ఒక వైపు గ్రంథాలయ చరిత్ర, అభివృద్ధి వివరాలు, మరొక వైపు పత్రిక పేరు, దాత పేరును ప్రచురించారు. ఈ పని చేయడం ద్వారా నాగయ్య అందరి అభిమానం పొందారు.

గ్రంథాలయం వైపు విద్యార్థులను పాఠకుల దృష్టిని ఆకర్షించడానికి, ప్రతి నెల దాతల సహకారంతో వ్యాస రచన, క్విజ్, ఉపన్యాసం, పాటల పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికి గ్రంథాలయం వేదికగా తీర్చిదిద్దారు.

2005-2013 వలిగొండ గ్రంథాలయంలో ప్రాథమిక సదుపాయాలు, విద్యుత్ సౌకర్యం లేకుండా , స్వల్ప పుస్తకాలతో , ఉండటం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ, గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయడానికి దాతల సహకారంతో విద్యుత్ బకాయిలు చెల్లించి, గ్రంథాలయానికి విద్యుత్ సౌకర్యం కల్పించి, పుస్తకాలు పత్రికల సేకరణ కోసం ప్రతి సంవత్సరం కరపత్రికను దాతల సహాయంతో ప్రచురించడం ఆనవాయితీగా చేశారు.

**నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో.**

**నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయం (2013 నుండి అక్టోబర్ 3 2025 చనిపోయే వరకు )**

కట్టా నాగయ్య నల్లగొండ పట్టణ కేంద్ర గ్రంథాలయానికి వచ్చేనాటికి తెలంగాణ ఉద్యమం బాగా ఉవ్వెత్తున నడుస్తుంది. ఆ సందర్భంలోనే నాగయ్య గారితో నాకు పరిచయం ఏర్పడింది. ఇక అప్పటి నుండి చనిపోయే క్షణం వరకు ఓ కుటుంబ సభ్యుడిగా వ్యవహరించాడు. గ్రంథాలయంలో సాహితీ పరంగా ఎటువంటి కార్యక్రమం నిర్వహించినా మేరెడ్డి యాదగిరి రెడ్డి, పున్న అంజయ్య, అంబటి వెంకన్న, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి (నన్ను) తదితరులను తప్పకుండా పిలిచి కార్యక్రమంలో పాల్గొనేటట్టు చేయడమే కాకుండా మా నుండి అవసరమైన సూచనలు, సలహాలు తీసుకునేవాడు. అటు అధికారులతోనూ ఇటు పాఠకులతోనూ, సమన్వయకర్తగా చక్కగా విధులు నిర్వహించేవాడు . డ్యూటీ పట్ల ఆయనకు ఎనలేని ప్రేమ ఉండేది. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సహాయ గ్రంథపాలకుడిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో, సిబ్బంది కొరత, పుస్తకాల సంఖ్య తగ్గుదల, వందల సంఖ్యలో పాఠకుల రద్దీ వంటి సవాళ్లను ఎదుర్కొంటూ అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. పాఠకులు పోటీ పరీక్షల పుస్తకాలకు అప్పటి జిల్లా కలెక్టర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ గారిని గ్రంథాలయాన్ని సందర్శించమని ఆహ్వానించి వారి సందర్శన సమయంలో పాఠకుల కోరికను మన్నించి, అదనపు పోటీ పరీక్షల పుస్తకాలను మంజూరు చేయించారు. ఇంకా అనేకమంది దాతల నుండి గ్రంథాలయానికి పుస్తకాలను విరాళంగా అందజేయడంలో కట్ట నాగయ్య ప్రముఖ పాత్ర వహించారు.

అలాగే రాష్ట్ర గ్రూప్-1 అధికారుల సహకారంతో "పోటీ పరీక్షల అవగాహన సదస్సు" నిర్వహించి,



నిరుద్యోగులకు అవగాహనతో పాటు రూ. 15,000 విలువైన పుస్తకాలను సమకూర్చారు.

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి. చంద్రయ్య గారితో "ప్రేరణ కార్యక్రమం" ఏర్పాటు చేసి, గ్రంథాలయ పాఠకులకు స్ఫూర్తి నివ్వడం జరిగింది. గ్రంథాలయంలో చదివి అనేక ఉద్యోగాలు పొందిన వారికి అభినందన సభలు, ఏర్పాటు చేసి, వారి అనుభవాలను ఇతర పాఠకులతో పంచుకునే అవకాశం కల్పించి అందరిలో స్ఫూర్తి కలిగించారు.

పాఠకుల సంఖ్య విపరీతంగా పెరగడం వలన నిర్వహణ సమస్యలు ఎదురైనప్పుడు, కార్యదర్శి గారి సహాయంతో రూ. 30,000 విలువైన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర వహించారు. ఆనాడు గ్రంథాలయాల అభివృద్ధికి గణనీయమైన కృషి చేసిన శ్రీ పట్టికోట అశ్వారుస్వామి గారి విగ్రహాన్ని ప్రముఖ విద్యావేత్త కీర్తిశేషులు కొండకింది చిన్న వెంకటరెడ్డి ఆర్థిక సహకారంతో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో ఏర్పాటు చేయడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఈ విధంగా నాగయ్య నిర్వహించిన పాత్ర చాలా గొప్పది.

గ్రంథాలయ అభివృద్ధి మరియు పాఠకులకు మెరుగైన సేవలు అందించడం వలన 2013లో మొదటిసారి, 2018లో రెండవసారి ఉత్తమ లైబ్రేరియన్ అవార్డు పొందారు.

అంతేకాకుండా రాష్ట్రంలో తొలిసారిగా గ్రంథాలయ పాఠకులకు కేవలం రూ. 10/- లకే భోజనం అందించే సదుపాయాన్ని ఏర్పాటు లో గ్రంథాలయ సంస్థ చైర్మన్, కార్యదర్శి సహకారంతో కీలకపాత్ర పోషించారు. ఈ పథకాన్ని సిబ్బంది సహకారంతో సమర్థవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ పథకం ఇతర జిల్లాలకు కూడా ప్రేరణగా నిలిచింది.

అదే కాకుండా గ్రంథాలయం ఆవరణలో చక్కటి మొక్కలు నాటి, వాటిని సంరక్షించి తోటమాలిగా పనిచేశాడు. తెలంగాణలోని తొలి హరిత పౌర గ్రంథాలయంగా తీర్చిదిద్దాడు., అదేవిధంగా పాఠకులకు ఏసీలు ఏర్పాటు విషయమై కోమటిరెడ్డి ప్రతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో విద్యావేత్త గోనా రెడ్డి పర్యవేక్షణలో సహకారం పొందాడు. శక్తి వంచన లేకుండా పని చేసి పాఠకుల మన్ననలు పొందారు. ఈ విషయంలో పలుమార్లు నా నుండి సూచనలు సలహాలు గైకొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రతి ఏటా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల కళాశాల విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ వంటి కార్యక్రమాల నిర్వహణలో సలహాలు పొందడమే కాకుండా న్యాయ నిర్ణేతగా, జవాబు పత్రాల మూల్యాంకనంలో ఫలితాల నిమిత్తం అధికారుల సూచన మేరకు నాకు కీలకమైన బాధ్యతలు అప్పగించడం జరిగేది. అదేవిధంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పేరుగాంచిన గొప్ప గొప్ప కవులు, రచయితల జయంతులు, వర్ధంతుల సమావేశాలు నిర్వహించడం లో నాగయ్య కృషి వెలకట్టలేనిది. ఇట్లా చిలుకూరు, వలిగొండ, నల్లగొండ జిల్లా కేంద్ర గ్రంథాలయాలలో 30 సంవత్సరాలు వృత్తిపరంగా వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం, దాతల సహకారంతో సదుపాయాలు మెరుగుపరచడం, పాఠకుల అవసరాలను గమనించి సరైన సేవలు అందించడం ద్వారా గ్రంథాలయాలకు మరింత జీవం పోసినట్లయిందని చెప్పవచ్చు. నల్గొండ గ్రంథాలయంలో పాఠక సభ్యత్వాల నమోదు రికార్డు స్థాయిలో జరిగింది. అందుకు నాగయ్య కృషి కొనియాడ దగింది. రెండు ఉత్తమ లైబ్రేరియన్ అవార్డులు, తెలంగాణ గ్రంథాలయ పరిషత్ 2023 లో ఉత్తమ గ్రంథపాలకునిగా సన్మానాలు, సత్కారాలు పొందడం జరిగింది. 30 ఏళ్ల సర్వీస్ లో ఏనాడు కూడా విధులకు ఆలస్యం రాకుండా వృత్తిని గౌరవ నిబద్ధతతో ప్రేమగా చాటిన వ్యక్తి. మే 12, 1970లో జన్మించిన ఇతడు దసరా పండుగకు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపిన కట్ట నాగయ్య అనుకోకుండా గుండెపోటుతో అక్టోబర్ 3న చనిపోయాడు. ఆయన మరణం అనేకమందికి తీవ్ర దిగ్భ్రాంతిని కలగజేసింది. ఆయనకు ఎటువంటి చెడు అలవాట్లు లేనప్పటికీ అకస్మికంగా వచ్చిన గుండెపోటుతో దూరం కావడం అందరి మనసు తొలిచివేసింది. బహుశా భూలోకంలో గ్రంథాలయాలకు బాగా సేవ చేస్తున్నాడని తెలిసి ఆ దేవుడు స్వర్గ లోకంలో కూడా గ్రంథాలయానికి అతడి సేవలు అవసరం ఉన్నాయని భావించి అతడిని మనకు దూరం చేసినట్లు ఉంది. నేడు కట్టా నాగయ్య మన మధ్య భౌతికంగా లేనప్పటికీ, ఆయన అందించిన సేవలు పాఠకుల హృదయాలలో స్థిరస్థాయిగా నిలబడతాయి. వీరి ఆదర్శవంతమైన జీవితం భవిష్యత్ తరాలకు ఒక స్ఫూర్తి దాయకం అవుతుందని ఆశించవచ్చు.

**- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి**
**రచయిత, నలగొండ**
**సెల్: 9441561655**

*గమనిక :*
**వలిగొండ మండలం నాగారంలో అక్టోబర్ 12, ఆదివారం కట్ట నాగయ్య సంతాప సభ ( దశదినకర్మ) జరుగుతున్న సందర్భంగా.....**

## తుమ్మ సరోజన కుటుంబాన్ని పరామర్శించిన సమ్మి గౌడ్ చిలువేరు



**కేసముద్రం వెలుతురు అక్టోబర్ 11:**
కేసముద్రం మున్సిపాలిటీ కిష్టాపురం కి చెందిన తుమ్మ పరమేశ్వర్ మాతృమూర్తి తుమ్మ సరోజన ఇటీవల అనారోగ్యంతో మరణించగా విషయం తెలిసిన వెంటనే వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి సరోజన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రగాఢ సానుభూతిని తెలిపి పరమేశ్వర్ కి మనోధైర్యాన్ని కల్పించారు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత కాంగ్రెస్ మండల నాయకుడు చిలువేరు సమ్మయ్య గౌడ్. ఈ కార్యక్రమంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ గౌరవ హోదారులు సామల నర్సయ్య, ఎర్రం శెట్టి అశోక్,చాగంటి రామ్, మోడెం రాజు,రవి,శీను మహేందర్,నాని,సిద్దు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో విస్తరణ పనులు

**- భీమేశ్వరాలయంలో నిత్యపూజలు**

**వేములవాడ,అక్టోబరు11( వెలుతురు):**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానము ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు చేపడుతున్నందున భక్తుల దర్శనాలు, పూజలను భీమేశ్వరాలయానికి మార్చారు. భక్తుల సౌకర్యార్థం మ్రొక్కుబడులు, ఆర్జిత సేవలకొరకై, అనగా కోడె మ్రొక్కుబడి, అభిషేకములు, అన్నపూజ, కుంకుమపూజ, నిత్య కళ్యాణము, చండి హెమం, మొదలగు మ్రొక్క బడులు తీర్చుకొనుటకు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రధాన ఆలయములో నిత్య కైంకర్యములు, ఛత్పుకాల పూజలు, ఆలయ అర్చకులచే యధావిధిగా అంతరంగితముగా నిర్వహిస్తారు. ఈ ఏర్పాట్లను భక్తులు గమనించి సహకరించాలని వేములవాడ ఈ.ఓ ఒక ప్రకటన లో తెలిపారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికైన గొరిగే సోములు

### రాష్ట్ర మహిళా కన్వీనర్ గా ఎన్నికైన కోట సంధ్యా రాణి





**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 11**
భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయు అనుబంధం) రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రామన్నపేట పట్టణానికి చెందిన గొరిగే సోములు, రాష్ట్ర మహిళా కన్వీనర్ గా కక్కిరేణి గ్రామానికి చెందిన కోట సంధ్యా రాణి ఎన్నికయ్యారు. గత రెండు రోజులుగా హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం 4వ రాష్ట్ర మహాసభలు జరిగాయి.

ఆ మహాసభలో యాదాద్రి భువనగిరి జిల్లా నుండి రామన్నపేట మండలానికి చెందిన సోములు, సంధ్యా రాణిని ఏకగ్రీవంగా ఎన్నుకోవటం జరిగింది. తన ఎన్నికకు సహకరించిన కార్మికసంఘం ప్రతినిధులకు, సీఐటీయు నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గొరిగే సోములు, కోట సంధ్యా రాణి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సీఐటీయు చేసే పోరాటాల్లో ముందుంటామని అన్నారు. కార్మికుల పెండింగ్ క్లయిములను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి సంక్షేమ బోర్డు కు కేటాయించిన నిధులను కార్మికులకు సక్రమంగా కేటాయించాలని అన్నారు.

## స్థానిక సంస్థల్లో పోత్తులు ఉండవు, ఒంటరిగా పోటీ చేస్తాం..

**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 11:**
భారతీయ జనతా పార్టీ చౌటుప్పల్ మున్సిపల్ శాఖ అధ్యక్షురాలు కడారి కల్పన యాదవ్ ఆధ్వర్యంలో శనివారం రోజున మున్సిపల్ ముఖ్య నాయకుల , బూత్ అధ్యక్ష కార్యదర్శుల సమావేశం హెూటల్ హైవే 9 నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో నల్లగొండ జిల్లా బిజెపి అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. త్వరలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పార్టీ కి ఎవరితోటి ఎలాంటి పొత్తులు లేకుండా చౌటుప్పల్ అన్ని వార్డులలో ఎంపీటీసీ, సర్పంచు, కౌన్సిలర్లకు స్థానాలన్నింటికీ ఒంటరిగా పోటీ చేస్తుందని తెలిపారు. పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లాలని, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆర్ ఆర్ ఆర్ రోడ్డు విస్తరణలో స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి, ఆయన బంధువుల వాటాల విషయాలపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు., ఎమ్మెల్యే, ఆయన బంధువుల పై వస్తున్న ఆరోపణలకు దమ్ముంటే రాజీనామా చేసి ప్రజా క్షేత్రానికి వెళ్లి గెలవాలని స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కి సవాల్ విసిరారు. మోదీ సుస్థిర పాలనకు స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపికి జనం పట్టం కట్టడానికి రెడీగా ఉన్నారన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల విషయంలో హైకోర్టు స్టే విధించడంలో బిజెపిపై దుమ్మెత్తి పోస్తున్న కాంగ్రెస్ శ్రేణులు తీరు మార్చుకోవాలన్నారు. ఈ



కార్ రేసులో కేటీఆర్ ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయడం లేదో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి నాయకులు రమణ గోని శంకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ ఒక గూటి పక్షులే నని, వారి లోపాయి కారి ఒప్పందాలతోనే రేవంత్ రెడ్డి అరెస్టు చేయడం లేదన్నారు..పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన మాట్లాడుతూ కవితక్క రెజిగ్నేషన్ఫ్రెస్ ఎందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యాక్సెప్టు చేయడం లేదన్నారు. స్పీకర్ ఫార్మేట్ లో రాజీనామా సమర్పించినప్పుడు ఎందుకు ఆమోదించడం లేదని ఆమె ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు రమణ గోని శంకరయ్య, సీనియర్ నాయకులు ముత్యాల భూపాల్ రెడ్డి ,మాజీ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్ బాబు , లింగోజిగూడెం, మాజీ సర్పంచ్ రమణ గోని దీపిక , జిల్లా పార్టీ మాజీ కార్యదర్శి ఆలే చిరంజీవి జిల్లా మాజీ కార్యదర్శి బత్తుల జంగయ్య గౌడ్ , మాజీ అధ్యక్షులు ఉడుగు వెంకటేశం గౌడ్ , కడవేరు పాండు మున్సిపల్ మాజీ ప్రధాన కార్యదర్శి కడారి ఐలయ్య యాదవ్ , సీనియర్ లీడర్లు చికూరి ప్రభాకర్, తూర్పునూరి నరసింహ, చీకూరి వెంకటేశం, పర్నే శ్రీనివాస్ రెడ్డి ,బండారు మహేందర్ రెడ్డి , ఎడ్ల మహేశ్వర్ రెడ్డి, ఊదరి రంగయ్య ,ఉష్కాగులా నాగరాజు వరగంటి భాను ప్రకాష్, బడుగు ధనుంజయ, మున్సిపల్ ఉపాధ్యక్షులు గుండబోయిన వేణు, వంగాల



రమాకాంత్, ప్రధాన కార్యదర్శులు తోకల సాయికుమార్ , బుడ్డ సురేష్, మున్సిపల్ కార్యవర్గ సభ్యులు బి.రాజశేఖర్ గౌడ్ ,మలిగే రవి, భూత్ అధ్యక్షులు ఇ. దామోదర్ రెడ్డి, సిలువేరు సురేష్ , కడ్తాలా శ్రీనివాస్, పాశం భరత్ ,కానుగు శేఖర్ ,దండం సత్తిరెడ్డి గుండెబోయిన నరేష్, గజం ఆనంద్ ,చింతకింది సంపత్, మార్గం స్వామి , సూర్నేల హరికృష్ణ కార్యకర్తలు అనంతరెడ్డి ,దుర్గయ్య పి. భాస్కర్ ,గణేష్ ,శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్య సమాజాభివృద్ధికి ఉపయోగపడాలి





**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 11 :**
నారాయణఖేడ్ పట్టణంలో సంగ్రామ్ మహారాజ్ ప్రతి విద్యార్థి నేర్చుకున్న విద్య సమాజాభివృద్ధికి ఉపయోగపడాలని అలాగే విద్యనేర్పిన బడిని, తల్లిదండ్రులను, గురువులను మరువరాదని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి, అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్ అన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని శిశుమందిర్ పాఠశాలలో 2008-2009 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తారు, గురువులు మార్గనిర్దేశకులు అవుతారన్నారు. సరస్వతీ శిశు మందిరాలు దేశ సంస్కృతిని కాపాడడమే కాకుండా విద్యార్థులకు సంస్కారాన్ని అందిస్తున్నాయన్నారు. నారాయణఖేడ్లో దాదాపు నాలుగు దశాబ్దాలుగా శిశుమందిర్ సేవలు అందుతున్నాయన్నారు. ఈ శిశుమందిర్లో చదివిన అనేక మంది ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ సమాజంలో గుర్తింపు పొందుతున్నారన్నారు. పూర్వ విద్యార్థులు, విద్యనేర్చిన ఆచార్యులకు సన్మానం చేయడం, పాఠశాల అభివృద్ధి కోసం సహకరిం చడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో శిశుమందిర్ పూర్వ ప్రధానాచార్యులు, ఆచార్యులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ లో పిచ్చి కుక్క దాడిలో ఏకంగా 16 మంది తీవ్ర గాయాలు



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పరిధిలోని గడి వీధిలో ఒక పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. దొరికిన వారిని దొరినట్లు కరిచి బీభత్సం సృష్టించింది. పిచ్చి కుక్క దాడిలో సుమారు 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. ముఖ్యంగా కుక్క దాడిలో మహమ్మద్ ఇబ్రహీం అనే యువకుడి కుడి కన్ను పై, ముక్కు పై తీవ్రంగా గాయలయ్యాయి. మరికొందరి చేతుల పై, కాళ్ళ పై పిచ్చి కుక్క జరిపిన దాడిలో గాయపడగా వారిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. దింతో ఆగ్రహించిన స్థానికులు ఆ పిచ్చి కుక్కను వెంబడించి చంపేసినట్లు స్థానికులు తెలిపారు. జహీరాబాద్ లో ఇటీవల పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా స్థానిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

## బిజేపితోనే గ్రామాల అభివృద్ధి

### కన్నాపూర్ లో బోరుబావి ప్రారంభించిన బిజెపి మండల అధ్యక్షులు ఎనుగుల అనిల్

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 11:**



గ్రామాల అభివృద్ధి బిజెపి తోనే సాధ్యమని, కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయబడు తున్నా యని బిజెపి మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ అన్నారు. శనివారం శంకరపట్నం మండలం లోని కన్నాపూర్ గ్రామంలో ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో తన ఎంపీ నిధుల నుండి వేసిన బోరుబావుల ప్రారంభం సందర్భంగా ఎనుగుల అనిల్ మాట్లాడుతూ కన్నాపూర్ గ్రామస్తులు కోరగానే స్పందించిన కేంద్రమంత్రి బోరుబావిని వేయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామా ప్రజలు కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కి, బిజెపి మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ కు కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు రెడ్డి నరేందర్.నాయకులు కొయ్యడ అశోక్, మందడి జగ్గారెడ్డి, దాసరి సంపత్, ఎల్కపెల్లి సంపత్, జానపట్ల రాజిరెడ్డి . వీరార్జున్ . దాసరి సంపత్.జాలి రమణారెడ్డి నాంపెల్లి రవి, రాజిరెడ్డి.మాజీ ఉపసర్పంచ్ మల్లేశం. ముదిరాజ్ సంఘం నాయకులు నూనె పోశయ్య. భూమయ్య . సత్యనారాయణ లతోపాటు బిజేపి నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తనపై కేసుల చిట్టా బయటపెట్టిన రాజాసింగ్

**- ఎందుకు కేసులో పెట్టారో చెప్పాలని డిజిపికి లేఖ**

**హైదరాబాద్,అక్టోబర్ 11( వెలుతురు):**
హైదరాబాద్లో తన మీద పోలీసులు నమోదు చేసిన కేసుల వివరాలను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ బయటపెట్టారు. అక్రమ కేసులను నమోదు చేయడానికి గల కారణం ఏంటో చెప్పాలని రాష్ట్ర డీజీపీకి లేఖ రాశారు. మధ్య ప్రదేశ్లో జరిగిన ఓ హిందూ సభలో తాను మాట్లాడిన మాటలను పోలీసులు వక్రీకరించి కేసు నమోదు చేసారని ఫిర్యాదు చేశారు. హైరాదాబాద్ సిటీకి సంబంధం లేకుండా కేసు ఎలా పెడతారని లేఖలో ప్రశ్నించారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. రాజాసింగ్ ఫిర్యాదుపై రాష్ట్ర పోలీసులు తీసుకునే యాక్షన్పై ఉత్కంఠ నెలకొంది. రాజాసింగ్పై నమోదైన పోలీస్ స్టేషన్ల వివరాలు ఇలా ఉన్నాయి. కాంచన్బాగ్ పోలీస్ స్టేషన్, కాలా పత్తర్, నాంపల్లి, శాలిబండ, సంతోష్ నగర్, భవానీ నగర్, కామాటిపుర, హబీబ్ నగర్, అంబర్పేట్, బోరబొండ, హుస్సేనీ ఆలం, మాదన్నపేట, గోల్కొండ, ఫలక్నుమా, అత్తాపూర్, కుల్సుంపుర, పహాడీ షరీఫ్, నాంపల్లి, గుడి మల్కాపూర్, బేగంపేట, తలాబ్ కట్ట, బేగం బజార్, చంద్రాయణగుట్ట, మదనపేట పోలీస్ స్టేషన్ 2వ ఫిర్యాదు, బస్వకళ్యాణ్ కర్ణాటక పోలీస్ స్టేషన్, మలక్పేట, తాండూర్, బీదర్ కర్ణాటక, ముషీరాబాద్, బంజారాహిల్స్, బహదూర్పుర.. ఇలా మొత్తం 31 పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయినట్లు పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల పేరిట చెలగాటమాడిన రాష్ట్ర ప్రభుత్వం

**- రాబోయే స్థానిక ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్కు తగిన బుద్ధి చెబుతారు...**
**- బీసీ హక్కుల కోసం బీజేపీ పోరాటం కొనసాగుతుందని పార్టీ నేతల హెచ్చరిక...**



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు కోర్టు స్టే రావడంతో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్కల్



మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేష్ గంగ్వార్ నాయకత్వంలో జరిగిన ఈ ఆందోళనలో పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లేష్ గంగ్వార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పేరుతో బీసీ ప్రజలను మభ్యపెట్టి, వారి ఓట్లను వినియోగించుకుని రాజకీయ లబ్ధి పొందాలన్న కుట్ర పన్నింది. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించి బీసీలను మోసం చేసింది. కానీ కోర్టు స్టే ఇవ్వడంతో వారి డ్రామా తలకిందులైంది," అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కోర్టులో కేసు నడుస్తుండగానే ఎన్నికల కోడ్ అమలు చేస్తూ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడం బీసీ ప్రజల మనోభావాలకు తీవ్రంగా దెబ్బతీసిందని మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని గుర్తించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన బీసీ సమాజాన్ని కోరారు. ఈ సందర్భంగా హద్నూర్ పోలీసులు అక్కడికి చేరుకుని నిరసన చేస్తున్న బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసనలో మండల ప్రధాన కార్యదర్శులు రాహుల్, భీమన్న, జిల్లా నాయకులు ఓంకార్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, బిజిలిపురం నవీన్ కుమార్, కార్యదర్శి శ్రీకాంత్ ముదిరాజ్, సీనియర్ నాయకులు వీరారెడ్డి, శ్రీధర్ మారాజ్, మహేష్, పాండులు పాల్గొన్నారు.

## సీనియర్ నాయకులు ఘర్మ్మ మరణం కుటుంబానికి తీరని లోటు

**ఏఐబిఎస్సెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ తో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎండి తన్విర్**





**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని శేకపూర్ గ్రామ మాజి మెంబర్ ఘర్మ్మ నాయక్ శుక్రవారం నాడు ఆకస్మికంగా మరణించారనే విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర మాజీ ఐడిసి కార్పొరేషన్ చైర్మన్ మొహమ్మద్ తన్విర్ వారి స్వగృహానికి విచ్చేసి సంగారెడ్డి జిల్లా అల్ ఇండియా బంజారా సేవ సంఘ్ అధ్యక్షుడు పవార్ శ్రీనివాస్ నాయక్ తో కలిసి ఘర్మ్మ నాయక్ భౌతిక కాయాన్ని సందర్శించిన అనంతరం నివాళు లు అర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షించరు. గతంలో మాజి మంత్రి స్వర్గీయ మొహమ్మద్ ఫరీదుద్దీన్ గారితో ఘర్మ్మ నాయక్ మంచి సత్సంబంధాలు కలిగి ఉండేవారు. ఈ సందర్భంగా మాజి ఐడిసి చైర్మన్ మొహమ్మద్ తన్విర్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా మాజి మెంబర్ ఘర్మ్మ నాయక్ మంచి వ్యక్తిత్వం కలిగి ఉండేవారని, ఆయన మరణం కుటుంబ సభ్యులు, శేకపూర్ తండా వారికి తీరని లోటని అన్నారు. మాజి మెంబర్ కుమారుడు హీరో, దర్శకుడిగా నటించిన పాండు చవాన్ ఘోర్ జీవన్ సినిమాకు ఘర్మ్మ నాయక్ నిర్మాతగా ఉన్నారు. అంతక్రియల కార్యక్రమన్ని అల్ ఇండియా బంజారా సేవ సంఘ్ జిల్లా అధ్యక్షుడు పవార్ శ్రీనివాస్ నాయక్, మాజి కౌన్సిలర్ మోతీరం నాయక్ దగ్గరుండి చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, జగో తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు పగిడిమర్రి రాములు నేత, మాజి సర్పంచ్ నాగు చవాన్, బిజీ సందీప్, మర్రి బాల్రెడ్డి, రవీందర్ చవాన్, మాజి ఆర్మీ అధికారి రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రత్యేక కార్పోరేషన్

**- సిఎం రేవంత్కు చిన్నారెడ్డి లేఖ**

**హైదరాబాద్,అక్టోబరు11( వెలుతురు):**
ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ జి.చిన్నారెడ్డి కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్రెడ్డికి విజ్ఞప్తి చేస్తూ ఓ లేఖ రాశారు. రాష్ట్రంలో వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారు. అయితే, వారిని ప్రైవేటు ఏజెన్సీలు నియమించడం వల్ల శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ప్రైవేటు రిక్రూట్మెంట్ ఏజెన్సీలు ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇవ్వడం లేదు. సుమారు 20శాతం వరకు వేతనాల్లో కోత విధించడంతో పాటు.. జీతాలు కూడా ఆలస్యంగా ఇస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ఇటీవల కేబినెట్ తీర్మానం చేసింది. తెలంగాణలో కూడా అదే తరహా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో చిన్నారెడ్డి వివరించారు. దంఈఓత నిరుద్యోగులకు ఊరట దక్కుతుందని అన్నారు. అలాగే అవసరమున్నచోట ప్రభుత్వమే రిక్రూట్ చేసుకోవచ్చన్నారు.

## స్వదేశీ వస్తువులు వాడండి అని చెప్పే ప్రభుత్వం కల్లుగీత వృత్తిని ఎందుకు ప్రోత్సహించరు.

### - యం.వి.రమణ




**కామారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 11:**
శనివారం రోజున కల్లుగీత కార్మిక సంఘం కామారెడ్డి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్ వెంకట్ గౌడ్ అధ్యక్షతన ఆర్ఎంబి కార్యాలయంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ రాష్ట్ర కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్ పాల్గొని ప్రసంగించారు. దేశీయ వస్తువులనే వాడండని ప్రధాని మోడీ గారు చెబుతున్నారని ప్రకృతి పానీయం నీరా మరియు కల్లును ఎందుకు ప్రోత్సహించడం లేదని రమణ అన్నారు. సాఫ్ట్ డ్రింకులను ఉత్పత్తి చేసే బడా కార్పొరేట్ కంపెనీలు కోట్లాది రూపాయలు ప్రజల నుండి దండుకుంటున్నాయని అన్నారు. ఇన్ని ఏండ్ల లో కేంద్ర బిజెపి సర్కార్ ఒక్క పథకమైనా గీత కార్మికుల సంక్షేమానికి ప్రవేశపెట్టిందా అని ప్రశ్నించారు. తామే పెంచిన %+టా% ని తగ్గించి ప్రజలు పండుగ చేసుకోండని ప్రధాని అంటున్నారు.నిరుపేదలైన వారందరికీ ఇంటికి 20 లక్షలు ఇవ్వండి అప్పుడు సంబరంగా పండుగ చేసుకుంటామని అన్నారు.స్వయం సహాయక సంఘాల సభ్యులని కోటీశ్వరులను చేస్తామంటున్నారు కల్లుగీత సొసైటీ సభ్యులు స్వయం పోషకంగా జీవిస్తున్నారు కదా వీరి గురించి ఎందుకు ఆలోచించరని వారు ప్రశ్నించారు. వృత్తిని ఆధునికరించి,నీరా తాటి ఈత ఉత్పత్తులను ప్రోత్సహించి యువతీ యువకులకు ఉపాధి కలిగించే ఆలోచన కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేయాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి సిరిపురం రమేష్ మాట్లాడుతూ వృత్తి చేసే వారందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని. పెండింగ్ ఎక్స్గ్రేషియా డబ్బులు వెంటనే విడుదల చేయాలన్నారు.చెట్ల పెంపకానికి సొసైటీ కి ఐదు ఎకరాల చొప్పున భూమి ఇచ్చి హైబ్రిడ్ తాటి ఈత వనాలు పెంచాలని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో నీరా తాటి ఈత ఉత్పత్తుల కేంద్రాన్ని ప్రారంభించాలని ప్రతి జిల్లాలో ఈ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని,కల్తీ కల్లు పేరు తోటి కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని రైతు బీమా తరాలోనే గీత కార్మికులందరికీ గీతన్న భీమా ను అమలు చేయాలని అన్నారు,జిల్లా అధ్యక్షులు ఎస్. వెంకట్ గౌడ్ మాట్లాడుతూ ఈనెల 19 న కల్లు గీత కార్మిక సంఘం 68వ వార్షికోత్సవాలు నిర్వహించి, అన్ని మండల మహాసభలు నిర్వహించి నవంబర్ 11న జిల్లా మహాసభ నిర్వహిస్తామని, ఈయొక్క మహాసభల్లో కల్లు గీత కార్మికులు గౌడ సోదరులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి గౌడ్,రవీందర్ గౌడ్ శంకర్ గౌడ్,మోహన్ గౌడ్, కార్యదర్శులు రమేష్ గౌడ్, రాజా గౌడ్,కమిటీ సభ్యులు స్వామి గౌడ్,హనుమ గౌడ్ కృష్ణ గౌడ్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సురుగు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయలకు అతీతంగా ప్రభుత్వ ఫలాలు పేదలకు అందాలి

### - ఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
ప్రభుత్వ ఫలాలు నిరుపేదలకు అందలాంటే రాజకీయాలకు అతీతంగా పనులు జరగాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. నిరుపేదల సొంతింటి కలలు సహకారం చేసేలా చేపడుతున్న ఇండ్ల నిర్మాణం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శనివారం బోరజ్ మండలంలోని పూసాయి, మాండగడదగ్రామాలలో ఇందిరమ్మ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అంజూరైన ఇండ్లకు స్థానిక నాయకులు, లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో ఇండ్లు లేని నిరుపేదలు ఎవ్వరు ఉండకూడదని సదుద్దేశంతో ఇప్పటికే 4 కోట్ల 80 లక్షల ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, ఈ సంవత్సరం మరో 2 కోట్ల 40 లక్షల ఇంటి నిర్మాణ కార్యక్రమం జరుగుతోందన్నారు. పేదల సొంతింటి కలను సహకారం చేసేలా భూమి పూజ చేసిన ఇండ్లకు అధికారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కార్యాలయంలో పలువురు బిజెపి నాయకులు, అశోక్ రెడ్డి.రమేష్. గంగాధర్ సంజు.






గణేష్ శ్రీనివాస్ అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అధిక వడ్డీల పేరుతో 50కోట్ల మోసం

**- తప్పించుకు తిరుగుతున్న మోసగాడి అరెస్ట్**

**నల్గొండ,అక్టోబరు11( వెలుతురు):**
అధిక వడ్డీ పేరుతో రూ.50 కోట్ల మేర మోసానికి పాల్పడిన నిందితుడిని నల్గొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు విలువైన కార్లు, ఆస్తి పత్రాలు, బాధితులకు ఇచ్చిన ప్రామిసరీ నోట్లు, 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అప్పులిచ్చిన వారు ఒత్తిడి చేయడంతో పరారీలో ఉన్నాడు. పోలీసులు రంగంలోకి దిగా అతడిని పట్టుకున్నారు. కేసు వివరాలను ఎస్పీ శరత్ చంద్ర పవార్ మీడియాకు వెల్లడించారు. పీఏ పల్లి మండలం, వద్దిపట్ల గ్రామానికి చెందిన రమావత్ బాలాజీ 2020లో ఐస్‌క్రీమ్ పార్లర్ వ్యాపారం ప్రారంభిస్తానని చెప్పి.. బంధువుల వద్ద రూ.5 లక్షలు రూ.2ల వడ్డీకి తీసుకున్నాడు. వ్యాపారంలో నష్టపోయి.. రియల్ ఎస్టేట్ వ్యాపారం వైపు అడుగులు వేశాడు. రూ.6 వడ్డీ చొప్పున అదే గ్రామానికి చెందిన వారి దగ్గర నుంచి రూ.15 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. సకాలంలో వడ్డీ చెల్లిస్తూ నమ్మకం కలిగించాడు. మరికొంత మంది ఏజెంట్లను నియమించుకొని.. చుట్టుపక్కల గిరిజన తండాల్లో అధిక వడ్డీకి అప్పులు తీసుకున్నాడు. ఈ డబ్బుతో బంధువులు, స్నేహితుల పేరిట వ్యవసాయ భూములు, ఇళ్లు, ఖరీదైన కార్లు, బైక్‌లు కొనుగోలు చేసి జల్సాలు చేసేవాడు. ఇంకా అధిక డబ్బులు వసూలు చేసే ఉద్దేశంతో నెలకు రూ.10 వడ్డీ ఇస్తానని జనాలను నమ్మించి రూ.కోట్లలో డబ్బులు వసూలు చేసి.. వడ్డీ మాత్రమే ఇచ్చి బాధితుల వద్ద ఉన్న ప్రామిసరీ నోటు వెనుక వడ్డీ ఇచ్చినట్లు రాసి ఇచ్చేవాడు. బ్యాంక్‌లో వచ్చే వడ్డీ కంటే పది రేట్లు ఎక్కువ వడ్డీ ఇవ్వడంతో జనాలు ఆకర్షితులై బాలాజీ నాయక్‌కి అధికమొత్తంలో డబ్బులు ఇచ్చారు. గత కొన్ని నెలలుగా బాధితులకు అసలు, వడ్డీ డబ్బులు ఇవ్వలేక పోయే సరికి.. వారంతా అతడిపై ఒత్తిడి చేయడం ప్రారంభించారు. దీంతో వారి నుంచి తప్పించుకొని పారిపోయాడు. తాజాగా నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు.. రిమాండ్‌కి తరలించారు.

# గంజాయి ధ్వంసంతో తండావాసులు దాడి

**సంగారెడ్డి,అక్టోబరు11( వెలుతురు):**
సంగారెడ్డి జిల్లాలోని చల్లగిద్దా తండాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గంజాయి మొక్కలను ధ్వంసం చేశారని పోలీసులపై తండా వాసులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. చల్లగిద్దా తండాలో గంజాయి సాగు చేస్తున్నట్లు సంగారెడ్డి జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇవాళ ఉదయం తండాకు చేరుకుని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పత్తి చేనులో గంజాయి మొక్కలు కనిపించగా, వాటిని పోలీసులు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో పోలీసులపై తండా వాసులు దాడికి దిగారు. రాళ్లతో దాడి చేసి గాయపరిచారు. అంతటితో ఆగకుండా పోలీసుల సెల్‌ఫోన్లను తండా వాసులు లాక్కున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న నారాయణఖేడ్ డీఎస్పీ పోలీసు బలగాలతో చల్లగిద్దా తండాకు చేరుకున్నారు.

# బహిర్భూమికి వెళ్లి బావిలో పడ్డ చిన్నారుల మృతి

**మహబుబాబాద్,అక్టోబరు11( వెలుతురు):**
జిల్లాలోని కొత్తగూడ మండలం ఎంచగూడెంలో విషాదం చోటుచేసుకుంది. దసరా పండుగ కోసమని ఇటీవలే ఎంచగూడెం గ్రామానికి ఇటికాల నర్సయ్య, స్వాతి దంపతుల కుమారుడు రితిక్, నర్సయ్య సోదరి అనిత, శ్రీనివాస్ దంపతుల కుమారుడు జతిన్ అమ్మమ్మ ఇంటికి వచ్చారు. అయితే వీరి బంధువు ఒకరు చనిపోవడంతో.. కుటుంబ సభ్యులందరూ వేరే గ్రామానికి వెళ్లారు. ఇంటి వద్ద ఉన్న రితిక్, జతిన్ కలిసి.. గ్రామ శివార్లలో ఉన్న వ్యవసాయ బావి వద్దకు బహిర్భూమికి వెళ్లారు. ఇద్దరు కూడా ప్రమాదవశాత్తు బావిలో పడి ప్రాణాలు కోల్పోయారు. బావిలో తేలియాడుతున్న పిల్లలను చూసి స్థానికులు అప్రమత్తమయ్యారు. పోలీసులకు సమాచారం అందించారు. కొత్తగూడ ఎస్ఐ రాజ్ కుమార్ తన బృందంతో ఘటనాస్థలానికి చేరుకుని రితిక్, జతిన్ మృతదేహాలను బావిలో నుంచి బయటకు తీశారు. ఇద్దరు పిల్లలు చనిపోవడంతో వారి తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# 14న బిసి కులాల బంద్

**- కిషన్ రెడ్డి మద్దతు కోరిన కృష్ణయ్య**

**హైదరాబాద్,అక్టోబరు11( వెలుతురు):**
బీసీ రిజర్వేషన్లకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసనగా ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిస్తున్నట్లు బీసీ సంఘాల నాయకుడు ఆర్ కృష్ణయ్య ప్రకటించారు. అన్ని బీసీ సంఘాల మద్దతుతో బంద్ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. అందరూ కలిసి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు, కుల సంఘాలు బంద్‌కు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కోరడం జరిగిందని తెలిపారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డి చెప్పారని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కోర్టులు జోక్యం చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. బీసీ సంఘాలు ఇప్పటికే పెద్ద ఎత్తున రౌండ్ టేబుల్ సమావేశం, నిరసనలు, ధర్నాలు చేస్తున్నారని ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడించారు.

# తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు

**- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి**

**హైదరాబాద్,అక్టోబరు11( వెలుతురు):**
తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర తమిళనాడు తీరప్రాంతం, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని పేర్కొంది. ఉత్తర కోస్తాంధ్ర, పరిసర ప్రాంతాల్లో సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని.. దక్షిణ ఒడిశా నుంచి ఏపీ తీర ప్రాంతం మీదుగా ఉత్తర తమిళనాడు వరకు సగటు సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని చెప్పింది. శనివారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో.. సోమవారం కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. మంగళవారం ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# తెలంగాణ ను ఫార్మా,ఐటీ హబ్ గా తీర్చిదిద్దుతాం

**- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**






**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అల్యూమిని (1974–2025) గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి,రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు..KU వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి పలువురు.. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించిన మంత్రులు.. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ ఫార్మా అల్యూమ్ని గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరుకావడం ఎంతో సంతోషంగా ఉన్నది. నాతో పాటు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐటీ, ఇండస్ట్రీస్



డైనమిక్ మినిస్టర్ శ్రీధర్ బాబు గారికి, K.U వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి గారికి,ఇతర అతిథులకు,యూనివర్సిటీ ఫ్యాకల్టీ, పూర్వ విద్యార్థులు, ముఖ్యంగా ఇక్కడికి విచ్చేసిన విద్యార్థులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు, నమస్కారం. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ గోల్డెన్ జూబ్లీ పురస్కరించుకుని నిర్వాహకులు ఈ విశిష్ట సదస్సును నిర్వహించడం చాలా గొప్ప విషయం. ఈ వేడుకలు ఇంత ఘనంగా నిర్వహిస్తున్న KU ఫార్మా అల్యూమ్ని అసోసియేషన్ సభ్యులకు నా హృదయపూర్వక అభినందనలు. పూర్వ విద్యార్థులు అంతా తిరిగి ఒక వేదికను ఏర్పరచుకుని సమాజానికి వారిందిస్తున్న సేవలు గుర్తు చేసుకోవడం,భవిష్యత్ తరాలకు మార్గ నిర్దేశనం చేయడం..విలువలతో కూడిన విద్యకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ముఖ్యంగా ఫార్మసీ వృత్తి అనేది సమాజం పట్ల హ్యూమానిటీకి,పరిశోధన, నూతన ఆవిష్కరణలకు మధ్య వారధిగా పనిచేస్తుంది. "డాక్టర్ ట్రీట్ మెంట్ చేస్తారు...ట్రీట్ మెంట్ లో ఇచ్చే మెడిసిన్ పేషంట్ ను క్యూర్ చేస్తుంది. ఆ మెడిసిన్ ఎలా పనిచేస్తుంది,దేనికి పనిచేస్తుంది,ఎంత మోతాదు అనే పరిశోధన చేసేది మీరే కదా.. ప్రజల ఆరోగ్యం, భద్రత కోసం మీరు అందించే సేవలు వెలకట్టలేనివి. సమాజం కోసం మీ మేధస్సును దారపోస్తారు. నల్గొండ జిల్లా సంకిశాల ప్రాంతానికి చెందిన పైళ్ల మల్లారెడ్డి 35 ఏళ్లుగా ఫార్మా రంగంలో ఉన్నారు. ఆయన న్యూ యార్క్ లో బ్యాక్టోలాక్ ఫార్మాస్యూటికల్,పలు




కంపెనీలకు చైర్మన్ గా ఉన్నారు. ఆయన మార్కెట్ నెట్ వర్త్ సుమారు 10వేల కోట్లు.. గ్రామీణ ప్రాంతానికి చెందిన పైళ్ల మల్లారెడ్డి గారి లాంటి వారిని నేటి ఫార్మా విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి. విద్య అనేది మనలో వెలుగు నింపుతుంది, తరతరాలకు ప్రేరణ ఇస్తుంది. అందుకే మా నల్గొండ మహాత్మా గాంధీ యూనివర్సిటీ లో కొత్తగా బి ఫార్మసీ, ఎం ఫార్మసీ కోర్సులు ఏర్పాటుకు కృషి చేశాను నల్గొండ ప్రాంతంలో దివీస్ లాంటి ప్రముఖ ఫార్మా కంపెనీలు ఉన్నాయి ఇట్లాంటి సంస్థలు తెలంగాణ నే కాదు యావత్ భారతదేశాన్ని అభివృద్ధిలో, నూతన ఆవిష్కరణలో,సమాజ సేవ మార్గంలో నంబర్ వన్ గా నిలిపే మూల స్తంభాలుగా ఉంటాయనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. గత అయిదు దశాబ్దాలుగా యూసిపిఎస్సి ఔషధ విద్య, పరిశోధన మరియు సామాజిక సేవల్లో అగ్రగామిగా నిలిచింది. విద్యార్థుల్లో మేధస్సుతో పాటు నైతిక విలువలను పెంపొందించడం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అకాడమిక్, ఇండస్ట్రీ, నియంత్రణ సంస్థలలో నాయకులుగా ఎదిగేలా చేసింది. ఇక్కడి పూర్వ విద్యార్థులు పరిశ్రమలలో, పరిశోధనలో, నియంత్రణ సంస్థలలో చేసిన కృషి ఈ సంస్థ యొక్క దూరదృష్టి మరియు సమగ్ర విద్యను ప్రతిబింబిస్తుంది. విద్యార్థుల సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం అల్యూమ్ని అందిస్తున్న సహకారం వారికి ఉన్న దాతృత్వ మనసుకు నిదర్శనం. ఈ గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ గత విజయాల జ్ఞాపకాన్ని మాత్రమే కాకుండా, భవిష్యత్ ఆవిష్కరణలకు,సహకారానికి ప్రేరణగా నిలవాలని కోరుకుంటున్నాను. ఫార్మా రంగం అభివృద్ధి కోసం మా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఇండస్ట్రీస్ మంత్రి శ్రీధర్ బాబు గారి నేతృత్వంలో అనేక చర్యలు చేపడుతుంది. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ORR నిర్మించాం. శంషాబాద్ ఎయిర్పోర్ట్ నిర్మించాం.అది అనేక పరిశ్రమలు వచ్చేందుకు కీలక భూమిక పోషించింది. ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్డు నిర్మించబోతున్నాం..ఌORR నుండి RRR కు రేడియల్ రోడ్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇది పారిశ్రామిక వృద్ధికి దోహద పడుతుంది. తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు మా క్యాబినెట్ అంతా కలసి అన్ని రకాల చర్యలు చేపడుతున్నాం. ఐటీ,ఫార్మా హబ్ గా తెలంగాణను తీర్చిదిద్దుతాం ఇక్కడికి వచ్చిన ఫార్మా ప్రముఖులు, ప్రొఫెసర్స్ అందరూ మరిన్ని నూతన ఆవిష్కరణలు చేయాలని,భగవంతుడు వారికి మరింత శక్తిని ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. కాకతీయ విశ్వవిద్యాలయం నుండి మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి, విద్య, పరిశోధనల ద్వారా రాష్ట్రం మరియు దేశానికి మరింత సేవ చేయాలని ఆశిస్తున్నాను.

# కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తున్నటువంటి వివిధ ప్రాజెక్టుల శంకుస్థాపన

**కార్యక్రమాన్ని పార్లమెంట్ సభ్యులు గేడం నగేష్, శాసనసభ్యులు పాయల్ శంకర్, శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులతో కలిసి వీక్షించడం జరిగింది.**




**ఆదిలాబాద్ వెలుతురు అక్టోబర్ 11:**
కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ లో గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తున్నటువంటి వివిధ ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమాన్ని






గౌరవ పార్లమెంట్ సభ్యులు శ్రీ గేడం నగేష్ గారు మరియు గౌరవ శాసనసభ్యులు శ్రీ పాయల్ శంకర్ గారు, శాస్త్రవేత్తలు, అధికారులు మరియు రైతులతో కలిసి వీక్షించడం జరిగినది, ఈ కార్యక్రమంలో డా. ఎన్. రామ గోపాల వర్మ, ప్రోగ్రాం కోఆర్డినేటర్, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ , జిల్లా ఉద్యాన అధికారి నరసయ్య, కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ శాస్త్రవేత్తలు డా. రఘువీర్, డా. ఎం. సురేశ్, డా. జి. శివ చరణ్, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమం లో గౌరవ ప్రధానమంత్రి గారి ప్రసంగాన్ని రైతులతో కలిసి వీక్షించడం జరిగినది. తర్వాత రైతులను ఉద్దేశించి గౌరవ పార్లమెంటు సభ్యులు మరియు గౌరవ శాసనసభ్యులు మాట్లాడడం జరిగినది. ప్రస్తుతం రైతులు పడుతున్న కష్టాలను అధిగమించే సాంకేతికతను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. అధునాతన విత్తనాలు, సాంకేతిక పరికరాలు మరియు ఆధునిక సాగు పద్ధతుల ద్వారా పంటల దిగుబడిని పెంచుకోవాలి, రైతులను ఒకే పంటకు పరిమితం చేయకుండా, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలైన పప్పు ధాన్యాలు, నువ్వులు, మొక్క జొన్న, కూరగాయలు వంటివి సాగు చేయాలని సూచించారు. పప్పు దినుసు పంటల సాగు వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఇలాంటి కృషి విజ్ఞాన కేంద్రం వంటి సంస్థల సహాయం తో రైతులు స్వయం సమృద్ధి సాధించి ముందుకు సాగాలని ఆశించారు. అనంతరం కెవికె వారు ఏర్పాటు చేసినటువంటి వ్యవసాయ ప్రదర్శనను, డ్రోన్ ప్రదర్శనను ప్రజాప్రతినిధులు, రైతులు తిలకించడం జరిగినది. రైతులకు రూపాయలు 42,000 కోట్ల విలువ గల పలు ప్రాజెక్టులను రానున్న ఐదు సంవత్సరాలకు గాను రైతు సంక్షేమం కొరకు రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి ప్రధానమంత్రి కృషి యోజన, వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పన, విలువ జోడి



# నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్ బజార్



చూస్తుంటే.. మనం నెల్లూరులో ఉన్నామా? లేకుంటే విదేశాల్లో ఉన్నామా? అనే ఆలోచన వస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. శనివారం నాడు నెల్లూరు మైపాడు గేటు వద్ద స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను అమరావతి నుంచి వర్చువల్ విధానంలో సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈసందర్భంగా మహిళా వ్యాపారులతో సీఎం చంద్రబాబు నేరుగా మాట్లాడారు. దుకాణాలు పొందడంతోపాటు నూతన వ్యాపారాలు చేపట్టిన మహిళలు.. తమ ఆనందాన్ని సీఎం చంద్రబాబుతో పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో అన్ని మున్సిపాల్టీల్లో ఈ స్మార్ట్ స్ట్రీట్ బజార్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అరాచకాలు చేశారంటూ వైసీపీని విమర్శించారు. మద్యం అడ్డు పెట్టుకుని తప్పులు మీద తప్పులు చేశారని మండిపడ్డారు. ఇటీవల నకిలీ మద్యం పట్టుకున్నామని.. ఈ కేసులో తమ పార్టీ వారు ఉన్నా.. వారిని సైతం సస్పెండ్ చేశామని గుర్తు చేశారు. కానీ దీనిని సైతం రాజకీయం చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై మద్యం సీసాలపై హోలోగ్రామ్ ఉంటుందని.. దీనిని ఫోన్‌లో స్కాన్ చేస్తే మొత్తం వివరాలు వస్తాయని ప్రజలకు తెలిపారు. రాష్ట్రంలో శవ రాజకీయాలు చేస్తున్నారంటూ వైసీపీ నేతలపై నిప్పులు చెరిగారు. తప్పుడు ప్రచారాలు చేస్తే తాట తీస్తానంటూ వారిని హెచ్చరించారు. ఆడబిడ్డల జోలికి వస్తే సహించబోమని క్లియర్ కట్‌గా వార్నింగ్ ఇచ్చారు. తాము మంచిగా ఉంటామని.. మీ జీవన ప్రమాణాల కోసం పని చేస్తామంటూ ప్రజలకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అలాగే మెడికల్ కాలేజీలపై సైతం అనవసర ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ కాలేజీలు వస్తే.. 180 సీట్లు అదనంగా వస్తాయని.. తద్వారా పేద వారికి మంచి వైద్యం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారం చేపట్టిన ఈ 16 నెలల్లో చేసింది ప్రారంభం మాత్రమేనని.. చేయాల్సింది చాలా ఉందన్నారు. అయితే విధ్వంసాన్ని అధిగమించడం అంతా ఈజీ కాదని చెప్పారు. పిల్లల భవిష్యత్తుకి ఏఐ అవసరమని స్పష్టం చేశారు. విశాఖకి రూ.90వేల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయని ఆయన ప్రకటించారు. అలాగే రూ.లక్ష కోట్లతో స్టీల్ ఫ్యాక్టరీ విశాఖకు రానుందని ప్రకటించారు. ÷ూష్ట్రంలో నదుల అనుసంధానం చేస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రస్తుతం నదుల్లో నీరు పుష్కలంగా ఉందని.. ఈ నీటిని రెండు పంటలకి సాగునీరుగా అందిస్తున్నామన్నారు. మెప్మా, డ్వాక్రా ద్వారా లక్ష మందిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలని ప్రణాళిక రచిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. యితే కూటమి పార్టీలని ఆశీర్వదించాలని ఎన్నికలకి ముందు తాను కోరానని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో తానెప్పుడూ చూడని విధంగా నెల్లూరులో జరిగిన ఎన్నికల సభకి ప్రజలు భారీగా తరలివచ్చారన్నారు. అదే చిత్తశుద్ధి, అంకితభావంతో తానూ పని చేస్తున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త అనే నినాదంతో ముందుకు వెళు_న్నామన్నారు. ఒకప్పుడు ఇంటికి ఒక ఐటీ ఉద్యోగి ఉండాలని భావించామని.. కానీ ప్రస్తుతం ఏ దేశంలో చూసినా మన ఐటీ ఉద్యోగులే ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరులో ముందుగానే దీపావళి వచ్చిందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు చమత్కరించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ.. ఈ స్మార్ట్ స్ట్రీట్ బజార్‌కి రావడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. మంత్రి నారాయణ ఎంతో చొరవతో ఈ స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ని తీర్చిదిద్దారని తెలిపారు. మహిళలు దుకాణాలకి యజమానులు కావడం తమకు సంతోషం కలిగించిందని ఆయన పేర్కొన్నారు. ఈ స్మార్ట్ స్ట్రీట్ బజార్ లో వినియోగదారులకి ఏ వస్తువు కావాలన్నా లభ్యమయ్యే అవకాశాన్ని కల్పించారు. సోలార్ పవర్‌తో పని చేసే దీపాలు, సీసీ కెమెరాలు, రూఫ్ సిట్టింగ్‌తోపాటు వ్లై÷ను ఏర్పాటు చేశారు.

# హైదరాబాద్ అభివృద్ధి

**రూ.10 వేల కోట్లు.. ఆ ఏరియాల్లో కూడా మెట్రో..**



**హైదరాబాద్, అక్టోబరు 11, ( వెలుతురు)**

తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగం ఎదుగుదలకు అనుగుణంగా.. రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత నరెడ్కోపై ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైటెక్స్‌లో జరిగిన ప్రాపర్టీ షోను ఆయన ప్రారంభించారు. హైదరాబాద్ అభివృద్ధికి తమ ప్రభుత్వం ఏటా రూ. 10 వేల కోట్లు కేటాయిస్తోందని.. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ వంటి ప్రణాళికలతో నగర ముఖ చిత్రాన్ని మారుస్తున్నామని తెలిపారు. హైడ్రా చర్యల ద్వారా ప్రభుత్వ భూములు రక్షించబడుతున్నాయని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ ఎదుగుదలను దృష్టిలో ఉంచుకొని.. రాష్ట్ర వనరులు, పెట్టుబడి అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత నరెడ్కో పై ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర అభివృద్ధికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. గత రెండేళ్లలో దాదాపు రూ. 20 వేల కోట్లకు పైగా నిధులను హైదరాబాద్ అభివృద్ధికి వినియోగించినట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో నగరం అన్ని దిక్కులా అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికలు అమలు చేయనున్నట్లు వివరించారు.హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చేందుకు మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. రాష్ట్రంలోని అన్ని ముఖ్య ప్రాంతాలను కలుపుతూ నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్డు నగరంలో గ్రామీణ అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. మెట్రో వ్యవస్థ హైదరాబాద్ చుట్టూ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో నగరవాసులకు ట్రాఫిక్ నుంచి ఉపశమనం లభించనుంది. వీటితో పాటు.. మురుగు నీటి శుద్ధి కోసం రూ. 4 వేల కోట్లతో అత్యాధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలు నిర్మించబోతున్నారు.హైడ్రా వంటి సంస్థల ద్వారా ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కొంతమందిలో ఈ కఠిన చర్యలు భయం కలిగించినా, ప్రజా ఆస్తులు రక్షించబడుతున్నాయన్న మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాయదుర్గంలో ఇటీవల ఎకరా భూమి రూ. 177 కోట్ల ధర పలకడం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఎంత వేగంగా దూసుకుపోతుందో నిరూపిస్తుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.నరెడ్కో ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి.. కేవలం విల్లాలు, హై-రైజ్ భవనాల నిర్మాణం వరకే పరిమితం కాకుండా.. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో గృహాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలుగా రియల్టర్లను తమ ప్రభుత్వం గౌరవిస్తుందని పేర్కొంటూ.. వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.చివరగా.. రియల్ ఎస్టేట్ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులను విద్య, వైద్యం వంటి సామాజిక రంగాలపై అధికంగా ఖర్చు చేయాలని ఆయన ఆదేశించారు. విద్యారంగంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 100 ప్రభుత్వ పాఠశాలలు నిర్మించడంతో పాటు.. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని ఆయన ఈ సందర్భంగా వివరించారు.

# తెలంగాణలో మరో టెట్ నోటిఫికేషన్




**హైదరాబాద్, అక్టోబరు 11, ( వెలుతురు)**

తెలంగాణలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్ వచ్చే నెల లో విడుదల కానుంది. సుప్రీంకోర్టు తాజా తీర్పు కారణంగా.. ప్రస్తుతం ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులు (ఇన్-సర్వీస్ టీచర్లు) కూడా టెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి కానుంది. ప్రమోషన్స్‌కు కూడా టెట్ అర్హతను విధిగా చేయాలని విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. 45 వేల మందికి పైగా ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు ఈ టెట్ పరీక్ష రాయడానికి సమాయత్తం అవుతున్నారు.తెలంగాణ రాష్ట్రంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్ నవంబర్ నెలలో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన కీలకమైన తీర్పు నేపథ్యంలో ఈసారి టెట్ నిర్వహణకు సంబంధించిన జీవోలో ముఖ్యమైన మార్పులు చేయనున్నారు. ఈ పరీక్ష నిర్వహణకు విద్యా శాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు.గతంలో 2011 సంవత్సరం తర్వాత ఉద్యోగంలో చేరే వారికి మాత్రమే టెట్ అర్హత తప్పనిసరి అనే నిబంధన ఉండేది. కానీ.. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పుతో ఈ నియమం మారింది. ప్రస్తుతం ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులు (ఇన్-సర్వీస్ టీచర్స్) కూడా టెట్‌లో అర్హత సాధించడం తప్పనిసరి కానుంది. న్యాయస్థానం ఆదేశాల మేరకు.. ప్రస్తుతం ఉన్న టెట్ జీవోలో సవరణలు చేయాల్సి ఉంది. ఉద్యోగ ప్రమోషన్లకు కూడా టెట్ అర్హత విధిగా ఉండాలనే అంశాలను కొత్త జీవోలో పొందుపరచాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది.ఈ మార్పుల కారణంగా.. ప్రమోషన్స్ కోసం పోటీ పడే ఉపాధ్యాయులు సహా సుమారు 45 వేల మందికి పైగా ఇన్-సర్వీస్ టీచర్లు రాబోయే రెండేళ్లలో టెట్‌లో తప్పనిసరిగా క్వాలిఫై కావాల్సి ఉంటుంది. ప్రమోషన్లకు దరఖాస్తు చేసుకునే వారిని కలిపితే ఈ సంఖ్య 60 వేల వరకు చేరే అవకాశం ఉంది. వీరంతా రాబోయే పరీక్షకు సమాయత్తం అవుతున్నారు.గతంలో టీఆర్ఎస్ పాలనలో పదేళ్లలో కేవలం నాలుగు సార్లు మాత్రమే టెట్ జరిగింది. వాస్తవానికి.. నిబంధనల ప్రకారం ప్రతి సంవత్సరం రెండు సార్లు ఈ పరీక్షను నిర్వహించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత.. సీఎం రేవంత్ రెడ్డి ఏటా రెండు సార్లు విధిగా టెట్ నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.పాఠశాల విద్యాశాఖ ఈ సంవత్సరం ఇప్పటికే రెండు సార్లు టెట్ నిర్వహించగా.. తాజాగా వచ్చే నెలలో నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ పరీక్షను వచ్చే ఏడాది జనవరిలో నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై విద్యాశాఖ రివ్యూ పిటిషన్ వేయాలని నిర్ణయించినప్పటికీ.. టెట్ నోటిఫికేషన్ ప్రక్రియ మాత్రం ప్రణాళిక ప్రకారం వచ్చే నెల విడుదల చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# పత్తి, కంది మధ్య గంజాయి సాగు

**అదిలాబాద్, అక్టోబరు 11, ( వెలుతురు)**

ఆదిలాబాద్ జిల్లాలోని ఓ గ్రామంలో భారీగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పత్తి, కంది పంటల మధ్య అంతర పంటగా సాగు చేస్తున్న 160 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ. 16 లక్షలు. ఈ కేసులో నిందితుడు మిశ్రమ్ భుజంగరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి సాగు చేసేవారికి ప్రభుత్వ పథకాలు నిలిపివేయడానికి కలెక్టర్‌కు నివేదికలు పంపనున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో గంజాయి అక్రమ సాగుపై పోలీసు యంత్రాంగం తన దాడులను ముమ్మరం చేసింది. జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) అఖిల్ మహాజన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు.. ఆదిలాబాద్ రూరల్ పరిధిలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో భారీ మొత్తంలో గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి.ఆదిలాబాద్ గ్రామీణ మండలం, అశోద గ్రామంలో గంజాయిని పెంచుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు.. రూరల్ ఎస్సై వి విష్ణువర్ధన్ నేతృత్వంలో పోలీసు బృందం పంట పొలాలపై ఆకస్మిక దాడులు నిర్వహించింది. నిందితుడు తన పత్తి, కంది పంటల మధ్యలో అంతర పంటగా చట్టవిరుద్ధంగా గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు పోలీసులు గుర్తించారు.వివిధ ఎత్తుల్లో (మూడు నుంచి ఏడు అడుగుల వరకు) ఉన్న మొత్తం 160 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి వెల్లడించిన ప్రకారం.. వీటి బహిరంగ



మార్కెట్ విలువ సుమారు రూ. 16 లక్షలు వరకు ఉంటుంది. ఈ కేసులో మిశ్రమ్ భుజంగరావు (20) అనే అశోధా గ్రామం నివాసిని నిందితుడిగా గుర్తించిన పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.గంజాయి వంటి మాదకద్రవ్యాల సాగు, రవాణా, వ్యాపారం అనేది జిల్లాలో ఉక్కు పాదంతో అణచివేస్తున్నామని డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. గంజాయి పండించినా.. రవాణా చేసినా, లేదా సేవించినా చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కేసులో విభిన్న చట్టాల ప్రకారం ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఇంతేకాకుండా.. గంజాయి సాగు చేస్తున్న వారికి ప్రభుత్వ పథకాలు వర్తించకుండా నిరోధించేందుకు జిల్లా కలెక్టర్ కు నివేదికలు పంపనున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ భారీ గంజాయి మొక్కల పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ సీఐ కె ఫణిధర్, ఎస్సై విష్ణువర్ధన్.. ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. గంజాయి అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే.. వెంటనే పోలీసులకు తెలియజేయాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహితంగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం పోలీసు యంత్రాంగం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోంది. అక్రమ గంజాయి సాగు, రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి, కఠినమైన చర్యలు అమలు చేస్తోంది. డ్రగ్స్ కట్టడికి ప్రత్యేక వ్యవస్థ 'ఈగల్'.. తెలంగాణలో గంజాయి, డ్రగ్స్ సమస్యను మూలాల నుంచి పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్ఫోర్స్మెంట్ అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో గంజాయి మొక్కల సాగును పూర్తిగా అరికట్టడం.. సరిహద్దుల గుండా జరిగే మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడం ఈగల్ ముఖ్య ఉద్దేశం.

# దగ్గుమందుపై తమిళనాడు సర్కార్ నిర్లక్ష్యం

- **తగు చర్యలు తీసుకోక పోవడంతోనే సిరప్ మరణాలు**
- **కేంద్ర ప్రభుత్వవర్గాల గుర్తింపు**

**న్యూఢిల్లీ,అక్టోబర్11( వెలుతురు):**

రాష్ట్ర ఔషధ నియంత్రణ సంస్థ నిబంధనలను విస్మరించిందని, కేంద్రం చేసిన సిఫార్సులకు అనుగుణంగా చర్యలు తీసుకోవడంలో విఫలమైందని గుర్తించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దగ్గుమందు తయారీ విషయంలో సరైన పర్యవేక్షణ లేదని, సకాలంలో చర్యలు తీసుకోక పోవడంతో విషపూరితమైన సిరప్ మార్కెట్లోకి ప్రవేశించిందని పేర్కొన్నాయి. దగ్గుమందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ కంపెనీని ఇప్పటివరకు వారు ఒక్కసారి కూడా తనిఖీ చేయలేదన్నాయి. దర్యాప్తులో భాగంగా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ పలు వైఫల్యాలను గుర్తించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 'కోల్డ్‌రిఫ్' దగ్గు







మందు వల్ల మధ్యప్రదేశ్‌లో 20 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారుచేసింది. మరణాల నేపథ్యంలో ఈ కంపెనీలో తనిఖీ చేయగా.. సిరప్‌లో 48.6 శాతం డైఇథైలిన్ ÷-లగైకాల్ ఉందని తేలింది. ఇది అత్యంత విషపూరితమైనదిగా అధికారులు పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ తన దర్యాప్తులో పలు లోపాలను గుర్తించినట్లు సమాచారం. ఆ నిర్లక్ష్యం పిల్లల మరణాలకు దారితీసిందని తెలిపాయి. ఆ ఫార్మా సంస్థలో ఏ ప్రభుత్వ ఏజెన్సీ ఆడిట్ నిర్వహించ లేదని తెలుస్తోంది. అలాగే ఔషధ తయారీ సంస్థగా ఈ కంపెనీ కేంద్ర పోర్టల్‌లో రిజిస్టర్ కాలేదని గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చే గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రాక్టీస్ సర్టిఫికేట్ లేకుండానే దశాబ్దాల పాటు ఫార్మా సంస్థ నడిచేందుకు తమిళనాడు ప్రభుత్వం అనుమతివ్వడాన్ని దర్యాప్తు సంస్థ ప్రశ్నించింది. విచారణలో భాగంగా కేంద్ర బృందానికి రాష్ట్ర అధికారులు సహకరించడం లేదని, ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించింది. కాగా, డ్రగ్స్ తయారీ యూనిట్లను తనిఖీ చేయడంలో కేంద్రం విఫలమైందని ఇప్పటికే తమిళనాడు విమర్శించింది. ఈ అంశంపై తమిళనాడు ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణియన్ మాట్లాడుతూ.. మరింత హాని జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుందని చెప్పారు. ఇక, కంపెనీ యజమానిని రెండు రోజుల క్రితం అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

## ఆ ..ఆటో డ్రైవర్ కోటీశ్వరుడు

**సోషల్ మీడియా పోస్ట్‌తో షాక్**

**బెంగుళూరు,అక్టోబర్11( వెలుతురు):**

సాధారణ ఆటో డ్రైవర్ కోట్లకు పడగలెత్తిన విషయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఒక ఆటో డ్రైవర్ మహా అయితే రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తుంటాడు. ఇక కొన్నిసార్లు ప్యాసింజర్లు లేకపోతే ఆటోవాలా పరిస్థితి అంతంతే. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో రోజంతా కష్టపడుతూ కుటుంబాన్ని అతికష్టం మీద పోషిస్తుంటారు. ట్రాఫిక్‌లో నానా అవస్థలు పడుతూ, ప్యాసింజర్ల కోసం ఆరాటపడడడంలోనే రోజంతా గడిచిపోతుంది. ఇంటి ఖర్చులు, అప్పులు పోనూ చేతికి మిగిలేది అంతంతే. ఇక తెలుగు రాష్ట్రాల్లో అయితే చెప్పనక్కర్లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలైనప్పటి నుంచి ఆటో నడుపుకునే



వారి పరిస్థితి మరింత దిగజారింది. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి ఎన్నో సార్లు మొరపెట్టుకున్నారు. ఇదిలా ఉంటే.. ఆటోలో ప్రయాణిస్తున్న ఓ ప్యాసింజర్‌కు వినూత్న అనుభవం ఎదురైంది. కార్పొరేట్ మేనేజర్ కంటే ఎక్కువగా ఆటో డ్రైవర్ డబ్బులు సంపాదిస్తున్నాడని తెలిసి ఒక్కసారిగా అవాక్కయ్యాడు. కర్ణాటక రాజధాని బెంగుళూరుకు చెందిన ఆకాష్ ఆనందానీ అనే వ్యక్తి ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. పోస్ట్ చూసి షాక్ తింటున్న యూజర్లు షేర్ చేయడంతో అది కాస్త వైరల్‌గా మారింది. ఆఫీస్ పనికోసం వెళ్తున్న ఆకాష్ ఆనందానీ, ఆటోలో బయల్దేరాడు. ఆటోవాలా పక్కన కూర్చొని ఆటో నడుపుతుండగా అతని చేతికున్న యాపిల్ వాచ్, ఎయిర్ పోడ్స్ చూసి ఒక్కసారిగా షాక్ అయ్యాడు. ఆటో డ్రైవర్‌కి యాపిల్ వాచ్ ఏంటని.. పూర్తి విషయాలు తెలుసుకుందామని అతనిని అడిగాడు. ఆటోడ్రైవర్ సమాధానాలు విని ఆ ప్యాసింజర్ ఒక్కసారిగా అవాక్కయ్యాడు. తనకు రూ.4-5 కోట్ల విలువచేసే రెండు ఇళ్లు ఉన్నాయని, వాటిని అద్దెకు ఇస్తే నెలకు రూ.2-3 లక్షల ఆదాయం వస్తుందని ఆటోవాలా చెప్పుకొచ్చాడు. అంతేకాదు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్ కంపెనీలో భారీ పెట్టుబడి సైతం పెట్టినట్లు చెప్పాడు. వారం మొత్తం తాను ఆటో నడపనని.. కేవలం వారాంతంలో మాత్రమే తాను ఆటో నడుపుతానని చెప్పుకొచ్చారు. ఆటో డ్రైవర్ చెప్పిన విషయాలకు నివ్వెరపోయిన ఆ ప్యాసింజర్.. ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అది కాస్త వైరల్ అయింది.

## రాహుల్ కూడా కొరినీ లాగా పోరాడుతున్నారు

**- కాంగ్రెస్ నేత సురేంద్ర రాజ్‌పుత్ పోస్ట్ వైరల్**

**న్యూఢిల్లీ,అక్టోబర్11( వెలుతురు):**

ప్రస్తుతం ఎవరి నోట విన్నా నోబెల్ శాంతి బహుమతి గురించే చర్చ నడుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఈ నోబెల్ శాంతి పురస్కారం ఈ ఏడాది వెనెజువెలా ప్రధాన ప్రతిపక్ష నాయకురాలు, ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్న మరియా కొరీనా మచాడోను వరించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశలపై నీళ్లు చల్లుతూ 2025 నోబెల్ శాంతి బహుమతి కొరీనా మచాడోకు నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. దీంతో ఈ వ్యవహారం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేత పెట్టిన ఓ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. మరియా కొరీనా తమ దేశంలో రాజ్యాంగ హక్కుల కోసం పోరాడినందుకు ఆమెకు నోబెల్ బహుమతి ఇచ్చారని ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత సురేంద్ర రాజ్‌పుత్ తెలిపారు. అమెలానే ఇప్పుడు మన దేశంలో రాజ్యాంగ పరిరక్షణ కోసం, ప్రజల హక్కుల కోసం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పోరాడుతున్నారని పేర్కొన్నారు. 'రాజ్యాంగ హక్కుల కోసం పోరాడినందుకు వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలికి ఈ ఏడాది నోబెల్ శాంతి లభించింది. భారత్‌లో రాజ్యాంగాన్ని కాపాడే పోరాటానికి ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తున్నారు' అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు. ఆయనకు కూడా శాంతి




పురస్కారం ఇవ్వాలని పరోక్షంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు కొరీనా మచాడో, రాహుల్ ఉన్న ఫొటోలను ట్వీట్‌కు జత చేశారు. ప్రస్తుతం ఈ పోస్టు వైరల్ అవుతోంది.

## సిఎం రేవంత్ రెడ్డి నల్లమల పిల్లి

- **కృష్ణా, గోదావరి నీళ్లు దోస్తున్నా ఉలుకేదీ**
- **బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు వెటకారం**

**హైదరాబాద్,అక్టోబర్11( వెలుతురు):**


తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి కాదు.. నల్లమల పిల్లి అని మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు. కింది నుంచి గోదావరి నీళ్లు ఏపీ తీసుకుపోతే.. పైన కృష్ణా నీళ్లు కర్ణాటక తీసుకుపోతే, మన బ్రతుకు ఏం కావాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి మొన్న మల్లికార్జున ఖర్గేను పరామర్శించడానికి కర్ణాటకకు వెళ్లినప్పుడు, ఆలమట్టి డ్యాం ఎత్తు పెంపు గురించి సిద్ధరామయ్య, శివకుమార్ దగ్గర మాట్లాడుతాడను కున్నా. వాళ్ళ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం




అయినా రేవంత్ రెడ్డి మాట్లాడలేదు. ఆలమట్టి డ్యాం ఎత్తు పెంచితే తెలంగాణ ఎడారిగా మారుద్దని కనీసం బుద్ధి రేవంత్ రెడ్డికి లేదు. రాహుల్ గాంధీతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక ఫోన్ కూడా చేపించలేకపోతున్నాడు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి ఢిల్లీకి బ్యాగులు మోయడం ఒక్కటే పని కాదు.. తెలంగాణ బాగోగుల గురించి కూడా పట్టించుకో అని హరీష్ రావు సూచించారు. ఏపీ 463 టీఎంసీల నీళ్లు మళ్లిస్తే నేను మీద 112 టీఎంసీలు ఆపుకుంటా అని కర్ణాటక అంటుంది.. నేను 74 టీఎంసీలు ఆపుకుంటా అని మహారాష్ట్ర అంటుంది. 112 టీఎంసీలు కర్ణాటక, 74 టీఎంసీలు మహారాష్ట్ర ఆపితే మన పరిస్థితి ఏంది. మాట్లాడితే నల్లమల బిడ్డ అంటాడు.. ఆ నల్లమలను అనుకొని పారే కృష్ణా నదిలో ఆ మహబూబ్ నగర్ జిల్లాకు నష్టం జరిగితే ఎందుకు మాట్లాడటం లేదు. నువ్వు నల్లమల పులివా, పిల్లివా, ఎలుకవా.. ఎందుకు మాట్లాడటం లేదు. పులి అయితే మాట్లాడేవాడివి.. పిల్లివి, ఎలుకవు కాబట్టి మాట్లాడటం లేదు అని హరీశ్‌రావు ఘాటుగా విమర్శించారు.

# స్కూళ్లలో ఏఐ కోర్సు

**న్యూఢిల్లీ, అక్టోబరు 11, ( వెలుతురు)**




ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సర్వాంతర్యామిగా పరిణమిస్తున్న క్రమంలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే అన్ని రంగాల్లో ఏఐ రంగ ప్రవేశం చేసింది. ఇప్పుడు విద్యారంగంలోనూ పెను మార్పులకు తెరదించింది. ఈ క్రమంలో 2026-27 విద్యా సంవత్సరం నుంచి మూడో తరగతి నుంచే అన్ని పాఠశాలల కరిక్యులమ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ని ప్రవేశపెట్టాలని కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఇక అన్ని తరగతుల విద్యార్థుల కోసం ఏఐ ఇంటిగ్రేషన్ ఫ్రేమ్ వర్క్‌ను కేంద్రం అభివృద్ధి చేయనుంది.వచ్చే రెండు మూడేళ్లలో విద్యార్థులు, టీచర్లు సమన్వయం చేసుకునేలా వేగంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా సుమారు కోటి మందికిపైగా టీచర్లకు ఏఐ టెక్నాలజీ విద్యపై దిశానిర్దేశం చేయడం సవాలుగా మారింది. అన్ని తరగతుల్లో AI ఏకీకరణకు సీబీఎస్ఈ ఫ్రేమ్ వర్క్‌ను అభివృద్ధి చేస్తోంది. పాఠ్య ప్రణాళికలను సిద్ధం చేయడానికి ఉపాధ్యాయులు AI టూల్స్ ఉపయోగించేందుకు ఒక పైలట్ ప్రాజెక్ట్ ఇప్పటికే చేపట్టాం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను సిద్ధం చేయడమే మా లక్ష్యమని కేంద్ర స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.ఇప్పటికే 18, 000 కి పైగా CBSE పాఠశాలలు 6వ తరగతి నుంచే 15 గంటల మాడ్యూల్‌లో AI ని స్కిల్ సబ్జెక్టుగా అందిస్తున్నాయి. ఇక 9 నుంచి 12 తరగతులు దీనిని ఐచ్ఛిక సబ్జెక్టుగా అందిస్తున్నాయి. ఏఐతో ఉద్యోగాల తొలగింపుపై NITI ఆయోగ్ నివేదికను విడుదల చేస్తూ కుమార్ ఈ విషయాలను వెల్లడించారు. ఇది సుమారు 20 లక్షల సాంప్రదాయ ఉద్యోగాలను తొలగించవచ్చని, కానీ సరైన పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తే ఎనిమిది మిలియన్ల కొత్త ఉద్యోగాలు సృష్టించవచ్చని ఆయన పేర్కొన్నారు. AI ఆర్థిక వ్యవస్థలో భారత్ భవిష్యత్తు నిర్ణయాత్మక చర్యపై ఆధారపడి ఉంది. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థలలో సమన్వయ నాయకత్వంతో భారత్ తన శ్రామిక శక్తిని కాపాడుకోవడమే కాకుండా ప్రపంచ AIని రూపొందించడంలో కూడా ముందుండగలదని ఈ నివేదిక పేర్కొంది.

# కమలం కామ్...

**హైదరాబాద్, అక్టోబరు 11, ( వెలుతురు)**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక షెడ్యూల్ వచ్చింది. ఈ నెల 13న నోటిఫికేషన్




వెలువడుతుంది. కానీ.. బీజేపీ ఇంకా తన అభ్యర్థిని ప్రకటించలేదు. అసలా విషయంలో ఒక క్లారిటీ ఉందో లేదో కూడా బయటికి తెలియడం లేదు. అభ్యర్థి ఎంపిక కోసం ముగ్గురు నాయకులతో కమిటీ వేసి అభిప్రాయ సేకరణ కూడా చేసింది పార్టీ రాష్ట్ర నాయకత్వం. ఈ క్రమంలో.. త్వరలోనే ముగ్గురు పేర్లతో రాష్ట్ర ఎన్నికల కమిటీ కేంద్ర పార్టీకి లిస్ట్ పంపబోతోందట. మరోవైపు ఈసారిపార్టీ టిక్కెట్ ఆశిస్తున్న వాళ్ళ లిస్ట్ చాంతాడంత ఉంది. ఇక్కడ విశేషం ఏంటంటే.. జూబ్లీహిల్స్ కమలం టిక్కెట్ ఆశిస్తున్న వారిలో పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఉన్నారు. వాళ్ళలో కొందరైతే గట్టిగానే ప్రయత్నాలు చేసుకుంటున్నట్టు సమాచారం. ప్రస్తుతం రేస్‌లో అరడజన్‌కు పైగా మహిళా నేతల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. గత ఎన్నికల్లో టికెట్ ఆశించిన జూటూరు కీర్తి రెడ్డి ఈసారి నాకో ఛాన్స్ అంటున్నారట. అందుకు తగ్గట్టే.. ఆమె నియోజకవర్గంలో ఎప్పటి నుంచో తిరుగుతున్నారు కూడా. బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ వీరపనేని పద్మ కూడా సీటు ట్రయల్స్‌లో ఉన్నారు. తనకు సామాజికవర్గం కలిసి వస్తుందని నమ్మకంగా ఉన్నారట ఆమె.ఇక మరో మహిళా నేత ఆకుల విజయ కూడా టికెట్ కోసం గట్టి ప్రయత్నాలే చేసుకుంటున్నట్టు సమాచారం. పార్టీకి చెందిన కొందరు పెద్ద నేతలతో కూడా రికమండ్ చేయించుకుంటున్నారట ఆమె. ఆ నేతలు అభిప్రాయ సేకరణ కమిటీ ముందు తమ మనసులో మాట చెప్పేసినట్టు తెలుస్తోంది. ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి పోటీచేసి ఓడిపోయిన మాధవీలత కూడా టికెట్ రేస్‌లోకి వచ్చేశారట. ఆమె తనకున్న పరిచయాలతో ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తున్నట్టు చెప్పుకుంటున్నాయి పార్టీ శ్రేణులు. రీసెంట్‌గా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును కలిశారు జయసుధ. దీంతో ఆమె పేరు కూడా జూబ్లీ హిల్స్ అభ్యర్థిగా తెరపైకి వచ్చింది.ఇక బండారు దత్తాత్రేయ కూతురు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బండారు విజయ లక్ష్మి పేరు కూడా వినిపిస్తోంది. విజయలక్ష్మి పేరు గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ వినిపించింది.. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏదో ఒక సీట్ నుండి ఆమె పోటీ చేయవచ్చన్న ప్రచారం జరిగినా.. సాధ్యపడలేదు. ఇక గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ , బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తీక రెడ్డి కూడా పార్టీ అడిగితే.. పోటీకి సిద్ధమని అంటున్నారట. ఈ రకంగా జూబ్లీహిల్స్ కోసం తెంలగాణ బీజేపీలో మహిళా నేతలు మేమంటే మేమంటూ పోటీలు పడుతున్నారు. ఎవరికంటే ఏం తక్కువ కాదంటూ.. సీరియస్ ట్రల్స్‌లో ఉన్నారట. దీంతో పార్టీ అధిష్టానం ఎవరివైపు మొగ్గుకతుందన్న ఉత్కంఠ పెరుగుతోంది.

# దుకాణాలలో తూనికలు, కొలతల అధికారుల తనిఖీలు

**ఒంగోలు అక్టోబరు 11, ( వెలుతురు)**

ప్రకాశం జిల్లా గిద్దలూరు, రాచర్ల మండలంలో శుక్రవారం రాత్రి కూల్ డ్రింక్ షాపులు పలు దుకాణాలపై తూనికలు కొలతల అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలు విక్రయిస్తున్న 5 దుకాణ యజమానులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు లీగల్ ఇన్స్పెక్టర్ మోసిన్ తెలిపారు. మరో నలుగురు దుకాణదారులపై కేసులు నమోదు చేశామని వారిని కార్యాలయానికి రావాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎమ్మార్పీ ధరల కన్నా అధికంగా విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతల అధికారులు హెచ్చరించారు.

# నోబెల్ అడిగితే ఇస్తారా...

**న్యూఢిల్లీ, అక్టోబరు 11, ( వెలుతురు)**



నోబెల్ శాంతి బహుమతికి తన కంటే అర్హుడు లేడని పదే పదే నోబెల్ కమిటీకి సంకేతాలు పంపి.. పాకిస్తాన్ లాంటి దేశాలతో నామినేట్ చేయించుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు షాక్ తగిలింది. ఆయనకు శాంతి బహుమతి దక్కలేదు. ఎనిమిది యుద్ధాలు ఆపానని చెప్పడమే కాదు చాలా దేశాల నుంచి తన పేరు నామినేట్ చేయించుకున్నారు. చివరికి ఒక రోజు ముందుగా ఇజ్రాయెల్, గాజా శాంతి ఒప్పందం చేయించారు. కానీ ఆయన పేరునుపట్టించుకోలేదు. నోబెల్ శాంతి బహుమతి కావాలి అని చిన్నపిల్లాడు మారం చేసినట్లుగా మారం చేశారు ట్రంప్. ఎక్కడ యుద్ధం జరిగినా తానే ఆపానని ప్రకటించుకుంటూ వచ్చారు. ఆయన జనవరిలో అధ్యక్ష బాధ్యతలు చేపడితే.. ఆరు నెలలు తిరిగే సరికి ఎనిమిది యుద్ధాలు వచ్చాయి. ఎనిమిందింటిని ఆపేశారు. ఇది ఆయన చెప్పుకున్నదే. కానీ ఎవరూ తమ మధ్య యుద్ధంలో ట్రంప్ జోక్యం చేసుకున్నారని .. ఆపేశారని చెప్పలేదు. చివరికి పాక్ కూడా చెప్పలేదు. కానీ పాక్ ఆయనను నోబెల్ కు సిఫారసు చేసింది. ఆ దేశానికి అది తప్పదు. కానీ ట్రంప్ నకు అర్థం అయినా అర్థం కానిట్లుగా వ్యవహరించారు ఎందుకంటే ఎమోషనల్ బ్లాక్ మెయిలింగ్ కు అయినా నోబెల్ కమిటీ లొంగుతుందనే. శాంతి బహుమతి అంటే దానికో విశేషమైన అర్థం ఉంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయినప్పటి నుండి అశాంతి సృష్టిస్తూనే ఉన్నారు. అత్యంత స్వార్థపూరితమైన విధానాలతో ప్రపంచంలోని అనేక దేశాలను ఇబ్బంది పెడుతున్నారు. సొంత ప్రజల జీవన ప్రమాణాల్ని తగ్గించేశారు. ఆయన దెబ్బకు అమెరికా ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇతర దేశాలతో ఆయన దురుసుగా ప్రవర్తిస్తున్నారు. కెనడాని కలుపుకుంటానని.. పనామా కాలువను లాగేసుకుంటానని చెబుతూంటారు. హమాస్ ను బెదిరించి సంతకం చేయించారు కానీ.. అలా చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని ఆయన గుర్తించడం లేదు. మొత్తంగా ట్రంప్ వల్ల శాంతి ఏమీ లేకపోగా.. ఎక్కువగా అశాంతి ఏర్పడుతోందని ఎక్కువ మంది నమ్ముతున్నారు. ట్రంప్ ఇప్పుడు ఏం చేస్తారనేది అందరిలో వస్తున్న ఆలోచన. ఎందుకంటే ఆయన ప్రతీకార మనస్థత్వంలో ఉండే అధ్యక్షుడు. నార్వేపై సుంకాలు విధిస్తారా అన్న చర్చలు వస్తున్నాయి. అలాగే ఎదురుదాడి చేస్తారని .. నోబెల్ విలువను తగ్గించేలా మాట్లాడతారని అందరికీ తెలుసు . అయితే ట్రంప్ నకు ఇప్పుడు రాకపోతే ఇంకెప్పుడు నోబెల్ శాంతి బహుమతి రాదని కాదు. ఆయన పాలనలో నిజంగా శాంతి ఏర్పడిందని భావిస్తే.. వచ్చే ఏడాది లేకపోతే .. ఆ తర్వాత అయినా నోబెల్ కమిటీ గుర్తిస్తుంది. అలా కాకుండా అశాంతితో రగిలిపోతే ఎప్పటికీ చాన్స్ ఉండకపోవచ్చు.

# హాట్ స్పాట్ గా ఉపఎన్నిక




**హైదరాబాద్, అక్టోబరు 11, ( వెలుతురు)**

తెలంగాణ రాజధాని విశ్వనగరం హైదరాబాద్‌లోని కీలకమైన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక రాజకీయంగా హాట్‌స్పాట్‌గా మారింది. సిట్టింగ్ సీటు నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. తన ఖాతాలో వేసుకోవాలని అధికార కాంగ్రెస్ తహతహలాడుతోంది. రాజాసింగ్ పార్టీని వీడిన నేపథ్యంలో జూబ్లీ హిల్స్‌లో కాషాయ జెండ ఎగరేసి తెలంగాణలో బీజేపీ బలంగా ఉందని నిరూపించాలని కమలనాథులు ఉబలాటపడుతున్నారు. గెలుపు కోసం సర్వం సిద్ధం చేసుకున్నారు. వ్యూహ ప్రతివ్యూహాలు పన్నుతున్నారు. రాబోయే నవంబర్ 11 పోలింగ్‌తో ఈ పోరు ఒకే నియోజకవర్గం వరకే కాక, నగర రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపనుంది.మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఖాళీ అయిన స్థానాన్ని దక్కించుకోవటానికి బీఆర్ఎస్ ఆయన భార్య సునీతను బరిలోకి దింపింది. కుటుంబ వారసత్వం, సానుభూతి ఓట్లు బలంగా ఉన్నప్పటికీ అనుభవలేమి, ప్రతిపక్ష రాజకీయాల్లో ఆడ్వాంటేజ్ సృష్టించుకోవడం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి. పార్టీ అగ్రనేతల మద్దతుతో ఈ సీటు నిలబెట్టుకోవడం బీఆర్ఎస్‌కు ప్రాణాధారమవుతుంది.ఇక అధికార కాంగ్రెస్ అధికార బలంతోపాటు బీసీ కమ్యూనిటీకి చెందిన స్థానిక నేత నవీన్ యాదవ్‌ను అభ్యర్థిగా ఎంపికచేసింది. స్థానిక అనుబంధాలను సద్వినియోగం చేసుకునే వ్యూహం ఎంచుకుంది. ఆయన తండ్రి శ్రీశైలం యాదవ్‌కు ఉన్న పాత రాజకీయ బలం కూడా అదనపు మద్దతు ఇవ్వవచ్చు. అయితే పాత కాంగ్రెస్ వర్గాలు, పీజేఆర్ అభిమానులు ఇప్పుడు ఎటు మళ్లుతారన్నది కీలకం.

అభ్యర్థి వేటలో బీజేపీ.. ఇక 2023 ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసిన దీపక్‌రెడ్డికి మరో ఛాన్స్ ఇవ్వాలా లేక కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాలా అనే విషయంలో బీజేపీ ఉంది. ఈ ప్రాంతంలో ఆంధ్రా సెటిలర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం, ఏపీ టీడీపీతో వివాదరహిత సంబంధాలు ఉండటం బీజేపీకి బలాన్నిస్తుందని భావిస్తున్నారు. అయితే సుమారు 1.4 లక్షల మైనారిటీ ఓటర్ల ప్రాధాన్యం, వారి ఓటు విభజన లేదా సమీకరణ బీజేపీ గెలుపు సమీకరణాన్ని ప్రభావితం చేసే అంశం.

ఫలితంపై ప్రభావం చూపే కీలక అంశాలు

- మైనారిటీ ఓటు ఎటు ఒక్కటవుతుందో
- సానుభూతి తరహా ఓటు ఎంతవరకు బీఆర్ఎస్‌కు ఉపయోగపడుతుందో
- స్థానిక బీసీ అభ్యర్థి ప్రభావం కాంగ్రెస్‌కు ఎంత బలాన్నిస్తుందో
- బీజేపీ టికెట్ ఎంపిక, ఆంధ్రా సెటిలర్ మరియు హిందూ ఓటు బేస్ సమీకరణ

గత ఎన్నికల ఫలితాలు ఇలా..

2023 ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్ (బీఆర్ఎస్) 80,549 ఓట్లు గెలిచి, కాంగ్రెస్ అభ్యర్థి మోహమ్మద్ అజరుద్దీన్ 64,212 ఓట్లు పొందారు. బీజేపీ దీపక్ రెడ్డి 25,866 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో సుమారు 3.85 లక్షల మంది ఓటర్లు ఉండగా, మైనారిటీల సంఖ్య 1.20 లక్షలకి పైగా ఉంది. ఈ మైనారిటీ ఓటర్లు ఏ పార్టీకి వస్తే ఫలితం ఆ ఆర్టీకే అనుకూలంగా ఉంటుంది. - బీఆర్ఎస్ సునీత ఆధారంగా సానుభూతి ఓట్లు ఆశించగా, అనుభవ లేమితో కూడిన సవాళ్లు ఎదుర్కొంటోంది కాంగ్రెస్ నవీన్ యాదవ్ స్థానిక ఉద్యమానికి బలం ఇచ్చే ప్రయత్నంలో ఉంది. బీజేపీ అభ్యర్థి ఎంపిక వేగంగా చేయకపోవడం, మైనారిటీ ఓట్ల విభజన సమస్యలు తదితర అంశాలు దృష్టిలో ఉన్నాయి.

# కాంగ్రెస్ లో మొదలైన కలకలం

**హైదరాబాద్, అక్టోబరు 11, ( వెలుతురు)**




కయ్యాలకు కేరాఫ్‌గా నిలిచే కాంగ్రెస్‌లో అసలు కథ ఇప్పుడే మొదలైంది. జూబ్లీహిల్స్ ఉప సమరం వేళ అభ్యర్థిని ప్రకటించేదాకా ఒక ఎత్తు.. అభ్యర్థిని ప్రకటించాక మరో ఎత్తన్నట్టు.. ఉడుకు పుట్టించే సిసలైన ఎలక్షన్ ఎపిసోడ్ ఇప్పుడే షురూ అయింది. అధికార పార్టీగా ప్రత్యర్థుల కన్నా ముందుండాల్సిన పార్టీని ఈ కలహాలు వెనక్కి లాగుతాయా? అంతా సెట్‌రైట్ చేసేందుకు హైకమాండ్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించి.. ముందుకు నడిపిస్తాయా? ఇప్పుడే హాట్ టాపిక్‌గా మారింది.స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడటంతో.. ఇప్పుడు అందరి దృష్టి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికవైపు మళ్లింది. బస్తీమే సవాల్ అన్నట్టుగా.. ప్రధాన పార్టీలన్నీ పోటాపోటీగా ఉపసమరానికి సన్నద్ధమవుతున్నాయి. అయితే ఇక్కడ మాగంటి సునీత పేరు ప్రకటించి, అభ్యర్థి విషయంలో బీఆర్ఎస్ ఒకడుగు ముందుండగా.. కాస్త లేటైనా మల్లగుల్లాలు పడి నవీన్ యాదవ్‌ను క్యాండిడేట్‌గా కన్ఫామ్ చేసింది కాంగ్రెస్ పార్టీ. ఇక, బీజేపీ సైతం అదే పనిలో బిజీగా ఉంది. ఏ క్షణమైనా.. తమ అభ్యర్థిని కన్ఫామ్ చేసేందుకు చర్చోపచర్చలు జరుపుతోంది. కాంగ్రెస్‌లో అప్పుడే కల్లోలం మొదలైపోయింది. అంతా సవ్యంగా ఉంటే అది కాంగ్రెస్ పార్టీ ఎందుకవుతుంది? అందుకే అసలు సిసలు జగడం ఇప్పుడే ముదిరినట్టు కనిపిస్తోంది. టిక్కెట్ విషయంలో ఆశలు పెట్టుకున్న నాయకుల సంఖ్య.. అంతకంతకూ పెరిగిపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది. ఎవరికివారు తమస్థాయిలో విశ్వప్రయత్నాలు చేసినా.. చివరికి అవకాశం మాత్రం లోకల్ లీడర్ నవీన్ యాదవ్‌కు దక్కింది. దీంతో, ఒక్కసారిగా అసంతృప్తి భగ్గుమంది. అలకలు మొదలైపోయాయిఈ సీటు విషయంలో మొదట్నుంచీ పట్టుబడుతున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్.. తనకు అవకాశం ఇవ్వాల్సిందేనని పార్టీ పెద్దలకు తేల్చి చెప్పారు. అయితే, ఇప్పుడు తనను కాదని, ఏడాది కింద పార్టీలో చేరిన నవీన్‌యాదవ్‌కు టిక్కెట్ కన్ఫామ్ చేయడం అంజన్‌కు ఆగ్రహం తెప్పించింది. దీంతో, రంగంలోకి దిగిన పార్టీ పెద్దలు ఆయనను బుజ్జగించేపనిలో నిమగ్నమయ్యారు. మంత్రులు పొన్నం, వివేక్‌లతో పాటు.. ఇంచార్జ్ నటరాజన్ కూడా అంజన్ నివాసానికి వెళ్లి బతిమాలాల్సి వచ్చింది. తనను అవమానించారంటూ.. అంతెత్తున కోపంతో అంజన్ ఎగిరిపడ్డప్పటికీ, పార్టీ లైన్ దాటిపోనంటూ చెప్పడం కొసమెరుపు.జూబ్లీహిల్స్‌లో గల్లీ గల్లీకో లీడర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అభ్యర్థిగా ఊహించుకున్నారంటే అతిశయోక్తి కాదు. రెహ్మత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, మరో బీసీ నేత మురళీగౌడ్, మరో మాజీ కార్పొరేటర్ ఇలా ఒక్కరేంటి, కండువా వేసుకున్నోడల్లా అభ్యర్థిగా ఫీలైపోయారు. ఆ స్థాయిలో బ్యానర్లు కట్టేసుకుని హడావుడి చేశారు. ఇప్పటికే ఇక్కడ గెలుపు బాధ్యతలను, ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్న మంత్రులు పొన్నం, వివేక్‌లకు అలాంటి నాయకులను సముదాయించడమే పనిగా మారిపోయింది. వరసబెట్టి అందరి ఇళ్లకూ వెళ్తున్న మంత్రులు.. బాబూ గొడవలొద్దు.. అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉందామంటూ అడుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఎలాగూ స్థానిక ఎన్నికలు కూడా లేవు కాబట్టి.. ఇక మొత్తంగా జూబ్లీహిల్స్ బైపోల్ మీదే ఫోకస్ పెట్టి విజయం సాధించాలనుకుంటున్న అధికార కాంగ్రెస్‌కు.. ఈ నేతల అసంతృప్తి తలనొప్పిగా మారేలా ఉంది. బుజ్జగింపులతో నేతలు అలకవీడినా అభ్యర్థి నవీన్ యాదవ్‌కు పూర్తిస్థాయిలో సహకరిస్తారా? అన్నదే అనుమానాలకు తావిస్తోంది. బీసీ కార్డును తెరమీదకు తీసుకొచ్చిన కాంగ్రెస్.. అందుకు తగ్గట్టే యాదవ వర్గానికి చెందిన అభ్యర్థిని నిలబెట్టింది. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ తరఫున పోటీ చేసి 41,656 ఓట్లు సాధించి రెండో స్థానంతో నిలిచిన నవీన్ యాదవ్.. 2018లో కేవలం 18,817 ఓట్లతో సరిపెట్టుకున్నారు. అయితే, 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరినా అప్పుడు టిక్కెట్ దక్కలేదు. ఇప్పుడు మాగంటి మరణంతో వచ్చిన ఉప ఎన్నికల్లో.. అనూహ్యంగా దక్కిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావిస్తున్నారు. మరి, హేమాహేమీలను కాదని.. సీటు దక్కించుకున్న నవీన్ యాదవ్ అంత వీజీగా విజయం సాధిస్తారా? అన్నదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.బీసీ కార్డు పరంగా చూసినా.. యాదవుల ఓట్లు జూబ్లీహిల్స్‌లో పదిహేనువేలకు మించిలేవు. BRS కంచుకోటలా మారిన ఈ స్థానంలో.. మిగితా బీసీ వర్గాలన్నీ గంపగుత్తగా నవీన్ యాదవ్ వెంట నిలుస్తాయనీ చెప్పలేం. ఒకవేళ ఎంఐఎం మద్దతునిస్తుందనుకున్నా.. లక్ష వరకూ ఉన్న ముస్లిం ఓట్లు.. పూర్తిస్థాయిలో టర్నవుతాయనీ బలంగా అంచనావేయలేని పరిస్థితి. ఓవైపు సింపతీ యాంగిల్‌లో మాగంటి కుటుంబం ఇప్పటికే జనంలోకి దూసుకెళ్తోంది. బీజేపీ సైతం టఫ్ ఫైట్ ఇచ్చేందుకు సై అంటోంది. ఈ ఈక్వేషన్స్ అన్నీ ఒకెత్తయితే.. కలహాల కాంగ్రెస్‌లో ఎన్నికలవేళ అంతా కలిసి పనిచేయడమన్నది మరో ఎత్తు. మరీ ఈ ఎత్తుల్ని నవీన్‌యాదవ్ ఎలా అధిగమిస్తారనేదే ఆసక్తికర అంశం.

# ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడి వివాహ వేడుకకు బాలకృష్ణ తో కలిసి హాజరైన మంత్రి లోకేష్

**మంగళగిరి అక్టోబరు 11, ( వెలుతురు)**

కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడి వివాహ వేడుకలో మామయ్య నందమూరి బాలకృష్ణ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్




పాల్గొన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ లో జరిగిన వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులు సందీప్, బిందు శ్రీ లేఖలను ఆశీర్వదించారు. వారికి పుష్పగుచ్ఛం అందించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

వెలుతురు



# ఎంగేజ్‌మెంట్..పెళ్లి వార్తలు..అంతా సీక్రెట్

## ఎంగేజ్మెంట్ రింగులతో దర్శనమిస్తున్న రౌడీజంట

వారం రోజులుగా సోషల్ మీడియాను ఓ వార్త కుదిపేస్తోంది. రష్మిక, విజయ్ దేవరకొండ ఎంగేజ్ మెంట్ జరిగిందని.. ఫిబ్రవరిలో పెళ్లి అంటూ ఒకటే రూమర్లు. సోషల్ మీడియా నుంచి మెయిన్ స్ట్రీమ్ మీడియా వరకు ఇదే వైరల్ అవుతోంది. కానీ ఈ జంట మాత్రం సైలెంట్ గా ఉంటుంది. తమకు అసలు ఎంగేజ్ మెంట్ అయిందో లేదో అనే విషయంపై కూడా క్లారిటీ ఇవ్వట్లేదు. ఎలాంటి ఫొటోలు బయటకు రాకుండానే ఈ వార్తలు దేశ వ్యాప్తంగా వైరల్ అవుతున్నాయి. పెళ్లి విషయంలో ఎందుకు ఇంత సస్పెన్స్‌గా ఉంచుతున్నారో ఎవరికీ అర్థం కావట్లేదు. కనీసం తమ అభిమానుల కోసమైనా.. ఎంగేజ్ మెంట్ గురించి చెప్పొచ్చు కదా. అలా చెప్పకుండా ఎవరి సినిమాల్లో వారు బిజీగా ఉంటున్నారు. ఇన్ని రోజులు ప్రేమ విషయంలో ఎలాగూ సస్పెన్స్ మెయింటేన్ చేశారు. ఇప్పుడు ముఖ్యమైన పెళ్లి విషయంలో ఎందుకు ఇంత సీక్రెట్. వీళ్లు స్పందించికపోయేసరికి అసలు నిజంగా ఎంగేజ్ మెంట్ జరిగిందా లేదా అనే అనుమానాలు పెరుగుతున్నాయి. రకరకాల రూమర్లు వస్తున్నాయి. అక్టోబర్ 3న వీరి నిశ్చితార్థం జరిగిందని సన్నిహితులు వెల్లడించినట్లు వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా వీరిద్దరూ ఉంగరాలు పెట్టుకొని కనిపించడంతో వీరి ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఇటీవల విజయ్ దేవరకొండ పుట్టపర్తి వెళ్లారు. అక్కడ ఆయన చేతికి బంగారపు ఉంగరం కనిపించడంతో అందరూ అది ఎంగేజ్‌మెంట్ రింగ్ అంటూ ఫొటోలు షేర్ చేశారు. తాజాగా



నేషనల్ క్రష్ రష్మిక తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టారు. తన అప్‌కమింగ్ సినిమా 'థామా'లోని 'నువ్వు నా సొంతమా' పాట గురించి అందులో రాసుకొచ్చారు. అందులో రష్మిక చేతికి వజ్రపు ఉంగరం కనిపించడంతో మరోసారి వీరి ఎంగేజ్‌మెంట్ వార్త వైరల్ అవుతోంది. వీరిద్దరూ కలిసి 'గీత గోవిందం'లో నటించి మంచి ఆన్‌స్క్రీన్ పెయిర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ సినిమా సూపర్‌హిట్‌గా నిలిచింది. దీని తర్వాత 'డియర్ కామ్రేడ్'తో అలరించారు. ప్రస్తుతం రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ రూపొందిస్తున్న పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ దేవరకొండ నటిస్తున్నారు. ఇందులోనూ రష్మికనే కథానాయికగా కనిపించనున్నట్లు తెలుస్తోంది.





# రౌడీ జనార్ధన్‌గా వస్తున్న విజయ్ దేవరకొండ

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు విజయ్ దేవరకొండ.. ఈ హీరో మరో చిత్రం 'రౌడీ జనార్దన్' ప్రారంభమైంది. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో విజయ్ సరసన కీర్తి సురేశ్ నటిస్తున్నారు. శనివారం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. నిర్మాత అల్లు అరవింద్ కల్‌ఆప్ కొట్టారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట షేర్ అవుతున్నాయి. ఈ కార్యక్రమానికి నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్ హాజరయ్యారు. 'రాజావారు రాణిగారు' సినిమాతో తెలుగు ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడే రవికిరణ్ కోలా. తొలి మూవీకి భిన్నంగా ఈసారి విజయ్‌తో యాక్షన్‌కు ప్రాధాన్యం ఉన్న కథను తెరకెక్కించనున్నారు. ఈనెల 16 నుంచి ముంబయిలో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటిసారి విజయ్ సరసన కీర్తి సురేశ్ కనిపించనుండడంతో దీనిపై ఆసక్తి ఏర్పడింది.

# మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అదృష్టం


## బిగిబి అమితాబ్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన ప్రభాస్



బాలీవుడ్ సూపర్ స్టార్ హీరో అమితాబ్ బచ్చన్ అక్టోబర్ 11న అంటే..శనివారం 83వ ఏడాదిలోకి అడుగు పెట్టారు. ఈ సందర్భంగా అతడికి సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుఉన్నాయి. టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా బిగ్ బీకి బర్త్ డే విషెస్ తెలిపారు. ఈ పోస్టులో 'మీకు దగ్గర ఉండి మీ వర్క్‌ను చూడడం, మీతో కలిసి స్క్రీన్ పంచుకోవడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను.. మీరు ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలి అంటూ రెబల్ స్టార్ ప్రభాస్ విషెస్ చేశారు. ఇక, వీరిద్దరి కాంబినేషన్‌లో గతేడాది విడుదలైన 'కల్కి 2898 ఏడీ' థియేటర్లలో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ మూవీ రూ.1000 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో అమితాబ్ బచ్చన్.. అశ్వత్థామగా, ప్రభాస్ భైరవగా నటించారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్రస్తుతం 'కల్కి2'కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఈ భారీ ప్రాజెక్ట్ నుంచి ఇప్పటికే దీపిక పదుకొణెను వైజంతి మూవీస్ తొలగించిన విషయం తెలిసిందే. దీంతో కల్కి2 సీక్వెల్‌లో ఆమె పాత్రను ఎవరు పోషిస్తారా అనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ఈ పాత్రలో బాలీవుడ్ క్వీన్ అలియా భట్ నటించనున్నట్లు న్యూస్ వస్తుంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన కోసం అభిమానులు వేచి చూస్తున్నారు.

# లక్‌కోసం ఎదురు చూస్తున్న కృతిశెట్టి

తొలి సినిమాతోనే తెలుగులో గ్రాండ్ సక్సెస్ అందుకున్న భామల్లో ఒకరు కృతిశెట్టి. ఉప్పెన సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. అద్భుతమైన నటనతో కుర్రకారు మనసు దోచేసిన కృతిశెట్టి ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంది. కానీ ఆ తర్వాత చేసిన సినిమాలు మాత్రం కృతిశెట్టికి నిరాశనే మిగిల్చాయని చెప్పాలి. కృతిశెట్టి హీరోయిన్‌గా నటించిన కస్టడీ, మనమే, ది వారియర్, మాచెర్ల నియోజకవర్గం సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఈ వరుస ఫెయిల్యూర్స్ టాలీవుడ్‌లో కృతిశెట్టి ప్రయాణంపై ప్రభావం చూపించాయి. అయితే ఇక చేసేదేమి లేక తమిళంలో తన లక్‌ను పరీక్షించుకోవాలనుకున్నకృతిశెట్టి అక్కడ మూడు సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాపులర్ యాక్టర్లతో సినిమాలు చేసి.. షూటింగ్స్ పూర్తి చేసినా పలు కారణాల వల్ల ఆలస్యమవుతూ వచ్చాయి. తీవ్ర నిరాశలో ఉండిపోయిన కృతిశెట్టి అభిమానుల కోసం వరుసగా ఆ సినిమాలు విడుదలకు రెడీ అయ్యాయి. పై మూడు సినిమాలు ఒకేసారి ఒకే నెలలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. ఈ మూడు ప్రాజెక్టులు కూడా డిసెంబర్ నెలలోనే రిలీజ్ కాబోతుండటం విశేషం. కృతిశెట్టి కార్తీతో కలిసి నటిస్తున్న వా వాథియార్, ప్రదీప్ రంగనాథన్ లవ్ ఇన్సూరెన్స్, రవిమోహన్ సినిమాలు డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. చాలా కాలంగా సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న కృతిశెట్టికి ఈ డిసెంబర్ అయినా కలిసి రావాలని కోరుకుంటున్నారు అభిమానులు, ఫాలోవర్లు.



# ఓ భారీ సినిమా కోసం కష్టపడుతున్నా


## అల్లుతో సినిమాపై అట్లీ కామెంట్స్



అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా గురించి అట్లీ ఓ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రేక్షకులు ఆశ్చర్యపోయే ప్రపంచాన్ని సృష్టించనున్నట్లు తెలిపారు. తాజాగా బెంగళూర్‌లో జరిగిన పికిల్‌బాల్ టోర్నమెంట్‌కు అట్లీ అతిథిగా హాజరయ్యారు. ఇందులో ఈ మూవీ గురించి మాట్లాడారు. 'ఏదైనా ఒక్క ఆలోచనతోనే ప్రారంభమవుతుంది. ఈ సినిమాతో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వడానికి మేం ప్రయత్నిస్తున్నాం. ఆడియన్స్ ఆశ్చర్యపోయేలా కొత్త ప్రపంచాన్ని సృష్టించనున్నాం. దేవుడు మా ప్రయాణంలో ప్రతి అడుగులోనూ తోడున్నాడు. ఆయన దయ వల్ల అంతా మేం అనుకున్నట్లే జరుగుతుందని ఆశిస్తున్నా. ఇంత భారీ ప్రాజెక్ట్‌ను రూపొందించడం రిస్క్‌గా అనుకోవడం లేదు. నేను దీన్ని ఎంజాయ్ చేస్తున్నా మరి కొన్ని నెలల్లో మీరు దీన్ని ఆస్వాదిస్తారని అట్లీ తెలిపారు. ఇక తాజాగా వచ్చిన 'కాంతార చాప్టర్ 1'పై అట్లీ ప్రశంసలు కురిపించారు. అదో అద్భుతమన్నారు. 'కాంతార 1'ను నేను మొదటి రోజు చూశాను. విదేశాల్లో ఉండడంతో థియేటర్‌కు వెళ్లడం కోసం దాదాపు రెండున్నర గంటలు డ్రైవ్ చేసుకుంటూ వెళ్లాను. సినిమా చూడగానే రిషబ్‌కు ఫోన్ చేసి అభినందించా. నేను చాలా గౌరవించే వ్యక్తుల్లో రిషబ్ ఒకరు. నాకు మంచి స్నేహితుడు. ఇలాంటి సినిమాను రూపొందించడం ఎంత కష్టమో ఒక దర్శకుడిగా నాకు తెలుసు. రిషబ్ ఎంతోమందికి స్ఫూర్తి. ఆయన ఈ సినిమాతో మరో జాతీయ అవార్డు గెలుచుకోవాలని ఆశిస్తున్నానని అట్లీ తెలిపారు.

# పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తున్న కె ర్యాంప్ ట్రైలర్.. అంచనాలు రెట్టింపు

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం మరోసారి తన ప్రత్యేక కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యాడు. తాజాగా విడుదలైన కె ర్యాంప్ ట్రైలర్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ట్రైలర్ విడుదలైన కొన్ని గంటల్లోనే యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లోకి చేరింది. కిరణ్ అబ్బవరం నటన, హాస్య పంచులు, రొమాంటిక్ ట్రాక్ అన్ని ప్రేక్షకులను బాగా





ఆకట్టుకుంటున్నాయి. "అలా కాళ్లూపకూడదేమో బాబూ" అని బామ్మ చెప్పగా, "నేను ఊపడం లేదు బామ్మా.. నా గర్ల్‌ఫ్రెండ్ ని తలుచుకుంటే వాటంతట అవే ఊగుతున్నాయి" అనే రిప్లయ్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. అలాగే "కనీసం ఈరోజైనా డబ్బున్నోడిలా బిహేవ్ చేయ్ రా", "వరమిస్తానంటూ నా వెంటపడుతున్నాడు సార్", "లవ్ చేస్తే లైఫ్ ఇస్తానని వరమిచ్చాను సార్", "పెద్దయ్యాక నా జీవితం ఇలా ఉంటుందని తెలిస్తే చిన్నప్పుడే కుత్తిక పిసుక్కొని చచ్చిపోయేవాడిని" వంటి పంచ్‌లతో ప్రేక్షకులు నవ్వులు పూయిస్తున్నారు. ట్రైలర్ మొత్తం చూస్తే దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణ శైలిని గుర్తు చేస్తోంది. హాస్యం, రొమాన్స్ మేళవించిన ఎంటర్‌టైనర్‌గా సినిమా ఉంటుందని అంచనా వేస్తున్నారు సినీ లవర్స్. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన యుక్తి తరేజ హీరోయిన్‌గా నటిస్తోంది. వీకే నరేష్, వెన్నెల కిషోర్, సాయి కుమార్, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహించగా, హాస్య మూవీస్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. మొదట టీజర్ విడుదలైనప్పుడు కొంతమంది ఈ సినిమాను అడల్ట్ ఎంటర్‌టైనర్‌గా భావించినప్పటికీ, ట్రైలర్‌తో ఆ అనుమానాలకు ముగింపు పలికారు. పూర్తి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా కనిపిస్తున్న ఈ చిత్రం, కిరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకం అభిమానుల్లో ఉంది. దీపావళి కానుకగా ఈ నెల 18న గ్రాండ్‌గా విడుదల కానుంది. సినీ సర్కిల్స్ టాక్ ప్రకారం ఈ చిత్రం ఇండియా వైడ్‌గా దాదాపు రూ.8 కోట్ల బ్రేక్ ఈవెన్ టార్గెట్‌తో బరిలోకి దిగుతుందట. అంటే ఈ చిత్రం వసూలు చేయాల్సిన గ్రాస్ రూ.16 కోట్లు. దీపావళి బరిలో మొత్తం ఆరు సినిమాలు(మూడు తెలుగు, మూడు డబ్బింగ్) రిలీజ్ అవుతుండటంతో పోటీ తీవ్రంగా ఉంది.

# సిద్ధూ సినిమా..ఓ రొమాంటిక్ డ్రామా

## హీరోయిన్ శ్రీనిధిశెట్టి

కేజీఎఫ్ సినిమాతో హీరోయిన్‌గా బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది శ్రీనిధి శెట్టి. తెలుగులో నానితో హిట్ 3లో కలిసి నటించింది. ఈ భామ ప్రస్తుతం సిద్దుజొన్నలగడ్డతో రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెలుసు కదా సినిమాలో నటిస్తుంది. ఈ మూవీ అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా గురించి ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది శ్రీనిధిశెట్టి. చిట్ చాట్ సెషన్‌లో శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ.. కేజీఎఫ్, హిట్ 3 లాంటి వయోలెన్స్, రక్తపాతం చుట్టూ తిరిగే సినిమాల తర్వాత సున్నిత భావోద్వేగాలతో సాగే సినిమా ఇది. ఈ మూవీ నాకు ఉత్తేజాన్ని కలిగించే మార్పులాంటిది. ఈ చిత్రాన్ని ప్రతీ ఒక్కరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నానంది. తెలుసు కదా ప్రేమ, ఎమోషన్, నవ్వులు, అందమైన పాటలతో సాగే కమర్షియల్ సినిమా. ఈ సినిమా చూసిన తర్వాత మూవీ లవర్స్ ఒక అందమైన రొమాంటిక్ డ్రామాను చూసినట్టు ఫీల్ అవుతారంది శ్రీనిధి శెట్టి . సినిమాకు పనిచేయడం గురించి మాట్లాడుతూ.. నాకు డైరెక్టర్ నీరజ కోన, సిద్ధు, రాశీ ఖన్నాతో కలిసి నటించే అద్భుతమైన సమయం దొరికింది. నీరజ కోన చాలా సపోర్ట్‌గా నిలిచే వ్యక్తి. ప్రేక్షకులు ఖచ్చితంగా సిద్ధు పాత్రతో ప్రేమలో పడిపోతారు. అతడికి ప్రతీ విభాగంలో అద్భుతమైన ప్రావీణ్యం ఉంది. రాశీఖన్నా చాలా క్రమశిక్షణతో ఉండే వ్యక్తి అని చెప్పుకొచ్చింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి పనిచేయడం గొప్పగా భావిస్తున్నానంది. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉన్న నిర్మాతలతో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానంది శ్రీనిధిశెట్టి.



## మతిస్థిమితం తప్పి మాట్లాడుతున్న పేర్ని

**- మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర**



**విజయవాడ,అక్టోబర్11( వెలుతురు):**
బందరులో ఓటమికి పేర్ని నాని మతిస్థిమితం కోల్పోయి బజారు రౌడీలా ప్రవర్తిస్తున్నారని మాజీ మంత్రి పేర్నినానిపై మంత్రి కొల్లు రవీంద్ర తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పేర్నీ నాని తీరుపై మండిపడ్డారు. ఒకప్పుడు ప్రజా ప్రతినిధిని అనే విచక్షణ మరిచి పశువు కంటే హీనంగా వ్యవహరిస్తున్నారని ఫైర్ అయ్యారు. కల్తీ మద్యం కేసులోనే పేర్ని నాని అరెస్టై జైలుకెళ్లిన సంగతి మరిచారా అని ప్రశ్నించారు. బందరులో తెలుగుదేశం నాయకుల్ని తాను కంట్రోల్ చేస్తున్నా కాబట్టి పేర్ని నాని ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు తమకు నేర్పిన క్రమశిక్షణ కారణంగానే తెలుగుదేశం శ్రేణులు సంయమనం పాటిస్తున్నారని వెల్లడించారు. టీడీపీ నాయకులు ఎక్కడ కంట్రోల్ తప్పుతారో అనే భయంతో వారిని రోజూ సముదాయించాల్సి వస్తోందన్నారు. ఇదే తీరు కొనసాగితే పేర్ని నాని తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. టీడీపీ శ్రేణులతో తన్నులు తిని సానుభూతి పొందాలని పేర్ని నాని భావిస్తున్నాడేమో అంటూ ఎద్దేవా చేశారు. పేర్ని నాని ఆగడలపై న్యాయ సలహా తీసుకుని చట్టపరంగా ముందుకెళ్తున్నా మన్నారు. అతని అసత్య ప్రచారాలపై పరువు నష్టం దావా కూడా వేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మొలకల చెరువు కల్తీ మద్యంపై పూర్తి విచారణ జరుగుతోందని తెలిపారు. 20 మందిలో 14 మందిని అరెస్టు చేశామని.. జనార్ధన్‌ను కూడా కస్టడిలోకి తీసుకున్నామన్నారు. కల్తీ మద్యానికి లింక్‌లో ఉన్న వైన్ షాపును సీజ్ చేశామని తెలిపారు. బెంగళూరు, ఏపీ రాష్ట్రాలలో నాలుగు టీంలు పెట్టామని.. ప్రతీ షాపుకు క్లియర్ ఇన్‌స్ట్రక్షన్లు ఇచ్చామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

## పోలీసు విధులకు ఆటంకం

**- వైసీపీ నేత పేర్ని నానిపై పోలీసుల కేసు**



**మచిలీపట్నం,అక్టోబర్11( వెలుతురు):**
మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పేర్ని నానిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు డిఎస్పి సిహెచ్ రాజా స్పష్టం చేశారు. శుక్రవారం మచిలీపట్నం పోలీసు స్టేషన్‌లో నాని తన అనుచరులతో కలిసి పోలీస్ అధికారి విధులకు ఆటంకం కలిగించారని, ఆర్.పేట సీఐ ఏసుబాబుపై దౌర్జన్యం చేశారని తెలిపారు. ఈ మేరకు చిలకలపూడి స్టేషన్‌లో సెక్షన్ 353,506 క్రింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం వైసీపీ నేత సుబ్బన్నను ఓ కేసు విచారణ కోసం పోలీసులు పిలిచారు. ఈ క్రమంలో అక్కడికి వెళ్లిన పేర్ని నాని సీఐ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు హల్‌చల్ చేశారు. సీఐతో పేర్ని నాని గొడవకు దిగారు. మెడికల్ కాలేజీ ధర్నా కేసులో తన అనుచరుడిని వేధిస్తున్నారని, విచారణ పేరుతో రోజూ స్టేషన్ కు పిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి రాగానే తానంటే ఏమిటో ఏపీ పోలీసులకు చూపిస్తానని పేర్ని నాని హెచ్చరించారు. ఈ ఉదంతానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో తీవ్రంగా పరిగణించిన ఎస్పీ.. మాజీ మంత్రిపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

## దళితుల ముసుగులో దగాకోరు రాజకీయాలు

**- వైకాపా తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత**



**చిత్తూరు,అక్టోబర్11( వెలుతురు):**
దళితులకు న్యాయం చేయలేని వైకాపా పెద్దలు వారి ముసుగులో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఏపీ హోం మంత్రి అనిత మండిపడ్డారు. దళితుల జోలికొస్తే తీవ్ర చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వెదురుకుప్పం మండలం దేవలంపేటలో ఇటీవల జరిగిన అంబేద్కర్ విగ్రహం కాల్చివేత ఘటన నేపథ్యంలో.. శనివారం ఆ ప్రదేశాన్ని మంత్రి పరిశీలించారు.ప్రజలు బుద్ధి చెప్పినా వైకాపా నేతల తీరు మారలేదు. నకిలీ మద్యం తయారీపై కఠిన చర్యలు తప్పవు. సొంత పార్టీ నేతలున్నా చర్యలకు వెనుకాడం. అక్రమాలకు పాల్పడిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. నకిలీ మద్యం తయారీలో భాగస్వాములందరిపై కేసులు పెడతాం. అందులోని సూత్రధారులనూ బయటపెడతాం. దీని వెనుక ఉన్న కుట్రలను ఛేదిస్తాం అనిత అని పేర్కొన్నారు. మాజీమంత్రి పేర్ని నాని మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మరీ పోలీసులను బెదిరించడం దారుణమని ఈ సందరభంగా మంత్రి అనిత అన్నారు. అతని చర్యలు పోలీసులను అవమానించేలా ఉన్నాయన్నారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో శనివారం హోం మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పేర్ని నానిపై చర్యలు తీసుకుంటామన్నారు. తప్పు చేసిన వారికి నోటీసులిస్తామని, కేసులు పెడతామని హెచ్చరించారు.

# కల్తీ మద్యానికి కర్త,కర్మ, క్రియ జగన్

**- ఆనాటి కల్తీ మద్యం కేసులను మరిచారా**

**- జగన్ తీరుపై మండిపడ్డ వర్ల రామయ్య**

**అమరావతి,అక్టోబర్11( వెలుతురు):**
గత 6 సంవత్సరాలుగా రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారటానికి కర్త, కర్మ, క్రియ జగనే అని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కల్తీ మద్యం కుట్రదారులను ప్రోత్సహిస్తూ, కల్తీ మద్యానికి మూల విరాట్ కూడా జగనే అని అన్నారు. జగన్ దాయాదులైన వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి సౌత్ ఆఫ్రికాలో మద్యం వ్యాపారం చేస్తున్నారనేది నిజం కాదా అని ప్రశ్నించారు. వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి.. జగన్ వ్యాపార బినామీలు అవునా, కాదా? అని నిలదీశారు. దాయాదుల మద్యం వ్యాపారంలో కల్తీ జరుగుతోందని సౌత్ ఆఫ్రికా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారనేది నిజం కాదా అని అన్నారు. వైసీపీ కోవర్ట్ జయచంద్రా రెడ్డి.. వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి క్యాంప్‌లో తలదాచు కున్నారనేది నిజం కాదా అని మరో ప్రశ్న సంధించారు. మీరు ముఖ్యమంత్రిగా ఉండగా జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 27 మంది చనిపోతే, ఆ కేసును తప్పుదారి పట్టించింది మీరు కాదా? మీ పార్టీ నాయకుడు మల్లాది విష్ణు బార్‌లో కల్తీ మద్యం తాగి 6 గురు చనిపోతే, అతన్ని ఎందుకు సస్పెండ్ చేయలేదు? గతంలో సర్వేపల్లి, కావలి నియోజకవర్గాల్లో మీ నాయకులు కాకాణి గోవర్ధన్, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కల్తీ మద్యంలో భాగస్వాములైనది నిజం కాదా? వారిపై కేసులు ఉన్నది నిజం కాదా? వారిపై మీ పార్టీ తరఫున క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోలేదు? మీ పార్టీ కోవర్ట్ అయిన జయచంద్రా రెడ్డిపై ప్రభుత్వం లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి, పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. జయచంద్రా రెడ్డి ఇప్పుడు ఎక్కడ తలదాచుకున్నాడో మీకు తెలియదా, జగన్ గారు? మీరు ముఖ్యమంత్రిగా ఉండగా మీరు సరఫరా చేసిన మద్యంలో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు చెన్నై, బెంగళూరు ల్యాబ్‌లు నిర్ధారించింది నిజం కాదా? బాధ్యులపై వెంటనే చర్యలు ఎందుకు తీసుకోలేదు? నిన్న ఏలూరులో మద్యం తాగి ఒక వ్యక్తి చనిపోతే, అది కల్తీ మద్యంగా ప్రచారం చేశారు. అది కల్తీ మద్యం కాదని ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ నిర్ధారించింది. దీనిపై మీ సమాధానం ఏమిటి జగన్? కల్తీ మద్యం సరఫరాకు మూలవిరాట్ మీరే అని మేము చెబుతున్నాం. దీనిపై బహిరంగ చర్చకు మీరు సిద్ధమా?' అంటూ జగన్‌పై వర్ల రామయ్య ప్రశ్నల వర్షం కురిపించారు.



# రాష్ట్రంలో అంతటా కల్తీమయం

**- విద్యాంధ్ర కాస్తా మద్యాంధ్రగా మార్పు**

**- మహిళలంటే కూటమి నేతలకు గౌరవం లేదు**

**- వైకాపా మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి**

**విశాఖపట్టణం,అక్టోబరు11( వెలుతురు):**
రాష్ట్రంలో ఉన్నది కూటమి ప్రభుత్వం కాదని.. కల్తీ ప్రభుత్వమని వైయస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విశాఖపట్నం వైసిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ పిల్లలకిచ్చే తాగునీరు మొదలు భోజనం, ఆసుపత్రిలో మందులు, మద్యం సహా అంతా కూటమి పాలనలో కల్తీమయమైందని మండిపడ్డారు. నాడు వైయస్.జగన్ హయాంలో విద్యాంధ్రగా ఉన్న ఏపీ చంద్రబాబు పాలనలో మధ్యాంధ్రగా మారిందని ఆక్షేపించారు. కల్తీ ప్రభుత్వం తీరు ప్రజలకు అర్ధమైందని.. ప్రజా కోర్టులో కూటమి నేతలకు తగిన శిక్ష ఖాయమని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వానికి మహిళలంటే ఏ కోశాన గౌరవం లేకపోగా? చంద్రబాబునాయుడికి, టిడిపి నేతలకు మహిళల మాన ప్రాణాలంటే కూడా లెక్కలేదు. తమ ముడుపులు కోసం ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కల్తీమద్యం కుంభకోణమే ఇందుకు నిదర్శనం. దేశంలోనే అతిపెద్ద కల్తీమద్యం కుంభకోణం కూటమి ప్రభుత్వ హయాంలోనే పట్టుబడింది. ఈ కుంభకోణంలో సూత్రధారులు, పాత్రధారులు కూడా టీడీపీ నేతలేనని సాక్షాత్తూ ఎక్సైజ్ శాఖ అధికారులే చెప్పారు. తెలుగుదేశం పార్టీ నాయకులే ఊరూరా కల్తీ మద్యం సరఫరా చేస్తున్నారు. అలాంటి దుస్థితి రాష్ట్ర ప్రజలకు వచ్చింది. టీడీపీ నేతలు మహిళలు, ప్రజల ప్రాణాల పట్ల బందిపోట్లు, దోపిడీ దొంగల కంటే ఘోరంగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో నారా వారి పాలన కాస్తా కల్తీ సారావారి పాలనగా మారింది. రాష్ట్రాన్ని చీఫ్ మినిష్టర్ పరిపాలిస్తున్నట్టు కాక చీఫ్ లిక్కర్ మాఫియా పాలిస్తున్న చందంగా తయారైంది. ఇది మంచి ప్రభుత్వం కాదు.. రాష్ట్రాన్ని కల్తీ మద్యంలో ముంచే ప్రభుత్వమన్న విషయం కూడా తేలిపోయింది. ప్రజలకు అందిస్తున్నది కూడా సుపరిపాలన కాదు కల్తీపాలన అన్నది కూడా ప్రజలకు అర్థమయింది. ఇది కూటమి ప్రభుత్వ పాలన కాదు, కల్తీ ప్రభుత్వ పాలన, ప్రజలకు అందుతున్నది గుడ్ గవర్నెన్స్ కాదు.. కల్తీ మద్యాన్ని అందిస్తున్న పాలన అన్న విషయం కూడా తేలిపోయింది. వైయస్ జగన్ హయాంలో రాష్ట్రాన్ని నాణ్యమైన విద్యాంధ్రప్రదేశ్, వైద్యాంధప్రదేశ్‌గా మార్చాలని తాపత్రయపడితే.. చంద్రబాబు నాయుడు మాత్రం నాసిరకం మధ్యాంధప్రదేశ్‌గా మార్చడానికి ప్రయత్నిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కారణం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన దగ్గర నుంచి రాష్ట్రంలో మద్యం అమ్మకాలు జోరు పెరగ్గా.. కల్తీ మద్యం అమ్మకాల కోసం అయితే చంద్రబాబు ఏకంగా ప్రణాళికలు రచిస్తున్నారు.




# ప్రజా సమస్యల పరిష్కార వేదికగా సిపిఎం కార్యాలయం

**- సిపిఎం పట్టణ కార్యాలయ ప్రారంభంలో గఫూర్**

**- కార్పోరేట్ శక్తులకు దాసోహమైన కూటమి, బిజెపి ప్రభుత్వాలు**

**కర్నూలు,అక్టోబరు11( వెలుతురు):**
ప్రజా సమస్యల పరిష్కార వేదికగా సిపిఎం కార్యాలయం కేంద్రీకృతం కావాలని, ప్రజా పోరాటాలకు అందరూ సంఘటితంగా పోరాడాలని మాజీ ఎమ్మెల్యే ఏంఏ గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని తేరు బజార్ లోని సిపిఎం పుచ్చలపల్లి సుందరయ్య భవనం కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ జెండాను సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం పద్మశాలి కళ్యాణ మండపంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య భవన ప్రారంభోత్సవ సభ పట్టణ పార్టీ కార్యదర్శి గోవిందు అధ్యక్షతన నిర్వహించారు.. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎం ఏ గఫూర్ మాట్లాడుతూ దేశంలోని బిజెపి ప్రభుత్వము, రాష్ట్రంలో తెలుగుదేశం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వము కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందన్నాటంలో ఇటువంటి సందేహం లేదన్నారు. 11 సంవత్సరాల క్రితం దేశంలో తాను ప్రధానమంత్రిని అయితే స్విస్ బ్యాంకులో భారతదేశం రాజకీయ నాయకుల పెట్టుబడిదారుల నల్లధనాన్ని తీసుకువచ్చి ఒక్కొక్క కుటుంబానికి ఒక్కొక్క వ్యక్తికి 15 లక్షల చొప్పున వేస్తానని పేర్కొన్నారని, ఇప్పటికీ నల్లధనం తీసుకురాలేదన్నారు. పెద్ద నోట్లు రద్దు చేసిన సమయంలో దేశంలోని పరిస్థితులు మారుస్తానని దేశ పౌరులకు ఆర్థిక పరిస్థితి మెరుగుపరుస్తానని, ఉద్యోగ కల్పన చేస్తానని ఆరు నెలల సమయం అని చెప్పి లేకపోతే నన్ను ఉరి తీయమని మోడీ పేర్కొన్నారని అన్నారు. అయితే ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం భారత దేశ దారిద్ర్యరేఖ దిగువ స్థానాలు 129 వ స్థానంలో భారతదేశం ఉందని, మనకంటే పాకిస్తాన్ రెండు స్థానాలతో 127 స్థానంలో ఉండి మెరుగ్గా ఉందన్నారు. అలాగే శ్రీలంక కూడా మెరుగ్గా ఉందన్నారు. ఇక కొత్తగా జీఎస్టీ ఎత్తివేసామని దీని నుండి ప్రతి కుటుంబానికి పదివేల రూపాయల మిగులు వస్తుందని పేర్కొంటున్నారని, ఎవరి కుటుంబాల్లోనైనా పదివేల మిగులు వచ్చిందని ప్రశ్నించారు. అలాగే దేశవ్యాప్తంగా, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వము జిఎస్టి ఎత్తివేసినట్లు దాని నుండి ప్రజల జీవితంలో మెరుగుదల వచ్చినట్లు సంబరాలు చేసుకుంటున్నాయని జీఎస్టీని అమలు తీసుకువచ్చిందే బిజెపి ప్రభుత్వమని ఇది సిగ్గుచేటు అని, దీని పేరుతో సంబరాలు చేసుకోవడం అనాలోచిత నిర్ణయం అన్నారు. అలాగే దేశంలో 2014 ముందు అధికారంలో రావడానికి రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు తీసుకువస్తామన్నారు. ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలు ఊడగొట్టి ప్రభుత్వ సెక్టార్ లోని అనేక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలు ఊడ కొట్టిన ఘనత బిజెపికి దక్కిందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలో రాకమలుపు కంటే నిరుద్యోగశాతం దేశంలో విపరీతంగా పెరిగిందన్నారు. ఇక ప్రశ్నించే తత్వం వచ్చినప్పుడు అంతా దేశంలో హిందువులు ముస్లింలు, హిందువులు క్రైస్తవుల మధ్య విభజన తీసుకొచ్చి తన పబ్బం గడుపుతుంది అన్నారు. కావున ప్రజలు ఓటు వేసే సమయంలో ప్రజా సంక్షేమ ని ఎవరు కోరుతారు మతం పేరు మీద అభివృద్ధి లేని పార్టీలకు ఓట్లు వేస్తే నిత్యం సమస్యలతో ఉంటామన్నారు. సిపిఎం పార్టీ రాష్ట్ర వర్గ సభ్యులు ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం శ్రీకాకుళం నుండి పుట్టపర్తి వరకు రైతుల భూములను కంపెనీల పేరుతో, సేజ్ పేరుతో సోలార్ కంపెనీలకు అప్పనంగా కట్టబెడుతున్నారని, ఈ విషయంలో రైతులను మభ్యపెడుతున్నారని స్వల్పకాలికంగా రైతులు లబ్ది పొందిన దీర్ఘకాలికంగా నష్టపోతారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వము పత్తి దిగుమతులకు సుంకాన్ని ఎత్తివేయడంతో మన ప్రాంతాల్లో పండించిన పత్తి రైతుకు గిట్టుబాటు ధర లేక నష్టాలపాట పట్టారన్నారు. అలాగే గత సంవత్సరం మిర్చి ధర విపరీతంగా పతనం కావడంతో రైతులు అప్పుల పాలయ్యారు అన్నారు. ఈ సంవత్సరం ఉల్లి రైతు గిట్టుబాటు ధర లేకపోవడంతో పొలాల్లోనే ఉల్లిని వదిలేసుకుంటున్నారన్నారు. అలాగే పత్తికొండ ఆస్పరి ప్రాంతాల్లో టమోటా రైతుకు కిలో రెండు రూపాయలు కూడా దక్కడం లేదని, అలాగే రిటైల్ మార్కెట్లో కిలో 15 నుండి 30 రూపాయలు పలుకుతుందన్నారు. ఇవన్నీ నియంత్రించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరు తినట్లు వ్యవహరిస్తుందన్నారు. అలాగే కర్నూల్ పశ్చిమ ప్రాంతంలో సాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 2019 ఎన్నికల ముందు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం గుండ్రేవుల వేదవతి ఆర్డీఎస్ కుడికాలు శంకుస్థాపన చేశారని మళ్లీ 2024లో అధికారంలో వచ్చి 14 నెలల సమయం కావస్తున్న వాటికోసం ఒక రూపాయి కూడా వెచ్చించలేదన్నారు. ప్రాజెక్టులు ఈ ప్రాజెక్టులో ఈ ప్రాంత ప్రయోజనాలు ఎన్నికల వాగ్దానాలుగా ప్రజలకు అందని ద్రాక్షగా మిగులుస్తున్నారన్నారు. కావున ప్రజలు సంఘటితం కావాలన్నారు. అలాగే సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, జిల్లా సీనియర్ నాయకులు బి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్ రాధాకృష్ణ రైతు సంఘం నాయకులు సి హనుమంతు, సిపిఎం నాయకులు రాముడు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా సాగునీరు తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని ఎన్నికల ముందు పరిష్కరిస్తామని గెలిచిన తర్వాత మర్చిపోతున్నారన్నారు. బతకడానికి సౌకర్యాలు లేక ఆదాయం లేక గ్రామాలను వదిలి వెళ్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో సాగునీటి వనరులను పెంపొందించి , పరిశ్రమ నెలకొల్పి ఉపాధి కల్పించాల్సింది పోయి ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రైతాంగాన్ని విస్మరించారని సంఘటిత అసంఘటిత రంగ రంగంలో కార్మికులకు ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి హామీలు అమలు చేయడం లేదన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి లోకేష్ అంగన్వాడీ టీచర్లకు ఆశ వర్కర్లకు గత ప్రభుత్వంపై పోరాడిన సమయంలో నాడు సమ్మె టెంట్లు దగ్గరకు వచ్చి తాము అధికారంలో వచ్చిన 100 రోజుల్లో తమ డిమాండ్లు నెరవేరుస్తామని తమకు మహిళలంటే ఎంతో ప్రాధాన్యత ఇస్తామన్నారు. ముఖ్యంగా పట్టణంలో చేనేత వర్గాల పరిస్థితి నానాటికి దిగజారుతుందని, వారి జీవితాల్లో మెరుగు చేసే చర్యలు చేపట్టడం లేదన్నారు. అన్ని వర్గాల సమస్యలపై చర్చించి వారిని పోరాటాల వైపు మళ్ళింప చేసి పరిష్కారం చేసేలా పోరాటాలకు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దకడబూరు సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న వివిధ ప్రజాసంఘాల నాయకులు లక్ష్మి నరసయ్య, అబ్దుల్లా, రమేష్, కృష్ణ, తిమ్మన్న, రాజా, రమేష్, చిన్నన్న ఆంథోనీ నబి రసూల్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com